సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 297

బుధవారం 10-7-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'



గౌతముడే శిక్షకుడు

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్.. బీసీసీఐ వెల్లడి - 12లో



కుట్రను కొట్టిపారేయలేం

అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.. హత్రాస్ తొక్కిసలాటపై సిట్ - 6లో



నీ రాక కోసం..

మూడోసారి అంతరిక్ష యాత్రకు వెళ్లిన సునీతా విలియమ్స్.. వ్యోమ నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అక్కడే చిక్కుకుపోయారు.

వివరాలు 6లో ▸



అమెరికాలో నలుగురు తెలుగోళ్ల అరెస్టు

అమెరికాలోని టెక్సాస్‌లో మానవ అక్రమ రవాణా రాకెట్ నడుపుతున్న నలుగురు తెలుగు వాళ్లను అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాలు 10లో ▸

వైట్ పేపర్.. లైట్ తీస్కో..

కరెంట్‌పైనా కోతలే!



పొంతనలేని లెక్కలు..అర్థం లేని ఆరోపణలు

- తెలంగాణ నుంచి బకాయిలు వసూలు చేయనిది ఈ బాబే
- ట్రాన్స్ మిషన్ చార్జీలేని సెకీ విద్యుత్‌కు ట్రాన్స్ మిషన్ చార్జీల కోసమే అధికధర అంటూ వక్రభాష్యం
- థర్మల్ బ్యాక్ డౌన్ చేసి విద్యుత్ సంస్థలపై అదనపు భారం వేసి ఆ నెపం గత ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం
- మిగులు విద్యుత్ ఉండగా అధిక ధరలకు పీపీఏలు కుదిర్చి డిస్కంలను అప్పుల కుప్పలు చేసిన టీడీపీ.. ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెంచి జాప్యం చేసిందే చంద్రబాబు
- వాస్తవాలు దాచి విద్యుత్ పై వైట్ పేపర్ పేరుతో సీఎం చంద్రబాబు ఫీట్లు
- టారిఫ్ పెంపు, ట్రూ అప్ తగ్గింపుపై మాట దాటవేత

2లో


శ్వేత పత్రం... యథార్థాలు చెబుతుందన్న అర్థాన్ని వదిలేస్తే.. జస్ట్ తెల్ల కాగితం! ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు రాసుకోవచ్చు. అందుకే... సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే శ్వేతపత్రాల పరంపర మొదలెట్టారు. పోలవరం.. అమరావతి.... ఇప్పుడు విద్యుత్ రంగం. కాసుల కోసం ప్రత్యేక హోదాపై రాజీ పడి.. ప్యాకేజీగా తెచ్చుకున్న పోలవరాన్ని తమ వారికి కట్టబెట్టేసి... డబ్బులొచ్చే పనులు మాత్రమే చేసి తాను నాశనం చేసిన జీవనాడి పాపాలను సైతం జగన్‌పైకే నెట్టేయడమన్నది తొలి తెల్ల కాగితం సారాంశం. తను ఏలిన ఐదేళ్లూ గ్రాఫిక్స్‌లోనే చూపించిన అమరావతిని కూడా జగనే దెబ్బ తీశారనేది మరో శ్వేతపత్ర కథనం. కోలుకోలేని బకాయిలతో విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేసి... సరఫరా వ్యవస్థను సర్వనాశనం చేసిన చంద్రబాబు... పాత ప్రభుత్వ బకాయిల్ని చెల్లించి విద్యుత్ వ్యవస్థను పట్టాలెక్కించిన జగన్‌పై మూడో పత్రం సహితంగా మరిన్ని అసత్యాలు వండివార్చారు. ఏడు అంశాలపై శ్వేతపత్రాలు తెస్తానని ముందే చెప్పిన బాబు... తన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేయటానికి ముందే కొంత ప్రిపేరయ్యారనేదే ఈ రోత పత్రాల లోగుట్టు!! ఇక విద్యుత్తుపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ఏర్పాట్లు సరిగా లేవని ఉద్యోగులను బెదిరిస్తూ.. బాబు తన సహజ ధోరణి ప్రదర్శించారు!

విద్యుత్తు రంగానికి అపార నష్టం

- జగన్ నిర్ణయాలతో రూ.1,29,503 కోట్ల నష్టం.. శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు
- ఐదేళ్లలో ప్రజలపై చార్జీల రూపంలో రూ.32,166 కోట్ల భారం
- గతంలో పవర్ సెక్టార్‌లో తెచ్చిన సంస్కరణల వల్ల నా పవర్ పోయింది
- గత ప్రభుత్వం వివిధ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలపై సమీక్ష చేస్తాం
- అధికారులు సరిగా పని చేయకున్నా చర్యలు తీసుకుంటానని హెచ్చరికలు

2లో

టీటీడీ.. మాకే కావాలి!



- చైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్న టీడీపీ, జనసేన
- టీడీపీ నుంచి రేసులో అశోక్ గజపతి రాజు, వేమిరెడ్డి ప్రశాంతి, రఘురామ
- నాగబాబు కోసం పావులు కదుపుతున్న జనసేన

- వివరాలు 3లో ▸

ఈ ఏడాది డీఎస్సీ లేనట్టే

డిసెంబర్ నాటికి నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్న హామీ గాలికి

- టెట్(జూలై)–2024 షెడ్యూల్‌లో మార్పులు
- ఆగస్టులో జరగాల్సిన పరీక్షలు అక్టోబర్‌కు వాయిదా
- నవంబర్‌లో టెట్ ఫలితాలు.. మూడు నెలల తర్వాత డీఎస్సీ
- ప్రైవేటు ఉద్యోగాలు మానుకుని సిద్ధమవుతున్న అభ్యర్థులు
- నోటిఫికేషన్ ఆలస్యంతో ఆందోళన



సాక్షి, అమరావతి: అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రకటించి ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ నీరుగారుతోంది. ముఖ్యమంత్రిగా తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే చేయడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో చిగురించిన ఆశలు సన్నగిల్లుతున్నాయి. డిసెంబర్ నాటికి మొత్తం ప్రక్రియ పూర్తిచేస్తామని స్వయానా ముఖ్యమంత్రే చెప్పడంతో చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు వదిలేసి అభ్యర్థులు పరీక్ష కోసం సిద్ధమవుతున్నారు. నిరుద్యోగులు అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం టెట్ షెడ్యూల్‌ను మార్చడం వారికి ఆందోళన కలిగిస్తోంది. టెట్, డీఎస్సీ మధ్య కనీసం 90 రోజులు గడువు కావాలని నిరుద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేయడం వల్లే టెట్ షెడ్యూల్‌ను మార్చామని ప్రభుత్వం చెబుతోంది. అలాగే కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసినవారికి కూడా అవకాశం కల్పించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొంటోంది. అయితే నిజానికి వచ్చే విద్యా సంవత్సరం వరకు ఈ పోస్టులను భర్తీ చేసే ఆలోచన ప్రభుత్వానికి లేనట్టు తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ప్రకారం టెట్‌ను అక్టోబర్ 3 నుంచి 20 వరకు నిర్వహించనుంది. టెట్ ఫలితాలను నవంబర్‌లో విడుదల చేయనుంది. ఆ తర్వాత మూడు నెలలకు అంటే వచ్చే ఏడాదిలోనే డీఎస్సీ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో మరో 8 నెలలపాటు డీఎస్సీ

మిగతా 3వ పేజీలో ▶



..అలవాటు ప్రకారం అలానే ఆహ్వానిస్తున్నార్సార్



ప్రధాని మోదీని రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్'తో సత్కరిస్తున్న పుతిన్

బాంబులు, తూటాల నడుమ...

శాంతి చర్చలు సాగవు

- పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ.. ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు
- క్షిపణి దాడిలో చిన్నారుల మృతిపై ఆవేదన
- పరిష్కారానికి మోదీ కృషికి పుతిన్ కృతజ్ఞతలు
- శాంతియుత పరిష్కారమే భారత్ వైఖరి: మోదీ
- 22వ ఇండో–రష్యా శిఖరాగ్రంలో నేతల చర్చలు
- ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ సంయుక్త ప్రకటన

6లో

కిరాతక నేరస్తుడిని ఆలింగనం చేసుకుంటారా?

ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణి దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా 37 మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి చెందిన నాయకుడు.. ప్రపంచంలోనే అత్యంత కిరాతక నేరస్తుడిని ఆలింగనం చేసుకున్నారు. ఇది తీవ్ర నిరాశ కలిగించింది. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి ఎదురుదెబ్బ.

– ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ

బీమా పేరుతో భారం వేయొద్దు

- పంటల బీమా మొత్తాలను రైతు ఖాతాల్లో జమచేయాలి
- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు 18, 19 తేదీల్లో ఉద్యమం
- గ్రామ సచివాలయాల్లో 'సామూహిక రాయబారాలు' పేరుతో వినతిపత్రాలు
- ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతుల సంఘాల రాష్ట్ర కమిటీల సంయుక్త సమావేశం పిలుపు

14లో

ప్రపంచబ్యాంకు బృందంతో

చంద్రబాబు భేటీ



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు మంగళవారం సచివాలయంలో ప్రపంచబ్యాంకు ప్రతినిధులతో సమావేశమయ్యారు. సుమీల గుల్యాని, జూప్ స్టౌట్ జెన్జిజిక్, డాక్టర్ రాజగోపాల్‌సింగ్‌తో సమావేశమైనట్లు చంద్రబాబు ఎక్స్‌లో తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులు, డ్యాముల భద్రత, రివర్ మేనేజ్‌మెంట్, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం అంశాలపై సహకరించాలని వారిని కోరినట్లు తెలిపారు. ప్రపంచబ్యాంకు బృందం ఇందుకు సమ్మతి తెలిపిందని పేర్కొన్నారు.

వైట్ పేపర్.. లైట్ తీస్కో..
కరెంట్‌పైనా కోతలే!

పొంతనలేని లెక్కలు..అర్థం లేని ఆరోపణలు

సాక్షి, అమరావతి: అబద్ధాలతో మునుపటి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లడమే ప్రధాన అజెండాగా సీఎం చంద్రబాబు మంగళవారం విద్యుత్ శాఖపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఐదేళ్లలో ఒక్క సారి కూడా పవర్ హాలిడే విధించకుండా, విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో జరిగినప్పుడు కూడా ఎక్కడా సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టిన గత ప్రభుత్వంలో లేని తప్పులను, జరగని నష్టాలను కల్పించి శ్వేతపత్రంలో పొందుపరిచారు. తాను గతంలో అధికారంలో ఉన్నప్పుడు కుదుర్చుకున్న ఒప్పందాలతో కుదేలైన డిస్కంలను ఆదుకున్న వైఎస్ జగన్ వల్లనే విద్యుత్ రంగం రూ.1,29,503 కోట్ల నష్టం వచ్చిందంటూ చంద్రబాబు కనికట్టు విద్యను ప్రదర్శించారు. 2018–19 నాటికి జెన్‌కో ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 5613 మెగావాట్లుకాగా 7,213 మెగావాట్లు అని చంద్రబాబు శ్వేత పత్రంలో అబద్ధాలు చెప్పుకొచ్చారు. ఆ అబద్ధాలు..వాటి వెనుక వాస్తవాలు ఇవీ...

డిస్కంలకు అప్పుల పాలు చేసింది మీరేగా చంద్రబాబు


డిస్కంల నికర విలువ 2014లో చంద్రబాబు గెలిచే నాటికి సుమారు మైనస్ రూ.4,315 కోట్లు ఉంటే, ఆ ప్రభుత్వం దిగిపోయేనాటికి... అంటే 2019 నాటికి నికర విలువ దారుణంగా క్షీణించి ఏకంగా మైనస్ రూ.20వేల కోట్లకు చేరింది. 2014–15 నుంచి 2018–19 వరకు ఐదేళ్ళలో రూ.13,225 కోట్లు మాత్రమే అప్పటి ప్రభుత్వం సబ్సిడీ చెల్లించింది. 2019–20 నుంచి 2023–24 వరకు నాలుగేళ్ళలోనే సబ్సిడీ, ఆర్థిక మద్దతు కింద జగన్ సర్కారు రూ.47,800.92 కోట్లు చెల్లించింది. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అప్పులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు 2014 మార్చి నాటికి రూ.29,551 కోట్లు ఉంటే, చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.86,215 కోట్లకు పెరిగాయి. అంటే ఏకంగా 56,663 కోట్లు పెరిగాయి. సగటున అప్పుల వృద్ధిరేటు 24శాతం. అదే జగన్ హయాంలో రూ.86,215 కోట్లు కాస్తా..రూ.1,22,518కోట్లకు పెరిగాయి. అంటే కోవిడ్ లాంటి సంక్షోభాలున్నా, చంద్రబాబు చేసిన అప్పులభారం అధికంగా ఉన్నా... జగన్ హయాంలో పెరిగిన అప్పులు కేవలం రూ.36,303 కోట్లు. వాటి వృద్ధిరేటు 7.3 శాతమే. టీడీపీ ప్రభుత్వం 8 వేల మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లను అధిక ధర (యూనిట్ రూ.7)లకు కుదుర్చుకుంది. దీనివల్ల డిస్కంలు ఏటా దాదాపు రూ.3,500 కోట్ల చొప్పున 25 ఏళ్ల పాటు ఈ భారం మోయాల్సి వస్తోంది. ఈ ఒప్పందాల కోసం థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని (బ్యాక్ డౌన్)తగ్గించింది. గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించడం కోసం డిస్కంలు ఆర్థిక సంస్థల నుంచి మరిన్ని రుణాలను తీసుకోవాల్సి వచ్చింది. బాబు సీఎంగా ఉన్నన్నాళ్లూ విద్యుత్ కొనుగోలు వ్యయం (ట్రూ అప్)ను బిల్లుల్లో సర్దుబాటు చేసుకునే అవకాశాన్ని డిస్కంలకు ఇవ్వలేదు. దీంతో 2014–19 మధ్య దాదాపు రూ.20 వేల కోట్లు డిస్కంలు నష్టపోవాల్సి వచ్చింది. ఆ ట్రూ చార్జీలే జగన్ హయాంలో ఏపీఈఆర్‌సీ అనుమతితో డిస్కంలు వేశాయి. మరిప్పుడు ట్రూ అప్ ఛార్జీలను వెనక్కి తీసుకునే ఆలోచన ఉందా?, విద్యుత్ చార్జీల టారిఫ్ పెంచరా? అని విలేకరులు అడిగితే 'నేను అలా అన్నానా' అంటూ, అవేవీ జరగవని, చార్జీల పెంపు తప్పదనే సంకేతాన్ని చంద్రబాబు ఇవ్వనే ఇచ్చారు.

వినియోగదారులపై టారిఫ్ భారం రూ.రూ.32,166 కోట్లు వేశారని అంటున్న చంద్రబాబు హయాంలో విద్యుత్ చార్జీల పెంపు(రూ.ల్లో)..

నెలవారీ వినియోగం (యూనిట్లు)	2016 (మార్చి)	2018 (ఏప్రిల్)	పెరుగుదల శాతం
76	140.10	197.60	41.04
78	145.30	202.80	39.57
80	150.50	208.00	38.21
82	155.70	213.20	36.93
85	163.50	221.00	35.17
88	171.30	228.80	33.57
90	176.50	234.00	32.58
92	181.70	239.20	31.65
95	189.50	247.00	30.34
98	197.30	254.80	29.14
100	202.50	260.00	28.40

ఉచిత విద్యుత్ ఇస్తే బట్టలారేసుకోవాలన్నది ఎవరు

రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతో పాటు విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా రైతు ఖాతాలో నెలవారీ వినియోగ చార్జీలను ప్రభుత్వం జమ చేస్తుంది. ఆ మొత్తాన్ని రైతులు డిస్కంలకు చెల్లిస్తారు. ఇదంతా తప్పని ఎన్నికల ముందు గొంతు చించుకున్న చంద్రబాబు ఇప్పుడు మాత్రం స్మార్ట్ మీటర్లపై సమాధానం దాటవేశారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెడుతుంటే, రైతులపై విద్యుత్ బిల్లులు భారం వేస్తారని తప్పుడు ప్రచారం చేసిన బాబు..మీటర్లపై మీ వైఖరేమిటని అడిగితే అర్థం లేని సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నం చేశారు. స్మార్ట్ మీటర్ల గురించి చెప్పకుండా సోలార్ నెట్ మీటరింగ్ గురించి చెప్పుకొచ్చారు. నిజానికి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలని ఇదే చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఎద్దేవా చేశారు. అధికారంలో ఉండగా రైతులకు ఉచిత విద్యుత్ బకాయిలను రూ.8845 కోట్లు ఇవ్వకుండా ఎగవేశారు. దానిని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది.ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కింద రూ.43,744 కోట్లను జగన్ ప్రభుత్వం అందించింది. రైతులకు పగటిపూట 9 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంచారు. రూ.1,700 కోట్లతో ఫీడర్లను ఏర్పాటు చేసి రైతులకు పగటి పూట నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నారు. చంద్రబాబు 5 ఏళ్ల పాలనలో 3.5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయగా జగన్ ప్రభుత్వం 5 లక్షలకుపైగా వ్యవసాయ పంపుసెట్లు మంజూరు చేసింది.



మీ వల్ల కానిది జగన్ చేసి చూపించలేదా?

కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్, నార్ల తాతా రావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్ల జాప్యం వల్ల రూ.12,818 కోట్లు నష్టమని అసత్యాల కథ అల్లారు చంద్రబాబు. నిజానికి ఈ రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చిందే జగన్. ఈ 2 ప్రాజెక్టుల్లో పనులకు స్థిర (ఫిక్స్‌డ్) రేటును నిర్ణయించారు. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చడానికి, పెంచడానికి అవకాశం లేదు. ఎగ్జిక్యూషన్ ఏజెన్సీల్లో జగన్ హయాంలో ఎటువంటి మార్పులు, విజిలెన్స్ విచారణలు కూడా జరగలేదు. అంటే ఈ రెండు ప్రాజెక్టుల అమలులో ఉద్దేశపూర్వకంగా ఎలాంటి జాప్యం జరగలేదు. కోవిడ్ రెండు దశల కారణంగా 2020, 2021ల్లో ఏడాదిన్నరకు పైగా ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. కోవిడ్ మూడో దశలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కార్మికులను సమీకరించడం, వారికి పునరావాసం కల్పించడానికి చాలా సమయం పట్టింది. అయినప్పటికీ పనులు చకచకా జరిపించి 2022 అక్టోబర్‌లో ప్రారంభించారు. ఎన్టీటీపీఎస్‌లో యూనిట్‌లో అదే ఏడాది డిసెంబరులో ఉత్పత్తి మొదలుపెట్టారు. అయితే జీఎస్టీ అమలు, చట్టంలో మార్పు, ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తంపై వడ్డీ కారణంగా అంచనా వ్యయంతో పోలిస్తే ప్రాజెక్ట్ వ్యయం పెరిగింది. ఇందులో జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఏమాత్రం లేదు. అంతేకాకుండా జగన్ హయాంలో ఉత్పత్తి 63,675 మిలియన్ యూనిట్లు కాస్తా, ఉత్పత్తి 2023–24 నాటికి 80,151 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

'సెకీ'తో లాభమేగానీ నష్టం లేదు

వ్యవసాయానికి 9 గంటల పగటిపూట ఉచిత విద్యుత్‌ను వచ్చే 30 ఏళ్ల పాటు కొనసాగించేందుకు, 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈసీఐ) తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నారు. అది కూడా యూనిట్ కేవలం రూ.2.49 పైసలకే. ఏపీకి ఎన్టీపీసీ సరఫరా చేస్తున్న సౌర విద్యుత్ ధర యూనిట్ రూ.2.79పై. (ట్రేడింగ్ మార్జిన్ కలిపి) కన్నా ఇది తక్కువ. ప్రస్తుత సరాసరి విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్ రూ.5.10 ఉంది. దీని వల్ల ఏటా రూ.3,750 కోట్లు ఆదా అవుతుంది. ఈ విద్యుత్‌ను రాజస్థాన్ నుంచి ట్రాన్స్‌మిషన్ చేయాల్సి రావడం వల్ల అధిక ధర పెట్టారని చంద్రబాబు చెప్పుకొచ్చారు. కానీ సెకీ విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వం ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఆ విషయాన్ని దాచిపెట్టారు చంద్రబాబు.

తెలంగాణ బకాయిలు వసూలుకు చొరవ తీసుకున్నది జగనే

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ఆంధ్రప్రదేశ్ సరఫరా చేసిన విద్యుత్‌కు చెల్లించాల్సిన రూ.7300 కోట్ల బకాయిలను వసూలు చేసేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంపై అనేక పర్యాయాలు ఒత్తిడి తీసుకువచ్చారు. దాంతో రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి విద్యుత్ బకాయిలు కట్టాల్సిందేనని కేంద్రం తెలంగాణకు చెప్పింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్‌ఈసీ)ల నుంచి 2014 జూన్ 2 నుంచి 2017 మార్చి 31 మధ్య రూ.5625 కోట్ల రుణాలను ఏపీ జెన్‌కో తీసుకుంది. అలా తీసుకున్న డబ్బులతోనే తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసింది. కానీ వాడుకున్న విద్యుత్‌కు తెలంగాణ నుంచి అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు వసూలు చేయలేకపోయారు. ఇప్పుడు ఆ బకాయిలను కూడా గత ప్రభుత్వం ఖాతాలోకి నెట్టే ప్రయత్నం చేశారు. మీరేం చొరవ తీసుకుంటున్నారని విలేకరులు అడిగితే మాత్రం 'వాళ్లేదో అంటున్నారు. కమిటీ వేస్తాం..చూస్తాం' అంటూ సమాధానం చెప్పలేకపోయారు.

ఈ మంచి కనిపించలేదా

- పునరుత్పాదక విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడానికి పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం 2020ని గత ప్రభుత్వంలో ప్రకటించారు. ప్రపంచంలోనే అతిపెద్ద 5,230 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక శక్తి నిల్వ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఓర్వకల్, పాణ్యం మండలాల సరిహద్దులోని పిన్నాపురంలో శంకుస్థాపన చేశారు.
- నెడ్‌కాప్ ఆధ్వర్యంలో దాదాపు 44,240 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది.
- వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన ఇంధన రంగ ప్రాజెక్టులకు ప్రముఖ పెట్టుబడిదారులతో 42 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారు. వీటి ద్వారా దాదాపు 1.80 లక్షల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉంది.
- రాష్ట్రంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా దాదాపు రూ.3800 కోట్లు విలువైన 5600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయ్యింది. తద్వారా 4.76 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు తగ్గాయి. ఇంధన భద్రత దిశగా చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్రానికి ప్రతిష్టాత్మక 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు'ను కేంద్రం ప్రభుత్వం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందించింది. అలాగే ఏపీట్రాన్స్‌కో, నెడ్‌కాప్, ఏపీకి మూడు ఎనర్షియా అవార్డులు వరించాయి.ఏపీఎస్పీడీసీఎల్‌కు రెండు జాతీయ అవార్డులు లభించాయి. 'కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో ఏపీలోని మూడు డిస్కంలకు 'ఏ' గ్రేడ్ లభించింది.
- రాష్ట్రానికి రావాల్సిన అంతరాష్ట్ర విద్యుత్ ప్రసార చార్జీలపై ఆంధ్రప్రదేశ్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీ ట్రాన్స్‌కో) చేసిన పోరాటం ఫలించి రాష్ట్రానికి రూ.306.2 కోట్ల ఆదాయం సమకూరింది.
- మాచ్‌ఖండ్‌లో ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఓహెచ్‌పీసీ), ఏపీ జెన్‌కో సంయుక్తంగా మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎగువ, దిగువ 98 మెగావాట్ల సామర్థ్యం గల మూడు జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అప్పర్ సీలేరులో రూ.11,154 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి ప్లాంట్ (పీఎస్పీ)కు కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) నుంచి అనుమతి తీసుకువచ్చింది.
- రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు 2023లో రూ.2,479 కోట్లతో 16 సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు రూ.620 కోట్లతో నిర్మించిన 12 సబ్‌స్టేషన్లను అప్పటి సీఎం జగన్ ప్రారంభించారు. ఇందుకోసం మొత్తం రూ.3,099 కోట్లను వెచ్చించారు.
- ఏపీట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ లభ్యత 99.70 శాతానికి పెరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌ని ఉపయోగించి 'ది మోస్ట్ అక్యురేట్' డే–ఎహెడ్ ఫోర్‌కాస్ట్ మోడల్‌ను ప్రవేశపెట్టిన మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. 3 శాతం లోపు ఉన్న ప్రసార నష్టాలను 2.69 శాతానికి ఏపీట్రాన్స్‌కో తగ్గించింది.
- థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 14948 మెగావాట్ల నుంచి 17102 మెగావాట్లకి మెరుగుపడింది. 2022–23 సంవత్సరంలో 93 శాతం (12.40 మిలియన్ మెట్రిక్ టన్) ఉన్న బొగ్గు లభ్యత, 2023–24లో 96.52 శాతానికి (14.74 మిలియన్ మెట్రిక్ టన్)కి పెరిగింది.
- వ్యవసాయం, ఆక్వా ,పశుసంవర్ధక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలు కలిపి మొత్తం 39.64 లక్షల మంది వినియోగదారులకు 'నవరత్నాల' పథకాల ద్వారా ఉచిత, సబ్సిడీ విద్యుత్‌ను అందించింది. ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించింది. వెనుకబడిన వర్గాల కుటుంబాలకు, ధోబీ ఘాట్‌లు, హెయిర్ కటింగ్ సెలూన్‌లు, చేనేత కార్మికులు, లాండ్రీలు, దారిద్రయ రేఖకు దిగువ ఉన్న వారికి, ప్రొఫెషనల్ గోల్డ్‌స్మిత్‌ల దుకాణాలకు కూడా ఉచిత, సబ్సిడీ విద్యుత్ సరఫరాను చేసింది.

విద్యుత్ రంగం అప్పుల వివరాలు (రూ.కోట్లలో)

	2014 మార్చి 31	2019 మార్చి 31	2024 మార్చి 31
విద్యుత్ రంగం రుణాలు పెరుగుదల	26,658.27	64,674.50	1,11,863.84
డిస్కంల విద్యుత్ కొనుగోళ్ల బకాయిలు	2,893.23	21,540.96	10,654.20
విద్యుత్ రంగం మొత్తం అప్పులు	29,551.50	86,215.46	1,22,518.04
మొత్తం పెరుగుదల		56,663.96	36,302.58
వార్షిక వృద్ధి రేటు (శాతంలో)		23.88	7.28

విద్యుత్ రంగానికి అపారనష్టం

జగన్ నిర్ణయాలతో రూ.1,29,503 కోట్ల నష్టం: శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు, విద్యుత్ రంగానికి రూ. 1,29,503 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేశారు. ట్రూ అప్, ట్రూ అప్ ఫ్యూయల్ అంటూ కొత్త పేర్లతో వడ్డించిన ఛార్జీలతో రూ.32,166 కోట్ల భారాన్ని మోపి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. సచివాలయంలో మంగళవారం విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల పేరుతో మాజీ సీఎం వైఎస్ జగన్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబు చెప్పలేక సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాట్లు సరిగా లేవంటూ అధికారులపై చిందులు తొక్కారు. రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేవని, ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను సహకరించాలని కోరానని చెప్పారు.

అప్పట్లో మిగులు విద్యుత్

2004లో నా పవర్ పోయినా.. నేను తెచ్చిన సంస్కరణల వల్ల దేశం బాగుపడింది. ట్రాన్స్ మిషన్ నష్టాలు 7 శాతానికి తీసుకొచ్చా. 2014లో అధికారం చేపట్టాక 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉన్నా 2018 జనవరి నాటికి మిగులు విద్యుత్ సాధించాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ కోతలు విధించలేదు. టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందించాం. కేంద్రం నుంచి రూ.5 వేల కోట్ల గ్రాంట్ తీసుకొచ్చాం.



2004కు ముందు ప్రపంచ బ్యాంక్ నుంచి కూడా గ్రాంట్ తెచ్చాం. నాడు మేం తెచ్చిన సంస్కరణలే రాజశేఖరరెడ్డికి ఉపయోగపడ్డాయి.

టీడీపీ హయాంలో 145 అవార్డులు

టీడీపీ హయాంలో విద్యుత్ రంగంలో 145 అవార్డులు సాధించాం. 2019–24 మధ్య గత ప్రభుత్వం వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారం మోపింది. వీటీపీఎస్, కేటీపీఎస్ పనుల్లో ఆలస్యం వల్ల రూ.12,816 కోట్లు అదనంగా భారం పడింది. పోలవరం హైడ్రాలిక్ కాంట్రాక్ట్ మార్చడం వల్ల రూ.4,737 కోట్లకు భారం పెరిగింది. సెకీ సోలార్ వల్ల, అప్పులు, వడ్డీలు, పవర్ స్టేషన్ కెపాసిటీ తగ్గించడం, నిలిపివేత కారణంగా మొత్తంగా రూ.47,741 కోట్లు ప్రజలపై భారం పడింది.

అప్పులన్నీ ప్రజలే కట్టాలి..

ఈ అప్పులన్నీ ప్రజల నుంచే చెల్లించాలి. సోలార్ కరెంట్ వాడకుండా రిజెక్ట్ చేశారు. కోర్టు ఆదేశాలతో రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. 21 విండ్, ఇతర ఒప్పందాలను రద్దు చేయడం వల్ల కూడా భారం పడింది. రాజధానిలో కాంట్రాక్ట్ వర్క్ రూ.1,315 కోట్లకుగాను రూ.406 కోట్లు ఖర్చు అయింది. ఆ పనులు రద్దు చేయడం వల్ల రూ.281 కోట్లు అదనంగా భారం పడుతోంది. హిందూజా ప్రాజెక్ట్ షెడ్యూల్ కాకపోవడం సుప్రీం కోర్టుకు వెళ్లడంతో రూ.1,235 కోట్లు, విండ్–సోలార్ విద్యుత్ ఉత్పత్తిని వెనక్కి తీసుకోవడంతో అదనంగా రూ.500 కోట్లు భారం పడడంతో పాటు రూ.16,699 కోట్లు టారిఫ్ పెరిగింది. ట్రూ అప్ ఫ్యూయల్ పేరిట రూ.5,886 కోట్లు, ట్రూ అప్ ఛార్జెస్ కింద రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.5,604 కోట్లు ఇలా అన్నీ కలిపి రూ.32,166 కోట్లు ప్రజలపై భారం వేశారు. రూ.17,137 కోట్లు ట్రూ అప్, ఫ్యూయల్‌లో ఇంకా పెండింగులో ఉన్నాయి. రుణాలు రూ.62,826 కోట్లు నుంచి ఐదేళ్లలో రూ.1,12,422 కోట్లకు పెంచారు. ప్రభుత్వ సబ్సిడీ బకాయిలు పెరిగాయి. రూ.7,680 కోట్ల నుంచి రూ.12,681 కోట్ల సబ్సిడీలు పెండింగులో ఉన్నాయి. ప్రభుత్వ శాఖల్లో బకాయిలు రూ.15,157 కోట్లకు పెరిగాయి. తెలంగాణ నుంచి రూ.7,300 కోట్లు బకాయిలు ఉన్నాయి. బకాయిల రూపంలో మొత్తం రూ.52 వేల కోట్లు రావాల్సి ఉంది.

సరిగా పని చేయకుంటే చర్యలు తప్పవు..

వీటీపీఎస్ 55 నెలలు ఆలస్యం చేయడం వల్ల రూ.2,029 కోట్లు, కృష్ణపట్నం 44 నెలలు ఆలస్యం చేయడం వల్ల రూ.2,035 కోట్లు అదనంగా ఖర్చు అవుతోంది. రూ.3,800 కోట్లతో 17 వేల మిలియన్ యూనిట్లు కొనుగోలు చేశారు. మొత్తంగా రూ.12,816 కోట్లు అదనపు భారం పడింది. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ల కారణంగా అదనంగా రూ.12,250 కోట్లు భారం పడింది. మా హయాంలో డిస్కమ్స్‌కు 'ఏ' రేటింగ్ వస్తే గత ప్రభుత్వంలో సీ, డీ వచ్చాయి. రేటింగ్ తగ్గడంతో వడ్డీ రేటు 1.11 శాతం పెరిగి ఐదేళ్లలో రూ.2,442 కోట్ల భారం పడింది. విద్యుత్ సంస్థలో డబ్బులు బెవరేజ్ కార్పొరేషన్‌కు మళ్లించారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ కూడా వారికి తెలియకుండా మళ్లించారు. 3.0 విద్యుత్ సంస్కరణలతో ఎలా రీ స్ట్రక్చర్ చేయాలో ఆలోచిస్తున్నాం. విద్యుత్ రంగంలో పని చేసే వారికే జీతాలు ఎక్కువ ఉంటాయి. అధికారులు ఎవరు సరిగా పని చేయకపోయినా చర్యలు ఉంటాయి. తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిలను కమిటీ చూసుకుంటుంది. ఇప్పుడు ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. వైసీపీ నేతలకే కడుపుమంటగా ఉంది. రాష్ట్రాన్ని ఓ భూతం పట్టుకుంది. దానిని భూ స్థాపితం చేసే బాధ్యత నేను తీసుకుంటా. ఐదేళ్లుగా దోచిన సొమ్ముతో ఏ వ్యవస్థనైనా కొనగలిగే స్థాయిలో ఉన్నారు.

ఒళ్లు దగ్గర పెట్టుకోండి..
ఉద్యోగులకు సీఎం చంద్రబాబు హెచ్చరిక

శ్వేత పత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాట్లు సరిగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''బ్యాటరీ అయిపోయినట్టుంది. చూసుకోండయ్యా.. జాగ్రత్తగా చూసుకోండి.. ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయండి. తమాషాలాడుతున్నారు. ప్రభుత్వంలో ఉన్న వారు ఇలా పనిచేస్తున్నారు. తొలి రోజు వస్తే కమోడ్ కూడా పని చేయలేదు. నా రూమ్‌లో కూడా ఏమీ పనిచేయడం లేదు. ప్రజెంటేషన్‌కు వచ్చే ముందు అన్నీ చూసుకోవాలి. ఇలాగే ఉంటే చాలా సీరియస్‌గా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది'' అని అధికారులను హెచ్చరించారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సీఎం తడబడ్డారు. ఏపీఈఆర్‌సీ దగ్గర పెండింగ్‌లో ఉన్న రూ.17 వేల కోట్ల ట్రూ అప్ చార్జీలకు ప్రభుత్వం ఏమైనా ష్యూరిటీ ఇస్తుందా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ గవర్నమెంట్ దగ్గర డబ్బులుండాలి కదా.. అని వ్యాఖ్యానించారు. ట్రూ అప్ చార్జీల పరిష్కారానికి ఏదైనా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించగా.. వచ్చే మార్చి నాటికి టారిఫ్ వస్తుందని చెప్పారు. వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు ఇప్పటికే ఇచ్చారు కదా.. వాటిని ఏం చేస్తారు? అని ప్రశ్నించగా అక్కడ సోలార్ ప్యానెల్స్ ఇస్తామన్నారు. పవర్ జనరేషన్ యూనిట్లు బ్యాక్ డౌన్ అయ్యిందంటున్నారు.. అలాంటప్పుడు రూ.40 వేల కోట్ల నిర్వహణ వ్యయం ఎక్కడ జరిగింది? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయారు. టారిఫ్ పెంచకుండా, నాణ్యమైన విద్యుత్ ఇస్తారా? అని ప్రశ్నించగా తాను అలా చెప్పలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీ ప్రకారం పింఛన్లు పెంచామని, ఇసుక ఉచితంగా ఇస్తున్నా విమర్శలు చేస్తున్నారన్నారు. ఇసుకెత్తి వాళ్లింట్లో ఇస్తామని, నేనే ఇల్లు కట్టిస్తానని, వాళ్ల పొలంలో పనిచేస్తానన్నానని విమర్శిస్తున్నారని చంద్రబాబు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఎడ్ల బళ్లు, ట్రాక్టర్లు లేదా నెత్తిన పెట్టుకునైనా తీసుకుపొమ్మన్నాం... ఎవరొద్దన్నారంటూ చిర్రుబుర్రులాడారు. 48 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, మూడు నెలల తర్వాత కొత్త పాలసీ వస్తుందని తెలిపారు. మూడు రాజధానులు పెడతానని సుప్రీంకోర్టుకు వెళ్లాడని, కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిందని, దానివల్ల లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం ఆవిరైపోయిందని విమర్శించారు. 'మీరెవరూ అతనిని ఢీ కొట్టడం లేదు..! నన్ను మాత్రం నువ్విలా చేస్తావంటూ అడుగుతున్నారు...!' అంటూ విలేకరులపై అసహనం వ్యక్తం చేశారు. ఎమోషనల్‌గా డిస్టర్బ్ చేయాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు. తిక్కలోడు తిరునాళ్లకు వెళితే ఏమవుతుందో అదే జరిగిందంటూ వ్యక్తిగత విమర్శలకు దిగారు.

శ్వేతపత్రం కాదు.. అసత్యాలపత్రం

- విద్యుత్‌పై శ్వేతపత్రంలో అన్నీ కాకిలెక్కలే..
- ప్రతి అంశంపై బహిరంగ చర్చకు సిద్ధం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు(పొగతోట): విద్యుత్ రంగానికి సంబంధించి సీఎం చంద్రబాబు విడుదల చేసినది శ్వేతపత్రం కాదు... అది అసత్యాలపత్రం అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు చెప్పినవన్నీ కాకి లెక్కలేనని, ప్రతి అంశంపై తాము బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన ప్రకటించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడు 2014–15 సంవత్సరంలో విద్యుత్ డిమాండ్ 59.198 మిలియన్ యూనిట్లు. ఆయన పదవి నుంచి దిగిపోయే 2018–19 నాటికి 63.675 మిలియన్ యూనిట్లకు డిమాండ్ చేరింది. జాతీయ సగటుకన్నా తక్కువగా ఏపీలో విద్యుత్ డిమాండ్ ఉంది. కానీ, శ్వేతపత్రంలో 2014–2019 సంవత్సరాల మధ్య విద్యుత్ వినియోగం 36శాతం పెరిగిందని చంద్రబాబు డబ్బాలు కొట్టుకున్నారు. వాస్తవానికి పెరిగింది కేవలం 7.6 శాతమే. వైఎస్ జగన్ హయాంలో మొదట 63.675 మిలియన్ యూనిట్లు ఉన్న విద్యుత్ డిమాండ్ 2023–24 సంవత్సరంలో 80,151 మిలియన్ యూనిట్లకు పెరిగింది. సగటున విద్యుత్ వృద్ధి రేటు 4.7శాతం ఉంది. చంద్రబాబు పాలనలో కోవిడ్ లేదు. ఉక్రెయిన్ యుద్ధం, బొగ్గు సరఫరా సమస్యలు లేవు. ఇవన్నీ ఉన్నా జగన్ అధిక విద్యుత్ డిమాండ్‌ను తీర్చేలా చర్యలు తీసుకున్నారు. 2018–19 సంవత్సరంలో జెన్‌కో ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 7,213 మెగావాట్లు అని చంద్రబాబు చెప్పారు. వాస్తవానికి జెన్‌కో మాన్యువల్ రిపోర్టు ప్రకారం పరిశీలిస్తే 5,613 మెగావాట్లుగా ఉంది.' అని కాకాణి తెలిపారు.

చంద్రబాబు పాలనలో భారీగా పెరిగిన అప్పులు

'2014 మార్చి నాటికి విద్యుత్ పంపిణీ సంస్థలు ట్రాన్స్‌కో, జెన్‌కోల అప్పులు, విద్యుత్ ఉత్పత్తిదారులకు బకాయిలు రూ.29వేల కోట్లు ఉండగా, చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోయే నాటికి అప్పులు రూ.86,215 కోట్లకు పెరిగాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చే సమయానికి డిస్కంల నికర విలువ రూ.4,315 కోట్లు ఉంటే, ఆ ప్రభుత్వం దిగిపోయే రోజుకు డిస్కింల విలువ దారుణంగా క్షీణించి మైనస్ రూ.20వేల కోట్లకు చేరింది. చంద్రబాబు హయాంలో విద్యుత్ విధానాలు, కొనుగోలు ఒప్పందాలు అన్నీ అక్రమాలమయం. సోలార్ విద్యుత్ రేట్లు తగ్గుముఖం పడుతున్న సమయంలో యూనిట్ విద్యుత్ రూ.7లకు కొనుగోలు చేసేలా ఒప్పందాలు కుదుర్చుకున్న చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానిది. 2014–19 మధ్య 8వేల మెగావాట్ల కొనుగోలుకు అధిక ధరలకు ఒప్పందం చేసుకోవడం వల్ల ప్రతి సంవత్సరం రూ.3వేల కోట్లు చొప్పున 25ఏళ్ల భారాన్ని మోయాల్సి వస్తోంది. పీపీఏల పేరిట సోలార్ విద్యుత్ కిలోవాట్ రూ.5.25 నుంచి రూ.5.90లకు చెల్లించేలా టీడీపీ ఒప్పందాలు కుదుర్చుకున్న మాట వాస్తవం కాదా? ఈ ఒప్పందాల కోసం థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని తగ్గించిమాట వాస్తవం కాదా..? ' అని కాకాణి ప్రశ్నించారు.

ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెట్టేందుకు బాబు ప్రయత్నం

'అసలు ఉచిత విద్యుత్‌కు ఎగనామం పెట్టేలా చంద్రబాబు వ్యవహరించారు. ఉచిత విద్యుత్ సబ్సిడీ కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.43,744 కోట్లు చెల్లించింది. చంద్రబాబు ఐదేళ్లలో ఉచిత విద్యుత్ కోసం పెట్టిన బకాయిలు రూ.8,845 కోట్లను కూడా జగన్ ప్రభుత్వం చెల్లించింది. అదేవిధంగా రైతులకు భవిష్యత్‌లో ఉచిత విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీతో యూనిట్‌ను రూ.2.45లకు కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకుంది. కానీ సెకీ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌పై ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌మిషన్ చార్జీలు ఉంటాయని చంద్రబాబు చెప్పడం పెద్ద అబద్ధం. ఆ చార్జీల నుంచి రాష్ట్రానికి పూర్తి మినహాయింపు ఉంది. అసలు చంద్రబాబుకు దమ్ముంటే సెకీతో వైఎస్ జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలి. జగన్‌కు ప్రజల్లో మంచిపేరు వస్తుందనే.. ఆయన హయాంలో వచ్చిన విద్యుత్ ప్రాజెక్టులను తరిమేసేలా చంద్రబాబు చర్యలు ఉన్నాయి' అని కాకాణి ఆగ్రహం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా...

నేడు విశాఖకు కేంద్ర ఉక్కు మంత్రి రాక

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్.డి.కుమారస్వామి బుధవారం విశాఖ రానున్నారు. అక్కడ నుంచి స్టీల్ ప్లాంట్ హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడ బస చేస్తారు. గురువారం ఉదయం 9–12.30 గంటల వరకు ప్లాంట్‌ను సందర్శిస్తారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంతో జరిగే రివ్యూ మీటింగ్‌లో పాల్గొంటారు. అనంతరం ఆయన హైదరాబాద్ వెళ్లనున్నారు.

16న మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 16న ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్ సమావేశ మందిరంలో కేబినెట్ సమావేశం జరుగుతుందని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ సమావేశానికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపాదనలను బిజినెస్ రూల్స్ ప్రకారం ఈ నెల 11న సాయంత్రం 4 గంటల్లోగా సాధారణ పరిపాలన శాఖ (కేబినెట్ విభాగం)కు పంపాల్సిందిగా అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఐపీఎస్ సుబ్బారాయుడు ఏపీకి బదిలీ

మూడేళ్ల డిప్యుటేషన్‌పై అంతర్రాష్ట్ర బదిలీకి కేంద్రం అనుమతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సుబ్బారాయుడు అంతర్రాష్ట్ర డిప్యుటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యర్థన మేరకు తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి సుబ్బారాయుడును మూడేళ్లపాటు డిప్యుటేషన్‌పై ఏపీకి బదిలీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఆయన్ను రిలీవ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు వెల్లడించినట్లు తెలిసింది. ఐపీఎస్ సుబ్బారాయుడు ఏపీ సీఎం చంద్రబాబు అత్యంత సన్నిహితుడని, ఏపీలో ఆయనకు కీలక పోస్టింగ్ దక్కుతుందన్న ప్రచారం పోలీస్ వర్గాల్లో జరుగుతోంది.

నేడు ఏపీకి తిరిగి రానున్న హజ్ యాత్రికులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్–2024 యాత్రకు వెళ్లిన హాజీలు బుధవారం నుంచి రాష్ట్రానికి తిరిగి రానున్నారని ఏపీ హజ్ కమిటీ కార్యనిర్వహణాధికారి ఎల్. అబ్దుల్ ఖాదర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లిన దాదాపు 800 మంది హాజీలు ఈనెల 10 నుంచి 12వ తేదీలోపు మూడు విమానాల్లో తిరిగి రానున్నారని పేర్కొన్నారు.

'పురపాలక'లో డిప్యుటేషన్‌లు రద్దు చేయండి

ఏపీ మునిసిపల్ 'ఎంప్లాయీస్' అసోసియేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర పురపాలక శాఖలోకి ఇతర ప్రభుత్వ శాఖల నుంచి డిప్యూటేషన్లపై వచ్చిన ఉద్యోగులతో తమకు అన్యాయం జరుగుతోందని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ మునిసిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇటీవల కాకినాడ జిల్లా తునిలో కార్యవర్గ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించినట్లు సంఘం అధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్‌రావు మంగళవారం తెలిపారు. బయటి శాఖల నుంచి వచ్చిన ఉద్యోగులను మాతృ శాఖలకు పంపాలని, విలీన ప్రక్రియను తక్షణమే ఆపాలని కోరారు. డిప్యూటేషన్లు, విలీనం ద్వారా మునిసిపల్ శాఖలకు వచ్చిన ఉద్యోగులకు పురపాలక చట్టాలపై అవగాహన లేదని, పైరవీల ద్వారా వచ్చిన వారు తప్పులు చేసి తప్పుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు పురపాలక శాఖ మంత్రి నారాయణ ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌టీటీపీఎస్ బాధితులకు ప్రభుత్వం అండ

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్




బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

భవానీపురం (విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నంలోని ఎన్‌టీటీపీఎస్‌లో జరిగిన దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఎన్‌టీటీపీఎస్‌లో చోటుచేసుకున్న ప్రమాదంలో గాయపడి గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు. ప్రమాదం గురించి మాజీ మంత్రి దేవినేని ఉమను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌టీటీపీఎస్‌లో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోక పోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ చేసి బాధితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ప్రమాదం గురించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

టీటీడీ.. మాకే కావాలి!

చైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్న టీడీపీ, జనసేన



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ పదవి కోసం కూటమి పార్టీలు పోటీ పడుతున్నాయి. టీడీపీ, జనసేన నేతలు ఆ పదవి కోసం గట్టిగా పట్టుపడుతున్నారు. టీడీపీ నుంచి అశోక్ గజపతిరాజు, వేమిరెడ్డి ప్రశాంతి, రఘురామకృష్ణరాజు రేసులో నిలవగా.. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సోదరుడైన నాగబాబుకే టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వాలంటూ ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీకి చెందిన సీనియర్ నేత ఎవరికైనా ఆ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పేరును ఆయన పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అశోక్ గజపతిరాజు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన కుమార్తె అదితికి అవకాశం కల్పించి.. తాను పోటీ నుంచి వైదొలిగారు. దీంతో ఆయనకే ఈ పదవి ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ ఆయన పూర్తికాలం ఆ పదవి కోసం సమయం కేటాయించకపోవచ్చని, అలాగే అందరికీ అందుబాటులో ఉండడం కష్టమనే అభిప్రాయం టీడీపీ నేతల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు పేరును కూడా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. మంత్రివర్గంలో స్థానం దక్కకపోవడం.. స్పీకర్ పదవి ఆశించినా అదీ రాకపోవడంతో ఆయన తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి కూడా రేసులో ఉన్నట్లు తెలిసింది. నెల్లూరు జిల్లాలో పార్టీ గెలుపు కోసం చాలా కష్టపడ్డామని.. తమకు టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆమె కోరుతున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

నాగబాబు కోసం ఒత్తిడి!

టీడీపీలోనే టీటీడీ చైర్మన్ పదవి కోసం ఎంతో మంది ఆశలు పెట్టుకోగా.. దాన్ని ఎలాగైనా దక్కించుకునేందుకు జనసేన పార్టీ పావులు కదుపుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోదరుడైన నాగబాబుకు ఆ పదవి ఇవ్వాల్సిందేనని జనసేన పార్టీ చంద్రబాబుపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయనకు టీటీడీ చైర్మన్ పదవి ఖాయమైనట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. అనంతరం ఆ ప్రచారాన్ని ఖండించిన నాగబాబు.. అధికారిక ప్రకటన వస్తేనే ఇలాంటి వాటిని నమ్మాలన్నారు. దీంతో నాగబాబుకు టీటీడీ చైర్మన్ పదవిపై ఆశ ఉన్నట్లు బయటపడింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధమైన నాగబాబు.. సర్దుబాటులో భాగంగా ఆ సీటును వదులుకున్నారు. దీంతో అన్నకు ఏదైనా మంచి పదవి ఇప్పించాలనే ఉద్దేశంలో పవన్‌కళ్యాణ్ ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే టీటీడీ చైర్మన్ పదవిని అడుగుతున్నట్లు సమాచారం. నెల రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉన్నా కూడా ఆ పదవికి ఉన్న ప్రాధాన్యత.. పోటీ నేపథ్యంలో చంద్రబాబు ఏమీ తేల్చట్లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టీటీడీ బోర్డులో కూడా తమ పార్టీకి చెందిన వారిని సగం మందిని నియమించాలని జనసేన కోరుతున్నట్లు తెలిసింది. బీజేపీ కూడా మూడుకు తగ్గకుండా తమ వారిని బోర్డులో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేస్తోందని సమాచారం.

ఈ ఏడాది డీఎస్సీ లేనట్టే

▶ మొదటి పేజీ తరువాయి

శిక్షణలోనే అభ్యర్థులు గడపనున్నారు. దీంతో అన్నాళ్లపాటు ఉపాధి లేకుండా ఉండటం ఎలా అనే బెంగ వారిలో గుబులు రేపుతోంది. ముఖ్యంగా నిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులను తలుచుకుని తల్లడిల్లుతున్నారు.

సంఘాల పేరుతో కాలయాపన

గత ప్రభుత్వం 6,100 టీచర్ పోస్టుల భర్తీకి ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతోపాటే టెట్‌ను ఫిబ్రవరి 27 నుంచి మార్చి 5 వరకు నిర్వహించగా 2.33 లక్షల మంది హాజరయ్యారు. ఈ ఫలితాలను జూన్ 25న ప్రకటించారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ లేకుంటే ఏప్రిల్‌లోనే డీఎస్సీ పరీక్షలు పూర్తయ్యేవి. కానీ కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి గత డీఎస్సీని రద్దు చేసింది. ఈ నేపథ్యంలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారికి అవకాశం ఇవ్వాలని మరోసారి టెట్ నిర్వహణకు ఈ నెల 2న నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే, టెట్‌కు, డీఎస్సీకి మధ్య కనీసం 90 రోజుల గడువు కావాలని నిరుద్యోగ సంఘాల నుంచి ఒత్తిడి వస్తోందంటూ షెడ్యూల్‌ను మళ్లీ మార్చారు. వాస్తవానికి గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులకు ఆలస్యం లేకుండా డీఎస్సీ నిర్వహించి, ఈ ఏడాది బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన వారికి మరో డీఎస్సీలో అవకాశం కల్పించాలని టెట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ వారి అభ్యర్థనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. వాస్తవానికి కొత్త ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను 2025 ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేసే సిబ్బంది సంఖ్య ఆధారంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడే డీఎస్సీని ప్రకటిస్తే పోస్టులను భర్తీ చేయడం ఎలా అని టెట్ షెడ్యూల్‌ను మార్చిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2025–26 విద్యా సంవత్సరంలోనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది. ఎవరూ అడగకపోయినా మరోసారి టెట్ నిర్వహణ అనడం, ఇచ్చిన తొలి నోటిఫికేషన్‌నే వాయిదా వేయడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు.

ఆరు నెలల్లో పోస్టుల భర్తీ అని.. చివరకు తూచ్

తొలుత చంద్రబాబు డిసెంబర్ నాటికి పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని ప్రకటించారు. అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖను ఆదేశించారు. ఈ మేరకు ఆగస్టులో టెట్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ ఇవ్వడంతో సెప్టెంబర్‌లోనే డీఎస్సీ కూడా పూర్తవుతుందని అభ్యర్థులు భావించారు. కానీ ఇప్పుడు టెట్ (జూలై) పరీక్షలను అక్టోబర్‌కు మార్చారు. ఈ ఫలితాలను నవంబర్‌లో విడుదల చేస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన మేరకు టెట్‌కు, డీఎస్సీకి మధ్య 90 రోజులు గడువు ఇచ్చినట్టయితే డీఎస్సీ నోటిఫికేషన్ ఇక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంటే ఫిబ్రవరి నుంచి మూడు నెలల అనంతరం పరీక్షలు నిర్వహించి వచ్చే ఏడాది జూన్, జూలైలో పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయనుంది.

ఇది ముమ్మాటికీ మోసమే..



అధికారంలోకి వచ్చాక వెంటనే మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేస్తామని నిరుద్యోగులకు చంద్రబాబు మాటిచ్చారు. కానీ గత ప్రభుత్వం ప్రకటించిన 6,100 పోస్టులకు మరో 10 వేల పోస్టులు మాత్రమే కలిపి నోటిఫికేషన్ ఇవ్వడం లక్షలాది మంది నిరుద్యోగులను మోసం చేయడమే. మెగా డీఎస్సీ వస్తుందని నమ్మిన నిరుద్యోగులకు మొండిచేయి చూపించారు. కొన్ని జిల్లాల్లో ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య బాగా తక్కువగా ఉంది. డిసెంబర్ నాటికి డీఎస్సీ ప్రక్రియ ముగిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు వాయిదాలు వేయడం వెనుక కుట్ర ఉంది. చిన్న చిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నవారు ఆ ఉద్యోగాలు వదులుకుని శిక్షణ తీసుకుంటున్నారు. నోటిఫికేషన్ ఆలస్యమైతే లక్షలాదిమందికి ఆర్థిక కష్టాలు తప్పవు. ఇచ్చిన మాట ప్రకారం డిసెంబర్ నాటికి డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేయాలి. అలాగే జీవో నం.117ను తక్షణమే రద్దు చేయాలి. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌పై స్పష్టత ఇవ్వాలి. మ్యానిఫెస్టోలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి.

– రామచంద్ర ఎంటేటి, ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ఐక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు

'గుల్బెంకియన్' అవార్డుకు ఏపీసీఎన్‌ఎఫ్ నామినేట్

- రాష్ట్రంలోని ప్రకృతి సాగుకు మరోసారి అంతర్జాతీయ గుర్తింపు
- లిస్బన్‌కు బయల్దేరిన రైతు సాధికార సంస్థ బృందం, మహిళా రైతు నెట్టెం నాగేంద్రమ్మ
- రేపు అవార్డుల ప్రకటన.. విజేతలకు ఒక మిలియన్ యూరోల నగదు బహుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్ర రైతులు చేస్తున్న ప్రకృతి వ్యవసాయానికి మరోసారి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం(ఏపీసీఎన్‌ఎఫ్).. అత్యంత ప్రతిష్టాత్మక 'గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ' అవార్డుకు నామినేట్ అయ్యింది. ఈ వివరాలను ఏపీ రైతు సాధికార సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో మీడియాకు తెలియజేసింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, ప్రకృతి విధ్వంసం వంటి మానవాళి సవాళ్లను అధిగమించేందుకు కృషి చేస్తున్న సంస్థలు, వ్యక్తులకు ప్రోత్సాహకంగా పోర్చుగల్‌కు చెందిన 'కలుస్ట్ గుల్బెంకియన్ ఫౌండేషన్' ఏటా ఈ అవార్డు అందజేస్తోంది. 2020లో మొదటిసారిగా స్వీడన్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ ఈ అవార్డును అందుకున్నారు. గుల్బెంకియన్ ఫౌండేషన్ విజేతలకు ఒక మిలియన్ యూరోల నగదు బహుమతిని ప్రకటించింది. తద్వారా సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న సంస్థలను, వ్యక్తులను ప్రోత్సహిస్తోంది. జర్మనీ మాజీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్ అధ్యక్షతన ఏర్పాటైన స్వతంత్ర జ్యూరీ.. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన 181 నామినేషన్ల నుంచి విజేతను ఎంపిక చేయనుంది. పోర్చుగల్‌లోని లిస్బన్ నగరంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 6.45 గంటలకు(భారత కాలమానం ప్రకారం రాత్రి 11.15 గంటలకు) తుది విజేతను ప్రకటించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ తరఫున ఉన్నత స్థాయి అధికార బృందంతో పాటు ఏపీసీఎన్‌ఎఫ్ తరఫున మహిళా రైతు నెట్టెం నాగేంద్రమ్మ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు లిస్బన్‌కు వెళ్లారు.

ప్రకృతి వ్యవసాయంలో 10 లక్షల మందికి పైగా..

ఏపీసీఎన్‌ఎఫ్ ద్వారా రాష్ట్రంలో ఐదు లక్షల హెక్టార్లలో పది లక్షల మందికి పైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా పెద్ద సంఖ్యలో రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడంతో ఏపీసీఎన్‌ఎఫ్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యక్రమంగా గుర్తింపు పొందింది. ప్రకృతి వ్యవసాయం.. రైతులకు వ్యవసాయ ఖర్చులు తగ్గించి అధిక దిగుబడులు అందిస్తోంది. దీంతో రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతోంది. ఏపీసీఎన్‌ఎఫ్ ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయానికి పునాదులు వేసింది.

ఆల్మట్టిలోకి 78,668 క్యూసెక్కులు

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావంతో పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, ఉప నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోంది. కృష్ణా ప్రధాన పాయ నుంచి మంగళవారం ఆల్మట్టి డ్యామ్‌లోకి 78,668 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 72 టీఎంసీలకు చేరుకుంది. ఆల్మట్టి నిండాలంటే ఇంకా 57 టీఎంసీలు అవసరం. వరద ఉధృతి ఇలానే కొనసాగితే 10 రోజుల్లో ఆల్మట్టి నిండే అవకాశం ఉంది. కృష్ణా ప్రధాన ఉప నది అయిన తుంగభద్రలో వరద ప్రవాహం కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 23,079 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 22.82 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యామ్ నిండాలంటే ఇంకా 83 టీఎంసీలు అవసరం.

బెజవాడలో కిడ్నీ రాకెట్ కలవరం

పేదలకు డబ్బు ఆశ చూపి, తప్పుడు పత్రాల సృష్టి

- గుంటూరులో పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- విజయవాడ ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి



లబ్బీపేట (విజయవాడ తూర్పు): గుంటూరులో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ మూలాలు బెజవాడలోనే ఉన్నట్టు తేలడం కలవరం సృష్టిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి డబ్బు ఆశ చూపి కిడ్నీ రాకెట్ నడుపుతున్నారు. అందుకోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నారు. నగరంలో జరిగిన కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగు చూస్తాయంటున్నారు. గుంటూరులోని కేవీపీ కాలనీకి చెందిన 31 ఏళ్ల గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా అనే వ్యక్తి కిడ్నీ అమ్మితే రూ.30 లక్షలు ఇస్తామని నమ్మబలికాడు. వెంకట్ అనే మరో మధ్యవర్తిని పరిచయం చేసి మధుబాబును విజయవాడ రప్పించారు. జూన్ 10న అతడిని బెజవాడలోని ఓ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్చి.. 15వ తేదీన శస్త్రచికిత్స ద్వారా కిడ్నీ కాజేశారు. రూ.30 లక్షలు ఇస్తామని.. కేవలం రూ.1,09,500 మాత్రమే ఇచ్చారని, మిగిలిన డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని బాధితుడు గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన విదితమే. తాను ఆస్పత్రిలో ఉన్న సమయంలో ఇదే తరహాలో మరో ఐదుగురికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసినట్టు బాధితుడు ఆరోపించారు.

గతంలోనూ ఇదే తీరు

కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స కోసం దొంగ పత్రాలు సృష్టించేందుకు విజయవాడలోని భవానీపురం తహసీల్దారుకు ఓ వ్యక్తి దరఖాస్తు చేయగా.. తహసీల్దారు తిరస్కరించారు. అవి తప్పుడు ధ్రువీకరణ పత్రాలుగా నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం ఏలూరుకు చెందిన బాధితుడు తన కిడ్నీ తీసుకుని.. డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నారంటూ ఏడాది కిందట అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీఆర్‌టీఎస్ రోడ్డులోని ఓ ఆస్పత్రిలో తనకు డబ్బు ఆశ చూపి కిడ్నీ తీసుకున్నానని, ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వలేదని మరో బాధితుడు ఏడాదిన్నర క్రితం ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగాడు. వైద్యులు అతనికి డబ్బులిచ్చి అల్లరి కాకుండా కప్పిపుచ్చారు.

విచారిస్తే అనేకం వెలుగులోకి

నగరంలో జరుగుతున్న కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలపై విచారణ జరిపితే మరిన్ని కేసులు వెలుగు చూసే అవకాశం ఉంది. ఈ రాకెట్ వెనుక కొందరు ఏజెంట్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ, వైద్యశాఖ ఉన్నతాధికారులు దృష్టి పెడితే అనేక అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. రోగి ఎవరు, కిడ్నీ దాత ఎవరూ అనేది క్షేత్రస్థాయిలో విచారణ జరగాల్సిన అవసరం ఉందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు: డీఎస్పీ



గుంటూరు ఈస్ట్: కిడ్నీ రాకెట్ బాధితుడు మధుబాబును నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో వెస్ట్ డీఎస్పీ మహేశ్ మంగళవారం విచారించారు. అనంతరం మధుబాబు నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు. డీఎస్పీ మహేశ్ మాట్లాడుతూ కిడ్నీ రాకెట్ కేసు త్వరితగతిన ఛేదించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మోసం చేసి కిడ్నీ తీసుకున్నారని మధుబాబు నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు సేకరించామని, దర్యాప్తులో సేకరించిన ఆధారాలతో కేసును ట్రాన్స్‌ఫర్ చేయాలా, లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులను సంప్రదించి, తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దివ్యాంగుడిపై టీడీపీ కార్యకర్తల దాడి



గాయాలపాలైన అశోక్‌బాబు

నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త, దివ్యాంగుడైన జువ్వాది అశోక్‌బాబుపై టీడీపీ శ్రేణులు దాడిచేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. తీవ్రంగా గాయపడిన అశోక్‌బాబు ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన తరువాత సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలరాంరెడ్డి తెలిపిన మేరకు.. మండలంలోని గణపవరం శాంతినగర్‌కు చెందిన అశోక్‌బాబు నూరుశాతం దివ్యాంగుడు. వీల్‌చైర్‌కే పరిమితం. ఈ నెల ఒకటో తేదీన పింఛను రూ.6 వేలు టీడీపీ నాయకులు అందించారు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరు మోటార్ సైకిల్‌పై అశోక్ ఇంటి వద్దకు వచ్చారు. వీల్‌చైర్‌లో ఇంటి గుమ్మం వద్ద అశోక్ తలమీద బీరుసీసాతో కొట్టి పరారయ్యారు. తలకు తీవ్రగాయమైన అతడిని స్థానికులు చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న అశోక్‌బాబు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై జరిగిన దాడి గురించి అశోక్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. గతంలో కూడా తనపై రెండుసార్లు దాడి జరిగిందని, ఎన్నికల ఫలితాల రోజు టీడీపీ కార్యకర్తలు తమ ఇంట్లోకి బీరుసీసాలు విసిరేశారని అశోక్ తెలిపారు.

రాజకీయ కక్షతో నా కుమారుడిపై హత్యాయత్నం

- మాకు రక్షణ కల్పించండి
- ఏలూరు జిల్లా ఎస్పీకి పోస్టుమాస్టర్ వినతి



ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన కామిరెడ్డి తల్లిదండ్రులు, బంధువులు

దెందులూరు: రాజకీయ కక్ష పెట్టుకున్న వ్యక్తులు 24 మంది మారణాయుధాలతో తన కుమారుడు కామిరెడ్డి నర్సింహారావు (నాని)పై హత్యాయత్నానికి తెగబడ్డారని, వారిపై చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఏలూరు జిల్లా దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామానికి చెందిన పోస్టు మాస్టర్ కామిరెడ్డి ఆనంద్‌బాబు, కామిరెడ్డి జలజాక్షి.. జిల్లా అడిషనల్ ఎస్పీ స్వరూపారాణికి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఏలూరు ఎస్పీ కార్యాలయంలో ఈ అంశాలను మీడియాకు వివరించారు. ఈ నెల 7న శ్రీరామవరంలోని తన ఇంట్లోకి 24 మందితో పాటు మరికొంత మంది అక్రమంగా ప్రవేశించారని, తన కుమారుడు వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నర్సింహారావు (నాని) ఇంట్లో ఉండటాన్ని గమనించి తన కుమారుడిని చంపాలనే ఉద్దేశంతో మారణాయుధాలతో వచ్చారని వివరించారు. వారు తనకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారని చెప్పారు. తన కుమారుడు వెనుక వైపునకు వెళ్లి ఒక గదిలో తలుపు వేసుకుని ఉండగా గదిని పగులగొట్టి తన కుమారుడిని చంపే ప్రయత్నం చేస్తున్న సమయంలో పోలీసులు రాగా రాత్రి ఒంటి గంట సమయంలో వారంతా వెళ్లిపోయారన్నారు. ఎప్పటికైనా చంపేస్తామని బెదిరించారని చెప్పారు. తన కుటుంబసభ్యులను కూడా దుర్భాషలాడి భయభ్రాంతులకు గురి చేసి చోడవరపు లక్ష్మణరావు అనే వ్యక్తిని కూడా గాయపరిచారన్నారు. తమ ఇంట్లో పోస్టాఫీస్ ఫర్నిచర్, తన ఇంటి అద్దాలు, కుర్చీలు, తన కుమారుడి కార్యాలయం ధ్వంసం చేశారని తెలిపారు. తన కుమారుడిపై హత్యాయత్నం చేసిన వారందరిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. తన కుమారుడికి, తమ కుటుంబానికి భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుతో పాటు ఫొటోలు, సీడీలు ఎస్పీకి జతపరిచినట్లు తెలిపారు.

తహసీల్దారును నిర్బంధించిన వీఆర్వో

- సహ వీఆర్వోను చెప్పుతో కొట్టబోయిన వైనం
- తన పరిధిలో రెవెన్యూ పనుల్ని ఇతర వీర్వోలతో చేయిస్తున్నారంటూ ఆగ్రహం
- న్యాయం చేయకపోతే కొడుకుతో సహా చనిపోతానంటూ ధర్నా
- తహసీల్దారు కార్యాలయం బయట గోడలపై పెట్రోల్‌పోసిన వీఆర్వో కుమారుడు
- కృష్ణాజిల్లా ఘంటసాలలో సంచలనం



తహసీల్దార్ ఛాంబర్ గుమ్మం వద్ద కుమారుడితో కలసి బైఠాయించిన వీఆర్వో నాగమల్లేశ్వరి

ఘంటసాల: కృష్ణాజిల్లా ఘంటసాల తహసీల్దారును మంగళవారం వీఆర్వో నాగమల్లేశ్వరి నిర్బంధించారు. తోటి వీఆర్వోను చెప్పుతో కొట్టబోయారు. తనకు న్యాయం చేయకపోతే కొడుకుతో సహా చనిపోతానంటూ ధర్నాకు దిగారు. ఈ వ్యవహారం సంచలనం కలిగించింది. ఘంటసాల మండలం ఘంటసాలపాలెం సచివాలయ వీఆర్వోగా బి.నాగమల్లేశ్వరి పనిచేస్తున్నారు. సచివాలయం పరిధిలోని ఘంటసాలపాలెం, కొత్తపల్లి, తాడేపల్లి గ్రామాల వీఆర్వోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ మూడు గ్రామాలకు సంబంధించిన పాస్‌బుక్ ఫైల్స్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఇతర రెవెన్యూ పనులను అధికారులు తన ప్రమేయం లేకుండానే కొడాలి, ఘంటసాల, లంకపల్లి వీఆర్వోలు తదితరులతో చేయిస్తున్నారని, తన సంతకాలు లేకుండా ఫైల్స్ ఆన్‌లైన్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఆమె మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. కొడాలి వీఆర్వోను చెప్పుతో కొట్టడానికి ప్రయత్నించారు. కార్యాలయంలో తహసీల్దారు ఎస్.బి.విజయలక్ష్మిని నిర్బంధించారు. తనకు న్యాయం చేసేంతవరకు తలుపులు తీయనని భీష్మించారు. బయట నుంచి సిబ్బంది కేకలు వేయడంతో ఆమె తలుపులు తీశారు. ఆమె కుమారుడు కార్యాలయం బయట గోడలపై పెట్రోల్ పోశాడు. కలెక్టర్, జేసీ, ఆర్డీవో వచ్చి తనకు న్యాయం చేయాలని, లేదా తన కుమారుడితో కలసి చనిపోతానంటూ కుమారుడితో కలసి తహసీల్దార్ చాంబర్ ముందు ధర్నాకు దిగారు. తన పరిధిలో పనులు తన ప్రమేయం లేకుండా జరగడంపై ఆర్డీవో విచారించాలని, తనకు న్యాయం చేయాలని తొమ్మిది నెలలుగా ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో చల్లపల్లి సీఐ సీహెచ్.నాగప్రసాద్, ఎస్‌ఐ చినబాబు అక్కడికి వచ్చి వీఆర్వో నాగమల్లేశ్వరితో మాట్లాడారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూద్దామని సర్దిచెప్పారు. అయినా నాగమల్లేశ్వరి ఆందోళన విరమించకపోవడంతో కలెక్టర్‌తో మాట్లాడిస్తామని సంబంధిత అధికారులతో చెప్పించి ధర్నా విరమింపజేశారు. ఈ విషయమై తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ తాను ఎన్నికల విధుల్లో భాగంగా ఐదునెలలు కిందట ఘంటసాల వచ్చినట్లు చెప్పారు. తాను పనుల్ని ప్రాపర్ చానల్ ద్వారానే చేస్తున్నానని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. తన గదిలోకి వచ్చిన వీఆర్వో నాగమల్లేశ్వరి అక్కడే ఉన్న కొడాలి వీఆర్వోను చెప్పుతో కొట్టబోయిందని, ఏమైందని అడుగుతుండగానే అసభ్య పదజాలంతో తిట్టడమేగాక తలుపులు మూసేసిందని, అనంతరం తన చాంబర్ ముందు బైఠాయించిందని చెప్పారు. గత తహసీల్దార్ హయాంలో వీఆర్వోకు సంబంధం లేకుండా ఫైల్స్ చేశారని వీఆర్వో ఆరోపిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీవో నుంచి వీఆర్వోపై వచ్చిన రిపోర్టు చూసి ఆగ్రహంతో ఆందోళన చేసి ఉంటుందని భావిస్తున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.



"శరీరాన్ని మంచి ఆరోగ్యంతో ఉంచుకోవటం ఒక కర్తవ్యం. లేకుంటే మనస్సును బలంగా, స్పష్టంగా ఉంచుకోలేం.
- గౌతమ బుద్ధుడు

సాక్షి
బుధవారం, 10 జూలై 2024

భారత్‌-రష్యా సాన్నిహిత్యం

దౌత్య ప్రపంచంలో ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. పర్యటనలైనా, ప్రసంగాలైనా, సమావేశాలైనా, ఒప్పందాలైనా- దేశాల ప్రయోజనాలతో ముడిపడివుంటాయి. సమయం, సందర్భం తప్పనిసరిగా ఉంటాయి. తమ ఆలోచనలేమిటో నిక్కచ్చిగా చెప్పడం కూడా వీటి ఉద్దేశం కావొచ్చు. ప్రధాని మోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాక తన తొలి విదేశీ పర్యటన కోసం ఇరుగు పొరుగు దేశాలను సందర్శించే ఆనవాయితీని పక్కనబెట్టి రష్యాను ఎంచుకున్నారు. రెండు రోజుల ఆ పర్యటన మంగళ వారం ముగియబోతుండగా అమెరికా ప్రాపకంతో 75 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన సైనిక కూటమి నాటో వజ్రోత్సవాలు వాషింగ్టన్‌లో మొదలయ్యాయి. ఇవి మూడురోజులపాటు సాగుతాయి. రష్యా పూర్వరూపమైన సోవియెట్‌ యూనియన్‌కు వ్యతిరేకంగా నాటో ప్రారంభమైంది. కనుక మోదీ రష్యా పర్యటన సహజంగానే అమెరికాకు కంటగింపుగా ఉండొచ్చు. ఈ పర్యటన 'శాంతి ప్రయత్నాలకు' తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఇప్పటికే ఉక్రెయిన్‌ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. పైగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత అత్యంత క్రూరుడైన నేరగాణ్ణి హత్తుకోవటం ఏమిటని విమర్శించారు. జెలెన్‌స్కీ చెబుతున్న శాంతి ప్రయత్నాలేమిటో ప్రపంచంలో ఎవరికీ తెలియదు. తెలిసిందల్లా రష్యాను ఎదుర్కొనటానికి యుద్ధం మొదలైననాటి నుంచీ ఉక్రెయిన్‌కు అమెరికా, పాశ్చాత్య దేశాలు ఎడాపెడా ఆయుధాలు, డబ్బు సరఫరా చేయటం. అందువల్లే ఆ ఘర్షణ ఎడతెగకుండా సాగుతోంది. ఇందులో శాంతి ప్రసక్తి ఎక్కడుందో అర్థంకాదు. రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఖండించాల్సిందే. కానీ ఇందులో ఉక్రెయిన్‌ బాధ్యత కూడా ఉంది.

దాని సంగతలావుంచితే భారత-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధానంగా మోదీ రష్యా వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ ఒప్పందాలు కూడా కుదిరాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్‌, మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారాన్ని కూడా అందజేశారు. అయితే మంగళవారం ఉక్రెయిన్‌ రాజధాని కియూవ్‌లో ఒక ఆసుపత్రిపై జరిగిన క్షిపణి దాడిలో 37 మంది చనిపోయిన ఉదంతాన్ని ఖండించటానికి మోదీ వెనకాడలేదు. రష్యాతో మనకున్న మైత్రి ఈనాటిది కాదు. ఆ మైత్రికి ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. మోదీ అన్నట్టు రష్యా అన్ని కాలాల్లోనూ దృఢంగా మన వెనక నిలబడింది. స్నేహ హస్తం అందించింది. 1971లో పాకిస్తాన్‌తో మనకు యుద్ధం వచ్చినప్పుడు అన్నివిధాలా ఆదుకుంది. ఆ యుద్ధంలో మనం సాధించిన విజయంలో సోవియెట్‌ పాత్ర కీలకమైనది. మన అమ్ములపొదిలో ఉన్న రక్షణ పరికరాల్లో అత్యధిక భాగం ఆ దేశం నుంచి దిగుమతి చేసుకున్నవే. ఇది కేవలం కొనుగోలుదారు- అమ్మకందారు సంబంధం కాదు. పరిశోధన, అభివృద్ధితో మొదలెట్టి ఉమ్మడి ఉత్పత్తుల వరకూ ఇరు దేశాలూ సహకరించుకుంటున్నాయి. మనకున్న రెండు విమానవాహక నౌకల్లో ఒకటి రష్యానుంచి వచ్చినదే. ఇంకా ఎస్‌–400 గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థ, మిగ్‌–29, ఎస్‌యూ–30 ఎంకెఐ యుద్ధ విమానాలు, సైనిక హెలికాప్టర్లు, ఏకే–203 రైఫిళ్లు, బ్రహ్మోస్‌ సూపర్‌ సోనిక్‌ క్రూయిజ్‌ క్షిపణులు తదితరాలున్నాయి. ఇవిగాక తన టీ–90 శతఘ్నుల ఉత్పత్తికి మనకు అనుమతులిచ్చింది. విడి భాగాల దగ్గర్నుంచి నూతన పరిశోధనల వరకూ మన రక్షణ వ్యవస్థ పూర్తిగా రష్యాతో ముడిపడివుంది. అణు విద్యుత్‌ కర్మాగారాల స్థాపన, నిర్వహణలో తోడ్పడుతోంది. ఇరవై అయిదేళ్ల క్రితం మనకు అమెరికాతో కూడా సత్సంబంధాలు ఏర్పడ్డాయి. అమెరికా, ఫ్రాన్స్‌, ఇజ్రాయెల్‌ తదితర దేశాల నుంచి కూడా మనం రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. మనను రష్యాకు దూరం చేయాలని ఆది నుంచీ అమెరికా ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్‌ యుద్ధం మొదలయ్యాకైతే ఇది మరింతగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి వంటి అంతర్జాతీయ సంస్థల్ని బేఖాతరుచేసి ఘర్షణలు నివారించే పేరుమీద అమెరికా ఒక పక్షాన్ని సమర్థించటం, అవతలిపక్షంతో ఎవరూ సాన్నిహిత్యం నెరపకూడదని ఫర్మానా జారీచేయటం ఆశ్చర్యకరం. వాస్తవాధీన రేఖ వద్ద చైనాతో మనకు అయిదేళ్లుగా లడాయి నడుస్తోంది. ఆ దేశంతో ఘర్షణలు వస్తే మనకు రష్యా నుంచి రక్షణ పరికరాలు, విడిభాగాలు అత్యవసరమవుతాయి. అంతేకాదు... రక్షణ సాంకేతికతలు చైనాకు పోకుండా చూడటం మనకు ముఖ్యం. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని ప్రయోజనాలూ వదులుకుని తాను చెప్పినట్టల్లా నడుచుకోవాలని అమెరికా భావించటం ఎంతమాత్రం సరికాదు. పాకిస్తాన్‌తో మనకున్న సమస్యల విషయంలో ఏనాడూ అమెరికా సానుభూతిగా లేదు. కంటితుడుపు చర్యలు తీసుకోవటం, ఏదో వంకన ఆ దేశానికి సైనిక, ఆర్థిక సాయం అందించటం అమెరికాకు రివాజుగా మారింది. మనం మాత్రం తన ఫర్మానాలు పాటించాలని ఆ దేశం ఆశిస్తుంది. ఉక్రెయిన్‌ యుద్ధం మొదలయ్యాక రష్యా నుంచి ముడి చమురు దిగుమతి వద్దన్న అమెరికా ఒత్తిడిని కాదని, రోజుకు 21 లక్షల బ్యారెళ్ల చొప్పున దిగుమతి చేసుకుంటున్నాం. చౌకగా లభించే ఆ ముడి చమురు వల్ల మనం లాభపడటం మాట అటుంచి ప్రపంచ చమురు మార్కెట్‌ స్థిరత్వం సాధించింది.

వర్తమాన సంక్లిష్ట పరిస్థితుల్లో రష్యాతో సాన్నిహిత్యం ఇబ్బందికరమే అయినా, దేశ ప్రయోజనాల రీత్యా దాన్ని కొనసాగించాలనుకున్న మన దేశ వైఖరి మెచ్చదగినది. ఏదేమైనా రెండు దేశాల మధ్య ఉండే ద్వైపాక్షిక సంబంధాలను మూడో దేశం ప్రభావితం చేయాలనుకోవటం, వాటిని తెంచుకోవాలని ఒత్తిడి తీసుకురావటం మంచి సంప్రదాయం కాదు. తన పర్యటన ద్వారా అమెరికాకు ఈ సంగతిని స్పష్టం చేసిన ప్రధాని మోదీ చర్య ప్రశంసించదగ్గది.

'ఒకే పన్ను'కు పెద్ద రంగాలే దన్ను

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్‌

జీఎస్టీని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఇంకా ఎంతో అవకాశం ఉంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, విధానాన్ని సులభతరం చేయడం వీటిల్లో కొన్ని చర్యలు మాత్రమే. అదే సమయంలో ఒకే పన్ను రేటు అన్న అసలు లక్ష్యాన్ని అందుకోవాలంటే ఆర్థిక వ్యవస్థలోని అతి పెద్ద రంగాలైన పెట్రోలియం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడం తప్పనిసరి. ఒకే పన్ను అన్నది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా ఇప్పుడున్న పన్ను స్లాబ్‌లను తగ్గించి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాలు కూడా హేతుబద్ధమైన దృష్టితో ఆలోచించి దేశ ఆర్థిక వృద్ధి కోసం జీఎస్టీ లక్ష్యానికి దన్నుగా నిలవాలి.

దేశంలో ఏడేళ్ల క్రితం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని తొలిసారి ప్రవేశపెట్టినప్పుడు దాని అమలుపై చాలా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ సందేహాల నివృత్తి జరక్కుండానే జీఎస్టీ అమలుకు నిర్ణయం తీసుకోవడం దుందుడుకు చర్యగా కొందరు అభివర్ణించారు కూడా! అంతకు ఏడాది క్రితమే పెద్దనోట్ల రద్దు జరిగిందని, ఆ నష్టం నుంచి తేరుకోకముందే అరకొరగా జీఎస్టీని అమలు చేయడం సరికాదని వాదించారు. ఆర్థికవేత్తలు, పన్ను నిపుణులు చాలామంది జీఎస్టీ అమలు విఫలం కాక తప్పదన్న హెచ్చరికలూ జారీ చేశారు. అయితే అన్ని అభ్యంతరాలను తోసిరాజని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌ జైట్లీ ముందడుగు వేయడం తెలివైన పనే అని ఇప్పుడు అనిపిస్తోంది. ఎందుకంటే అనుమానాలు తీర్చడంలో, జీఎస్టీలో భాగస్వాములైన వారందరి అభ్యంతరాలకు సమాధానాలు ఇవ్వడంలో ఏళ్లు పూళ్లు అవడం ఖాయం. కానీ ఒక్క విషయమైతే ఇక్కడ చెప్పుకోవాలి. దేశ వ్యాప్తంగా ఒకే రకమైన పన్ను ఉండాలన్న జీఎస్టీ లక్ష్యం పెద్ద పెద్ద ఆర్థిక వ్యవస్థలనూ దీని పరిధిలోకి తీసుకు రాగలిగితేనే నెరవేరుతుంది.

జీఎస్టీపై సాధికార కమిటీ

దేశవ్యాప్తంగా ఒకే పన్ను అన్న అంశంపై సుమారు 18 ఏళ్ల చర్చలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నులు, రాష్ట్రాల పన్నుల స్థానంలో ఒకటే పన్ను ఉండాలన్నది 1999 నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ఆలోచన. విజయ్‌ కేల్కర్‌ నివేదిక ఈ కొత్త పన్ను విధానాన్ని ప్రతిపాదించింది. తద్వారా పన్ను వసూళ్లు మెరుగవుతాయని, ఆర్థిక వ్యవస్థల ఏకీకరణ సాధ్యమవుతుందని అంచనా వేశారు. జీఎస్టీ అమల్లో ఉన్న దేశాల్లో ఆర్థిక వృద్ధి రేటు బాగున్నట్లు అప్పటికే జరిగిన పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి కూడా. జీఎస్టీపై 2000లో ఆర్థిక మంత్రులతో కూడిన ఒక సాధికార కమిటీ ఏర్పాటైంది. పశ్చిమ బెంగాల్‌ ఆర్థిక శాఖ మంత్రి అసిమ్‌దాస్‌ గుప్తా ఆ కమిటీకి నేతృత్వం వహించారు. ఇప్పటి జీఎస్టీ కౌన్సిల్‌ తొలి రూపం ఆ కమిటీనే. దాని సిఫారసులను అనుసరించి అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం, ఆదాయ వ్యవహారాల్లో ఏకాభిప్రాయ సాధన సూత్రాలుగా జీఎస్టీ కౌన్సిల్‌ పని చేస్తుంది. చర్చోపచర్చల తరువాత ఈ కమిటీ జీఎస్టీ బిల్లు తొలి ముసాయిదాను సిద్ధం చేసింది. ఇందుకు సుమారు ఇరవై ఏళ్లు పట్టింది. అప్పటికీ కొన్ని అభ్యంతరాలు ఉండగా... 2016 నాటికి గానీ స్థూలమైన ఏకాభిప్రాయం కుదరలేదు.

మెరుగుపడిన పన్ను వసూళ్లు!

ఒకే ఒక్క పన్ను అన్న లక్ష్యంతో మొదలైన జీఎస్టీలో సంక్లిష్టతలు వచ్చేందుకు ఒక కారణం... తమ ఆదాయం పడిపోతుందన్న రాష్ట్రాల బెంగ. ఫలితంగా... ఒకే పన్ను స్థానంలో



ఇటీవలి జీఎస్టీ కౌన్సిల్‌ సమావేశంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌

పలు రకాల పన్ను రేట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రాల జీఎస్టీ, కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ, అంతర్రాష్ట్ర రవాణాపై సమీకృత జీఎస్టీ ఇలా పలు రకాల పన్నులు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా... ఐదు నుంచి 28 శాతం వరకూ నాలుగు విభాగాల పన్ను రేట్లను నిర్ధారించారు. అంతే కాదు... తమకు అత్యధిక ఆదాయాన్నిచ్చే పెట్రోలు, మద్యం జీఎస్టీ పరిధిలోకి రాకుండా ఉండాలని రాష్ట్రాలు పట్టుబట్టాయి. జీఎస్టీ అమలు సమయంలో ఈ పన్ను ద్వారా తగినంత ఆదాయం వస్తుందా? అన్న అనుమానాలు రాష్ట్రాలకు ఉండేది. అయితే ఈ అనుమానాలు వట్టివేనని తేలిపోయింది. వాస్తవానికి పన్ను వసూళ్లు మునుపటి కంటే బాగా మెరుగయ్యాయి.

జీఎస్టీ తాజా గణాంకాలను పరిశీలిస్తే గత జూన్‌ నెలలో వసూళ్లు 1.74 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. జీఎస్టీని ప్రవేశపెట్టిన తొలి ఏడాది ఈ మొత్తం నెలకు 90 వేల కోట్ల రూపాయలు మాత్రమే. రాష్ట్రాల సొంత ఆదాయం కూడా జీఎస్టీ అమలు తరువాత పెరిగినట్లు ఆర్‌బీఐ జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడయింది. అంటే... రాష్ట్రాలు జీఎస్టీ విషయంలో ఏర్పాటు చేసిన కాంపెన్సేషన్‌ లేకుండా సొంత ఆదాయాలతోనే వ్యవహారాలు చక్కబెట్టుకునే అవకాశం ఉందన్న మాట. ఈ కాంపెన్సేషన్‌ అనేది ముందు ఐదేళ్లు ఉంటుందని అనుకున్నారు కానీ... కోవిడ్‌ కారణంగా 2026 వరకూ పొడిగించారు. ఆదాయం ఇప్పటి మాదిరే పెరుగుతూ ఉంటే ఈ ఏర్పాటును రద్దు చేయవచ్చు.

చిన్న వ్యాపారులకు మేలే జరిగింది!

మొత్తమ్మీద జీఎస్టీ అమలులో కొన్ని ఆటుపోట్లు ఉన్నాయన్నది వాస్తవం. పద్ధతులను సులువు చేసే విషయంలో, మరీ ముఖ్యంగా రెడ్‌టేప్‌ను తగ్గించడంలో! అయితే ఇతర సమస్యలేవైనా వచ్చినా వాటి పరిష్కారం కోసం రాష్ట్రాలు తరచూ జీఎస్టీ కౌన్సిల్‌ రూపంలో సమావేశమవుతూండటం గమనార్హం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్టీ పరిధిలోకి తేవడం ఎలా అనే సవాలును కంప్యూటర్ల సాయంతో అధిగమించారు. జీఎస్టీ అమలుతో చిన్న వ్యాపారులకు నష్టం జరుగుతుందని కొంతమంది భయపడ్డారు కానీ.. వాస్తవానికి జరిగింది మేలే. లక్షలాది చిన్న వ్యాపారులు డిజిటల్‌ ఆర్థిక వ్యవస్థలో భాగమైపోయారు.

జీఎస్టీ పరిధిలోకి పెట్రోలు

జీఎస్టీ అమలుతో సామాన్యులపై పన్ను భారం ఎక్కువ అవుతుందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు కానీ దీనికి కూడా సరైన హేతువు ఏదీ లేదని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. వినియోగమవుతున్న వస్తువుల్లో 60 శాతం వాటికి అతి తక్కువ పన్ను రేట్లు (సున్నా లేదంటే ఐదు శాతం) ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు కేవలం మూడు శాతం వస్తువులపై మాత్రమే 28 శాతం అత్యధిక పన్ను పడుతోంది. అయినా ఒక్క విషయాన్ని మాత్రం మనం అంగీకరించాల్సి ఉంటుంది. జీఎస్టీ పన్ను రేట్లను మరింతగా హేతుబద్ధీకరించాలి. ఒకే పన్ను రేటు అన్నది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా ఇప్పుడున్న పన్ను స్లాబ్‌లను తగ్గించి దీర్ఘకాలంలో పన్ను వసూళ్ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చు.

ఇక రెండో అంశం. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉంది. విద్యుత్తు, భూమి వంటి వాటిని కూడా చేర్చాలన్న వాదన ఉంది. తొలి దశలో భాగంగా వైమానిక ఇంధనం, సహజవాయువులను జీఎస్టీ పరిధిలోకి తేవాలి. పెట్రోలు, డీజిళ్లను కూడా చేర్చడం ఇప్పటికే ఆలస్యమైందని చెప్పాలి. రాష్ట్రాలకు సంబంధించి అతి పెద్ద ఆదాయ వనరుగా ఉండటం వల్ల మద్యం అమ్మకాలపై జీఎస్టీ అనేది కొంచెం సున్నితమైన అంశం అవుతుంది. అయితే నేడు కాకపోతే రేపు అయినా సరే... ఈ మార్పు అనివార్యం.

అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ అవసరం

జీఎస్టీ కౌన్సిల్‌ ఇటీవలి సమావేశాల్లో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు మేలు చేసేలా కొన్ని నిర్ణయాలు జరిగాయి. జీఎస్టీకి ముందు కాలం నాటి వివాదాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించారు. అదే సమయంలో జీఎస్టీ అప్పిలేట్‌ ట్రిబ్యునల్‌ ఏర్పాటు అవసరాన్ని కూడా కౌన్సిల్‌ గుర్తించింది.

జీఎస్టీ అమలును మరింత సమర్థంగా మార్చేందుకు ఇంకా ఎంతో అవకాశం ఉంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, విధానాన్ని సులభతరం చేయడం వీటిల్లో కొన్ని చర్యలు మాత్రమే. అదే సమయంలో ఒకే పన్ను అన్న అసలు లక్ష్యాన్ని అందుకోవాలంటే ఆర్థిక వ్యవస్థలోని అతిపెద్ద రంగాలైన పెట్రోలియం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడం తప్పనిసరి అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాలు కూడా హేతుబద్ధమైన, దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించి దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడేలా జీఎస్టీ లక్ష్యానికి దన్నుగా నిలవాలి.

వ్యాసకర్త ఆర్థిక వ్యవహారాల సీనియర్‌ జర్నలిస్ట్‌

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్‌, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కూలిన విలువలు



బిహార్‌లో 15 రోజుల్లో 10 వంతెనలు కూలిపోయాయి. ఏ ఇతర ప్రభుత్వం అయినా అక్కడ ఉండి ఉంటే ఈపాటికి రద్దయి ఉండేది. లేదంటే... సిగ్గుతో రాజీనామా చేసి ఉండేది. (బిహార్‌లో నితీష్‌ కుమార్‌ ప్రభుత్వం కేంద్రంలో ఎన్డీయే భాగస్వామిగా ఉండటాన్ని గుర్తు చేస్తూ).

– ఆదిత్య ఠాక్రే, యువ(శివ)సేన అధ్యక్షుడు

ఇదసలు కరెక్టేనా?



ప్రధాన మీడియా సంస్థలో పని చేస్తున్నప్పుడు పైవాళ్ల నుంచి మేమెప్పుడూ వింటుండే మాట – 'టార్గెట్‌ ఆడియెన్స్‌'! ముఖ్యంగా 30+ వయసులోని టెకీలకు ఆసక్తికరంగా ఉండే స్టోరీలను చేయమని చెప్పేవారు. నేనెప్పుడూ ఆ మాటను పట్టించుకోలేదు. (వరద ముంపు స్టోరీ క్లిప్‌ను తన ట్వీట్‌కు జత చేస్తూ..)

– షబ్బీర్‌ అహ్మద్‌, ఒకప్పటి పేపర్‌ బాయ్‌ (నేడు రిపోర్టర్‌)

రెండు ప్రశ్నలు



రెండు రోజుల క్రితం కఠువా ఉగ్రదాడిలో మరణించిన ఐదుగురు సైనికులలో 26 ఏళ్ల రైఫిల్‌మన్‌ ఆదర్శ్‌ నేగీ ఒకరు. జమ్మూ ప్రాంతంలో ఇటీవలి వారాల్లో పకడ్బందీగా జరిగిన దాడులలో ఇది ఐదవది. కఠినమైన ప్రశ్న : మన నిఘా విభాగం ఏం చేస్తోంది? పెద్ద ప్రశ్న : ఇండియా ఇప్పుడు ఏం చేయబోతోంది?

– శివ్‌ అరూర్‌, పాత్రికేయుడు

ఓర్వ లేరు!!




చాలా కాలంగా మనం ఏ ప్రపంచ కప్‌ టైటిల్‌నూ గెలవక పోవటం వల్ల వెల్లివిరుస్తున్న ఆనందం ఇది. ఇండియా టీ20 వరల్డ్‌ కప్‌ టైటిల్‌ సాధించటం నిజంగానే పెద్ద ఘనత. ఈ ఉద్వేగాన్ని 'అతి'కి ప్రతీకగా విమర్శిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆటల గురించి తెలియదనే అంటాను. ఇలాంటి వారు ప్రజలు సంతోషంగా ఉండటాన్ని సహించలేరు.

– నిమిష్‌ దూబే, రచయిత, సంపాదకుడు

సామాజిక సమరసతా కవి

'వినుడి మాయప్ప సిద్ధప్ప విహితుడప్ప/ కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప' అనే మకుటంతో సామాజిక అంశాలు ఇతివృత్తంగా అనేక పద్యాలు రచించి సమాజాన్ని మేల్కొల్పిన వర కవి సిద్ధప్ప రాజయోగి. ఈయన నాటి కరీంనగర్‌, నేటి సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో 1903 జూలై 9న ఓ శాలివాహన కుటుంబంలో జన్మించారు. ఆ కాలంలోనే 7వ తరగతి వరకు చదివారు. సిద్ధప్ప పదిహేనవ యేటనే రామాయణ, అమరకోశాలను పుక్కిట పట్టారు. స్వతహాగా సాహిత్య రచన చేసి 'సిద్ధప్ప వరకవి'గా ప్రసిద్ధి చెందారు. సాహిత్యంతో పాటు జ్యోతిష్యం, వాస్తు, ఆయుర్వేద, యోగసేవలు కొనసాగిస్తూ మానసిక రుగ్మతలకు సలహాలు ఇస్తుండేవారు. తన కలం ద్వారా శ్రామికుల కండ్లు తెరిపించారు. మంచికి ప్రాధాన్యమిస్తూ కులవ్యవస్థ, మూఢ నమ్మకాలను ఖండించారు.



వరకవి సిద్ధప్ప రాజయోగి

సాధారణ జనం సైతం అలవోకగా పాడుకునే విధంగా రచనలు చేసిన సిద్ధప్ప పద్యాలలో 'యేకులంబని' పద్యం నేటికీ భజన మండళ్ల గాయకుల నాలుకలపై నాట్యం చేస్తోంది:

'ఏ కులంబని నన్ను ఎరుకతో నడిగేరు/ నా కులంబును జెప్ప నాకు సిగ్గు/ తండ్రి బోందిలివాడు తల్లి దాసరి వనిత/ మా తాత మాలోడు మరియు వినుడి/ మా యత్త మాదిగది మామ యెరుకలివాడు/మా బావ బల్జతడు మానవతుడు/ కాపువారీ పడుచుకాంత దొమ్మరివేశ్య/ భార్యగావలె నాకు ప్రాణకాంత'– అంటూ ఆయన కుల వాదాన్ని నిరసించారు. సమస్త కులాల విరాట్‌ స్వరూపంగా కనిపిస్తారు. భక్తిమార్గంలో ఉంటూనే మూఢభక్తిని ఆయన నిరసించారు.

సిద్ధప్ప రాసిన చాలా పద్యాలలో ఆర్తి, వేదన, సంఘ రీతి పట్ల కసి, అసమానతల పట్ల అసహ్యం కనపడుతుంటాయి. సరస్వతీ కటాక్షంతో 40 వరకు రాసిన వీరి రచనల్లో 'జ్ఞానబోధిని' నాలుగు సంపుటాలు ప్రసిద్ధిగాంచాయి. 'వర్ణమాల కందార్థములు', 'కాలజ్ఞాన కందార్థములు', 'నరసింహ స్వామి వర్ణమాల', 'విష్ణు భజనావళి', 'శివ భజనావళి', 'గోవ్యాఘ్ర సంభాషణ', 'కాకి హంసోపాఖ్యానం', 'అర్చకుల సుబోధిని' వంటి రచనలు ఎన్నో చేసి తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 'జీవ నరేంద్ర' నాటకంతో పాటు, 'గాంధీ మహాత్మ' యక్షగానం కూడా అందించారు. ఆత్మతత్వాన్ని తెలియపరుస్తూ 'ఘటము కంటె వేరైన మఠము లేదు/ ఆత్మకంటె వేరైన హరియు లేడు' అని చెప్పారు. ఆత్మతత్త్వం అర్థం అయితే హెచ్చు తగ్గులు వాటంతట అవే సమాజం నుండి దూరం అవుతాయనే అనుభవజ్ఞుల మాటలను ఒక్క పాదంలో అర్థమయ్యేలా సిద్ధప్ప చెప్పారు. ఆయన కాలజ్ఞాని కూడా! నిజాం ప్రభుత్వం కూలుతుందని, కరీంనగర్‌కు దక్షిణాన పెద్ద జలాశయం (మానేరు) ఏర్పడుతుందని ముందే ఊహించి చెప్పారు.

'తెలంగాణ తొలి సమాజ కవి'గా, 'తెలంగాణ వేమన'గా వెలుగొంది 'గోల్కొండ కవి'గా గోల్కొండ కవుల సంచికలో ఒకరిగా వెలుగొందారు. పరిశోధకుడు జయధీర్‌ తిరుమలరావు సిద్ధప్పను వేమనతో పోల్చారు. బిరుదురాజు రామరాజు తన యోగుల పుస్తకంలో సిద్ధప్ప గూర్చి సమీక్షించారు. రచనల ద్వారా సమాజ మూఢత్వాన్ని, కులం కుళ్ళును ముక్కుసూటిగా ఖండించిన సిద్ధప్ప 1984 మార్చి 23న తనువు చాలించారు. 1996లో ఆయన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి నాడు గుండారెడ్డి పల్లెలో సమారాధనోత్సవం జరగటం విశేషం. కులాలకు అతీతుడైన ఆ మహనీయుని మార్గంలో పయనిస్తూ సమరసతాయుక్త సామాజిక భారతాన్ని నిర్మిద్దాం.

– సాకి, కరీంనగర్‌ । 9949394688

ఆ వ్యాఖ్యలు ముమ్మాటికీ తప్పే!

కశ్మీర్‌ వేర్పాటు వాదుల తీవ్రవాద చర్యలను సమర్థిస్తూ, భారత సైన్యంపై విషం కక్కుతూ ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌ చేసిన వ్యాఖ్యలు 14 సంవత్సరాల క్రిందటివి. 2010 అక్టోబర్‌ 21న దేశ రాజధాని నగరం ఢిల్లీలో 'ఆజాది ఓన్లీ ద వే' అనే అంశంపై కశ్మీరీ వేర్పాటు వాదులు ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కశ్మీర్‌ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్‌ షేక్‌ షౌకత్‌ హుస్సేన్‌, రచయిత్రి అరుంధతీ రాయ్‌ భారత సైన్యానికీ, భారత ప్రభుత్వానికీ వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు క్షమించరానివి. ఈ వ్యాఖ్యలు రాజ్యాంగం ఇచ్చిన వాక్‌ స్వాతంత్య్ర పరిధిని అతిక్రమించాయనే చెప్పాలి. దేశభద్రతపై ఆ వ్యాఖ్యలు చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని, సామాజిక కార్యకర్త సుశీల్‌ పండిట్‌ ఫిర్యాదు మేరకు 'ఉపా' కింద 2010 అక్టోబర్‌ 28న ఢిల్లీ పోలీసులు కేసు రిజిస్టర్‌ చేశారు. లౌకిక వాద ముసుగు వేసుకున్న కాంగ్రెస్‌ తదితర పార్టీల నాయకులు కశ్మీర్‌ వేర్పాటువాదుల వాదనలకు వ్యతిరేకంగా విచారణ చేస్తే... ముస్లిం ఓటు బ్యాంకు ఎక్కడ దెబ్బ తింటుందో అనే భీతితో ఆ కేసును తొక్కి పట్టారు.

వాస్తవంగా దేశ భద్రతతో ముడిపడిన ఈ విషయంలో కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో నడిచే కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించి ఉండాలి. 14 ఏళ్లు ఆ కేసుపై విచారణ జరగకుండా తాత్సారం చేయడం దేశాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశ భద్రత విషయంలో కఠిన వైఖరి అవలంబించే మోదీ ప్రభుత్వం పది సంవత్సరాలు ఈ కేసును విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడానికి కారణాలనూ దేశ ప్రజలకు వివరించవలసిన బాధ్యత మూడోసారి అధికారాన్ని చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వ పెద్దలదే! అనూహ్యంగా ఢిల్లీ లెఫ్టినెంట్‌ గవర్నర్‌ వినయ్‌ కుమార్‌ సక్సేనా ఈ కేసు ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వడం దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. దేశానికి వ్యతిరేకంగా, దేశ భద్రతకు సవాల్‌గా మారిన తీవ్రవాదులకు అనుకూలంగా గళం విప్పిన వాళ్ళ పని పట్టడానికి మూడోసారి అధికారంలో కూర్చున్న మోదీ ప్రభుత్వం చురుకుగా పని చేస్తుందని ముందస్తు సమాచారం ఇవ్వడంలో భాగంగానే ఈ 'ఉపా' కేసును తెరపైకి తెచ్చేలా కేంద్రం చేసిందా అనే అనుమానం దేశ ప్రజలకు



కలగక మానదు.

'ఆజాదీ ఓన్లీ ద వే' కాన్ఫరెన్స్‌లో అరుంధతీ రాయ్‌ మాట్లాడిన మాటలను, ఆమె ఉద్దేశాలను ఈ దేశ ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ఎవరిది? కశ్మీర్‌ స్వతంత్ర దేశమనీ, దాన్ని భారత ప్రభుత్వం దౌర్జన్యంగా ఆక్రమించిందనీ, కశ్మీర్‌ ప్రజలు స్వతంత్రంగా బతికే హక్కు ఉందనీ, ఈ హక్కు కోసం భారత సైన్యంతో పోరాడే కశ్మీరు వేర్పాటు వాదులు తన సోదరులనీ, ఈ పోరాటంలో భారత సైన్యానికి ఎదురొడ్డి నిలవడం సమర్థనీయమనీ ఆమె చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలకు తెలియనీయకుండా కనుమరుగు చేసింది ఎవరు?

స్వాతంత్య్రానంతరం 562 సంస్థానాలు భారతదేశంలో విలీనమైనట్లే జమ్మూ–కశ్మీర్‌ సంస్థానం రాజు 'రాజా హరి సింగ్‌' భారత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని, జమ్మూ–కశ్మీర్‌ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారు. నిజానికి పాకిస్తానే 1948లో కశ్మీర్‌లో మూడో వంతును ఆక్రమించింది. దాన్ని 'పాక్‌ ఆక్రమిత కశ్మీర్‌' అని పిలుస్తున్నారు. అప్పటి నుంచి కశ్మీర్‌లో పాక్‌ వెన్నుదన్నుతో తీవ్రవాదులు చేసిన మారణహోమం అంతా ఇంతా కాదు.

ఈ దేశంలో ఉంటూ, ఈ దేశం గాలి పీల్చుతూ, ఈ దేశం తిండి తింటూ, ఈ దేశం ముక్కలు కావాలని ఎవరు కోరినా క్షమించరాని నేరమే అవుతుంది.

– ఉల్లి బాలరంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

నమ్మకం వమ్ముకాదు!

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్‌

– ఇది భగవద్గీతలోని 9 వ అధ్యాయంలో ఉన్న 22వ శ్లోకం. దీని అర్థం: ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో అట్టివారి యోగక్షేమములను నేను వహించుచున్నాను (పుట – 683 – గీతా మకరందం). ఇవి శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు చెప్పిన మాటలు. మనం మహాభారతం చదివితే శ్రీకృష్ణుడు ఎల్లవేళలా పాండవులను కనిపెట్టి ఉండి, ఎన్నో కష్టాల నుండి వారిని కాపాడి గట్టెక్కించిన సంగతి తెలిసి వస్తుంది. మహాభారతాన్ని కొంతసేపు ప్రక్కన పెడదాం.

జ్యోతిర్మయం

మొన్న మొన్న జీవించిన శ్రీ రామకృష్ణ పరమహంస తనను నమ్ముకొన్న, తననే ధ్యానించిన శిష్యులను ఎలా సంరక్షించాడో కళ్లారా చూసి, స్వయంగా అనుభవించిన వారు చెప్పిన, గ్రంథస్థం చేసిన విషయాలను పరికిద్దాం.

రామకృష్ణ పరమహంస ధర్మపత్ని శారదా దేవి చెప్పిన మాటలివి– 'వారంతా (శ్రీరామకృష్ణుల యువ శిష్యులు) బారానగర మఠంలో ఎంత కఠోరమైన జీవితాన్ని గడిపారో కదా! నిరంజన్‌ తదితరులు పస్తులుండేవారు. వాళ్ళు తమకున్న సమయాన్ని పూర్తిగా జపధ్యానాలలో గడిపేవారు. ఒకరోజు వారంతా తమలో తాము ఇలా తీర్మానించుకున్నారు. 'శ్రీరామకృష్ణుల పేరిట మనమంతా సర్వసంగ పరిత్యాగం చేశాం. కేవలం ఆయన మీదే ఆధారపడ్డాం. కనుక, ఆయన మనకు ఈనాడు అన్నం పెడతాడో లేదో చూద్దాం. మన అవసరాల గురించి ఇతరులెవరికీ ఏమీ చెప్ప వద్దు. భిక్ష కోసం బయటకు వెళ్ళవద్దు.' ఇలా నిశ్చయించుకొని ధ్యానంలో కూర్చొన్నారు. రాత్రి బాగా పొద్దు పోయింది. ఇంతలో ఎవరో గది తలుపు తట్టడం వినబడింది. తలుపు తెరచి చూస్తే అద్భుతం! గంగానది సమీపంలోని లాలా బాబు కృష్ణ మందిరం నుంచి వచ్చిన ఒక వ్యక్తి చేతుల్లో రుచికరమైన పదార్థాలతో కనిపించాడు. ఆ శిష్యుల ఆనందానికి అవధుల్లేవు. శ్రీరామకృష్ణులు వారిని సదా కనిపెట్టి సంరక్షిస్తున్నాడన్న నమ్మకం వారిలో మరింత బలపడింది. (పుట 666 – శ్రీరామకృష్ణ లీలామృతం).'మీ యోగ క్షేమాలను నేను చూసుకొంటాను' అని శ్రీకృష్ణుడు చెప్పినా శ్రీరామకృష్ణులు చెప్పినా అది కచ్చితంగా అలా జరిగి తీరుతుంది.

సందేహించాల్సిన పనేలేదు!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ; ఆషాఢ మాసం ; **తిథి:** శు.చవితి ఉ.6.36 వరకు, తదుపరి పంచమి; **నక్షత్రం:** మఖ ఉ.9.55 వరకు, తదుపరి పుబ్బ; **వర్జ్యం:** సా.6.43 నుండి 8.28 వరకు ; **దుర్ముహూర్తం:** ఉ.11.38 నుండి 12.30 వరకు; **అమృత ఘడియలు:** ఉ.7.12 నుండి 8.56 వరకు, తిరిగి తె.5.15 నుండి 7.01 వరకు (తెల్లవారితే గురువారం); **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు ; **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం:** 5.35 ; **సూర్యాస్తమయం:** 6.35

క్లుప్తంగా...

శేషాచలంలో అరుదైన శ్రీలంక కప్ప



తిరుపతి మంగళం: శ్రీలంక భూభాగంలో కనిపించే అరుదైన జాతికి చెందిన శ్రీలంకన్ స్యూడో ఫిలేటస్ రిజియస్‌గా పిలిచే శ్రీలంక గోధుమరంగు చెవి పొనకప్ప తూర్పు కనుమల్లో అంతర్భాగమైన శేషాచలం అడవుల్లో కనిపించింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు, ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి పరిశోధకులు మంగళవారం వెల్లడించారు. జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ధ్రితిబెనర్జీ మాట్లాడుతూ శ్రీలంక ద్వీపంలో నీటి ఆధారిత ప్రాంతాల్లో కనిపించే ఈకప్ప శేషాచలం అడవుల్లోని తలకోన జలపాతం ప్రాంతంలో కనిపించిందని చెప్పారు. న్యూజిలాండ్ దేశం నుంచి ప్రచురితమయ్యే అంతర్జాతీయ పత్రిక జూటాక్స్‌లో పరిశోధన వ్యాసం ప్రచురితమైందని తెలిపారు. ఒకప్పుడు భారతదేశం, శ్రీలంక భూభాగాలు కలిసే ఉండేవన్న నిజాన్ని ఈ పరిశోధన నిరూపిస్తోందని పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో శ్రీశైలం పీఠాధిపతి



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): శ్రీశైలం పీఠాధిపతి జగద్గురు డాక్టర్ చిన్న సిద్దరామ పండితారాధ్య శివచార్య మహా స్వామీజీ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను మంగళవారం దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన స్వామీజీకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. స్వామీజీకి ఆలయ ఈవో కేఎస్ రామారావు అమ్మవారి ప్రసాదాలను అందజేయగా, స్వామీజీ ఆలయ సిబ్బందికి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి స్వామీజీకి ఈవో వివరించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఆనంద నిలయం మొదలుకుని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. ఆ సమయంలో మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ చేపట్టి, నైవేద్యం నివేదించారు. అనంతరం సర్వదర్శనం ప్రారంభించారు. ఈ కారణంగా అష్టదళపాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈఓ వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

రూ.22 కోట్ల విలువైన పంచలోహ విగ్రహాలు స్వాధీనం



అన్నానగర్: విదేశాల్లో విక్రయించేందుకు కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.22 కోట్ల విలువైన ఆరు పంచలోహ విగ్రహాలను సోమవారం రాత్రి తమిళనాడులోని తంజావూరు సమీపంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విగ్రహాలు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. విగ్రహాల చోరీ నిరోధక విభాగం తిరుచ్చి స్పెషల్ స్క్వాడ్‌కు అందిన సమాచారం మేరకు తంజావూరు–తిరుచ్చి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. తంజావూరు సమీపంలోని పెరియార్ సమత్తుపురం బస్టాప్ వద్ద ఓ కారులో సోదాలు చేయగా, ఆరు బస్తాల్లో విగ్రహాలు కనిపించాయి. అందులో త్రిపురాంతకర్ (మూడు అడుగుల ఎత్తు), వీణాధార దక్షిణామూర్తి (రెండున్నర అడుగుల ఎత్తు), రిషబాదేవుడు (మూడు అడుగులు), రెండున్నర అడుగుల ఎత్తు కలిగిన మరో మూడు దేవతల విగ్రహాలు ఉన్నాయి. ఆ విగ్రహాలను సీజ్ చేసి, కారు డ్రైవర్ సేలం జిల్లాకు చెందిన రాజేష్ కన్నన్ (42), అతడి స్నేహితుడు మైలాడుతురై జిల్లాకు చెందిన లక్ష్మణన్ (64), సేలానికి చెందిన తిరుమురుగన్ (39)లను అరెస్టుచేశారు.

కమ్మపల్లిలో ఆగని టీడీపీ అరాచకం

టమాటా దిగుబడిని తరలించకుండా అడ్డుకున్న తమ్ముళ్లు

చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ దౌర్జన్యాలు

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై వివిధ రకాలుగా కొనసాగుతున్న వేధింపులు



కమ్మపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల పొలంలోనే మగ్గుతున్న టమాటా

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండలంలోని కమ్మపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నేతల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. పదిరోజుల నుంచి వైఎస్సార్‌సీపీ కుటుంబాలు గ్రామంలోంచి బయటకు వెళ్లకుండా, వెలుపల ఉన్నవారు గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. గ్రామంలో జరుగుతున్న ఆటవిక చర్యల గురించి సాక్షి వెలుగులోకి తీసుకొచ్చింది. అయినా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదు. నాలుగు రోజుల కిందట టీడీపీ నేతల దాడుల్లో తీవ్రంగా గాయపడినవారి పరిస్థితి ఎలా ఉందో కూడా తెలియని దుస్థితి నెలకొంది. రెండురోజుల కిందట పోలీసులు గ్రామంలోకి వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడినా.. టీడీపీ నేతల దౌర్జన్య కాండ కొనసాగుతూనే ఉంది. గ్రామంలో జరుగుతున్న దౌర్జన్యకాండ బయటకు పొక్కకుండా చూసేందుకు వారి ఫోన్లు కూడా లాగేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికీ గ్రామంలోకి పాల సరఫరా నిలిపివేశారు. వైఎస్సార్‌సీపీ వారి పశువులకు గ్రాసం కూడా వేయనీయడం లేదని తెలిసింది. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబాలకు చెందిన టమాటా దిగుబడులను మార్కెట్‌కు తరలించకుండా నిలిపేశారు. పొలాల్లో నాలుగు రోజులుగా నిల్వ ఉన్న టమాటా దిగుబడికి సంబంధించిన వీడియోలు బయటకు వచ్చాయి. గ్రామంలో సుమారు వెయ్యి బాక్సుల వరకు టమాటా నిల్వలు ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఒక బాక్సు విలువ రూ.500కు పైనే. ఒకటి రెండురోజుల్లో మార్కెట్‌కు తరలించకపోతే ఈ టమాటా దిగుబడి మొత్తం కుళ్లిపోయే ప్రమాదం ఉంది. టీడీపీ దౌర్జన్యకాండను జీర్ణించుకోలేని ఆ పార్టీ కార్యకర్త ఒకరు ఈ వీడియోలు, ఫొటోలను వైరల్ చేసినట్లు తెలిసింది. మీడియా, పత్రికల వారికి పంపినట్లు సమాచారం. గ్రామంలో జరుగుతున్న టీడీపీ నేతల దాష్టీకంపై మానవహక్కుల కమిషన్ స్పందించాలని మానవతావాదులు కోరుతున్నారు.

తీరిక లేదా అనితమ్మా!?

- మైనర్ బాలిక హత్య కేసుపై ప్రభుత్వం అలసత్వం
- సొంత జిల్లాలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించని హోంమంత్రి.. గ్రామస్తుల ఆగ్రహం

సాక్షి, అనకాపల్లి: సొంత జిల్లాలో బాలికను ఒక దుండగుడు పాశవికంగా కత్తితో పొడిచి చంపినా.. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు పట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రధానంగా బాలిక మృతదేహం ఆస్పత్రిలో ఉన్న సమయంలో పక్కనే జరిగిన ఒక సన్మాన కార్యక్రమానికి హాజరైన ఆమె బాలిక కుటుంబ సభ్యులను ఓదార్చే ప్రయత్నం చేయకపోవడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమవుతోంది. రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో ఈనెల 6వ తేదీ సాయంత్రం 9వ తరగతి చదువుతున్న బద్ది దర్శిని (14) అనే బాలికను బోడాబత్తుల సురేష్ కత్తితో దాడిచేసి దారుణంగా హత్యచేసిన విషయం తెలిసిందే. ఘటన జరిగి నాలుగు రోజులైనా ఇప్పటివరకు నిందితుడి ఆచూకీ లేదు. మైనర్ బాలిక హత్యకేసు విషయంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి ఎటువంటి భరోసా దక్కలేదు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో బాలిక హత్య కేసుపట్ల హోంమంత్రి కనీసం దృష్టిసారించకపోగా.. బాధిత కుటుంబానికి ధైర్యం కూడా చెప్పకపోవడంపట్ల గ్రామస్తులు దుమ్మెత్తిపోస్తున్నారు.

దొరకని నిందితుని ఆచూకీ..

ఘటన జరిగి నాలుగు రోజులైనా నిందితుడి ఆచూకీ దొరకలేదు. నిజానికి.. నిందితుడు సురేష్ ఒక నేరానికి సంబంధించి జైలుకెళ్లి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో అతడిపై పోలీసులు నిఘా పెట్టకపోవడం కూడా ఈ హత్యకు దారితీసిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బెయిల్ మీద వచ్చాక బస్సులో ఒకరోజు బాధితురాలి వెంటపడ్డాడని.. ఈ విషయం వెంటనే పోలీసుల దృష్టికి బాలిక తండ్రి వెంకటరమణ తీసుకువెళ్లినా పట్టించుకోలేదని చెబుతున్నారు. ఈ విషయమై మంత్రి అనితను మీడియా సమావేశంలో ఒక విలేకరి ప్రశ్నించగా.. అదే నిజమైతే సదరు పోలీసు అధికారిపై చర్యలు తీసుకుంటామని చెప్పి ఆ విషయాన్ని విస్మరించారని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఇదిలా ఉంటే.. నిందితుడు ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేలు నగదు బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించి అతని ఫొటోలు విడుదల చేశారు.

ఓర్వకల్లు విమానాశ్రయంపై 'ఉడాన్' కత్తి

- ఆగస్టు 15లోగా వయబిలిటీ గ్యాప్ ఫండ్ చెల్లించకపోతే విమానాలు రద్దు
- ఇప్పటికే బెంగళూరు సర్వీసులు నిలిపివేత
- రాష్ట్ర ప్రభుత్వం మేల్కొనకపోతే మొదటికే మోసం

కర్నూలు (సెంట్రల్): కర్నూలు జిల్లా ఓర్వకల్లులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయంపై ఉడాన్ కత్తి వేలాడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొనకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆగస్టు 15లోపు ఉడాన్ పథకాన్ని పునరుద్ధరించకపోతే విమానాల రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఏప్రిల్ 2 నుంచి బెంగళూరు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.



ఓర్వకల్లు విమానశ్రయం

కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

ఉడాన్ బకాయిల పెండింగ్ విషయమై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా రామ్మోహన్‌నాయుడు ఉండటంతో సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది.

బకాయిలే కారణం

ఉడాన్ పథకం కింద విమాన సర్వీసులలో 50 శాతం కంటే తక్కువ ఆక్యుపెన్సీ ఉంటే వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం, కేంద్ర ప్రభుత్వం 80 శాతం చెల్లించాల్సి ఉంది. ఉడాన్ కింద చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో హెచ్చరిక మాదిరిగా ఇండిగో సంస్థ బెంగళూరు వెళ్లే విమానాలను తిప్పడం మానేసినట్టు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటాను ఇప్పటికే చెల్లించింది. కేంద్రంవాటా పెండింగ్‌లో ఉంది. ఆగస్టు 15లోపు గ్యాప్ ఫండ్ చెల్లించకపోతే విశాఖపట్నం, చెన్నై విమానాలను కూడా రద్దు చేసే యోచనలో ఇండిగో ఉన్నట్టు తెలుస్తోంది.

వైఎస్ జగన్ ఎంపీగా పోటీ చేస్తారనేది అవాస్తవం

వైఎస్సార్‌సీపీ నేత సురేష్‌బాబు



కడప (కార్పొరేషన్): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప ఎంపీగా పోటీ చేస్తారనేది శుద్ధ అబద్ధమని పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు ఆక్షేపించారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియా వేదికగా టీడీపీ దుష్ప్రచారానికి పూనుకోవడం దారుణమన్నారు. ఈ ఊహాజనిత కథనం సృష్టికర్త టీడీపీ అని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ కడప ఎంపీగా పోటీ చేస్తారని, వైఎస్ అవినాశ్‌రెడ్డి పులివెందుల నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తారని సోషల్ మీడియాలో వాళ్లే పోస్ట్ చేయడం.. ఆపై ఆంధ్రజ్యోతిలో ఊహాగానాలు, కల్పితాలతో కథనం రాయించడం, దానిపై చంద్రబాబు శిష్యుడు తెలంగాణ సీఎం రేవంత్ స్పందించడం మ్యాచ్ ఫిక్సింగ్‌లో భాగమేనన్నారు. ప్రజలను గందరగోళపరిచేందుకే ఇలా చేస్తున్నారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్ కుటుంబంలో చిచ్చుపెట్టేలా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. 2011లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పామని, ఇప్పుడొచ్చి తెలంగాణ సీఎం రేవంత్ గల్లీ గల్లీ తిరుగుతాననడం హాస్యాస్పదమన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న టీడీపీ ప్రభుత్వం ట్రాక్టర్ ఇసుకకు రూ.1,700 వసూలు చేస్తోందన్నారు. ట్రాక్టర్ ఇసుకను కడప తెచ్చుకునేసరికి రూ.3,500 అవుతోందన్నారు.

బుడత మేధావికి అరుదైన గౌరవం!

గుడివాడ చిన్నారికి ఇండోస్పానిష్ ఇంటర్నేషనల్ అవార్డు



ప్రదీప్ నారాయణ్

తెనాలి: చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్ నారాయణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 'ఇండోస్పానిష్ ఇంటర్నేషనల్ అవార్డు–2024' లభించింది. రూరల్ మండలం గుడివాడ గ్రామానికి చెందిన చిన్నారి అసాధారణ జ్ఞాపక శక్తికి మరో అంతర్జాతీయ అవార్డు లభించింది. తాజాగా భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన బెంగళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ద్వారా అవార్డు అందుకున్నారు. విద్య, కళలు, సంస్కృతి, సాంఘిక సంక్షేమం వంటి వివిధ రంగాల్లోని భారతీయ పౌరుల అంకితభావం కృషికి గుర్తింపుగా ఈ గౌరవాన్ని ఏటా ప్రదానం చేస్తోంది. కాగా, బండికళ్ల ప్రదీప్ నారాయణ్ ఏడాది 11 నెలల వయసు నుంచి ప్రదర్శిస్తున్న జ్ఞాపకశక్తికి అనేక అవార్డులను దక్కించుకున్నాడు. జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయలు, మానవ శరీర భాగాలు, గృహోపకరణాలతో సహా మొత్తం 150 పేర్లను గుర్తిస్తున్నాడు. కేవలం 11 నిముషాల్లోనూ వాటి పేర్లను చెబుతున్నాడు. ఈ అసాధారణ సామర్థ్యంతో ప్రస్తుతం మూడేళ్ల వయసు కలిగిన ప్రదీప్ నారాయణ్ ఎనిమిది ప్రపంచ రికార్డులను, రవీంద్రరత్న పురస్కారంతో సహా మూడు జాతీయ రికార్డులను అందుకోవటం విశేషం. తల్లిదండ్రులు ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. పసివయసులో బిడ్డలోని జ్ఞాపకశక్తిని గుర్తించి, తగిన విధంగా నేర్పించినట్టు తండ్రి రాజేష్ వెల్లడించారు. చిన్నారి జ్ఞాపకశక్తికి అబ్బురపడిన స్థానిక సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాజమాన్యం ఆ బాలుడికి ప్రీ కేజీ సీటు ఇచ్చింది.

పిన్నెల్లికి ముగిసిన పోలీస్ కస్టడీ

నెల్లూరు(క్రైమ్): పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెండు రోజుల పోలీస్ కస్టడీ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. కారంపూడి సీఐ నారాయణస్వామి, టీడీపీ నేత నంబూరి శేషగిరిరావుపై దాడి కేసుల్లో గతనెల 27వ తేదీ నుంచి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న విషయం విదితమే. రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం సోమవారం నెల్లూరుకు చేరుకుంది. కేంద్ర కారాగారం మొదటి అంతస్తులోని పరిపాలన భవనంలో రామకృష్ణారెడ్డిని ఆయన న్యాయవాదుల సమక్షంలో సాయంత్రం వరకు వివిధ అంశాలపై విచారించారు. మంగళవారం కూడా డీఎస్పీ, సీఐ శోభన్‌బాబు నేతృత్వంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విచారణ సాగింది.

హోం మంత్రి అనుచరుల అరాచకం

- అన్నవరంలోని ఓ రెస్టారెంట్‌లో ఫర్నిచర్ ధ్వంసం, సిబ్బందిపై దాడి
- ఎమ్మెల్యే బాలకృష్ణకు నిర్వాహకుల ఫిర్యాదు
- నిందితులపై కేసు పెట్టాలని సీఎంవో నుంచి ఫోన్ చేయించిన వైనం
- అయితే అనుచరులపై కేసు లేకుండా మంత్రిస్థాయిలో పోలీసులపై ఒత్తిళ్లు
- తలలు పట్టుకుంటున్న పోలీసులు



రెస్టారెంట్ బయట సిబ్బందిపై దాడి చేస్తున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారిని ఆనుకుని కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో తెలుగు తమ్ముళ్ల విధ్వంసానికి పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రాంతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక రియల్టర్, ఇద్దరు హేచరీల నిర్వాహకులు కలిసి పొరుగున అన్నవరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒక రెస్టారెంట్‌కు ఇటీవల వచ్చారు. రెస్టారెంట్‌లో ఎటువంటి ఆర్డర్ ఇవ్వకుండా గంటల తరబడి కూర్చోవడంపై రెస్టారెంట్ నిర్వాహకులు ప్రశ్నించారు. కస్టమర్లు వస్తున్నారు, వ్యాపారం దెబ్బతింటున్నదని టేబుల్ ఖాళీ చేయాలని రెస్టారెంట్ సిబ్బంది వారికి సూచించడంతో ఒక్కసారిగా వారు రెచ్చిపోయారు. హోంమంత్రి తాలూకా తమనే రెస్టారెంట్ నుంచి వెళ్లిపోమంటావా, ఖాళీ చేయిస్తావా అంటూ రెస్టారెంట్‌లో నానా రాద్ధాంతం సృష్టించారు. నిర్వాహకులు సర్దిచెబుతున్నా లెక్క చేయకుండా రెస్టారెంట్ ఎలా నిర్వహిస్తావో చూస్తామంటూ బెదిరించి కుర్చీలు తన్నేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వారు అదే రోజు సాయంత్రం సుమారు 20 మంది అనుచరులతో గుంపుగా మరోసారి వచ్చి రెస్టారెంట్‌లో ఫుడ్ ఆర్డర్ ఇచ్చి నిర్వాహకులతో గొడవకు దిగారు. మంత్రి తాలూకా అంటూ బిల్లు ఇచ్చేది లేదని మీకు దిక్కున్న చోట చెప్పుకోమంటూ కుర్చీలు తన్నేసి నానా గొడవ సృష్టించి సిబ్బందిని బయటకు తీసుకొచ్చి చితకబాదారు. రెస్టారెంట్ నిర్వాహకులు కూడా తెలుగుదేశంపార్టీ సానుభూతిపరులే కావడంతో.. విషయాన్ని సిబ్బంది విదేశాల్లో ఉన్న హోటల్ నిర్వాహకునికి తెలియజేశారు. దీంతో ఆయన తన ఆత్మీయుడైన సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫోన్‌చేసి మంత్రి పేరు చెప్పి గలాటా సృష్టిస్తున్నారని వారిని కట్టడి చేసి కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారని తెలిసింది. రెస్టారెంట్‌లో కుర్చీలు గిరాటేసి దాడులకు పాల్పడ్డ గలాటా తాలూకా వీడియోలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. మంత్రి పేరు చెప్పి నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాలకృష్ణ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎంవో ద్వారా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఇంతలో గలాటా సృష్టించిన తెలుగు తమ్ముళ్లు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ వివాదంపై రెస్టారెంట్ నిర్వాహకులు అన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. విషయం తెలుసుకున్న తెలుగు తమ్ముళ్లు మంత్రి ద్వారా రాజీ కోసం ప్రయత్నిస్తూ కేసు లేకుండా పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇదే విషయమై అన్నవరం సబ్ ఇనస్పెక్టర్ కిశోర్‌బాబును సంప్రదించగా రెస్టారెంట్‌లో స్వల్ప వివాదం జరిగినట్టు స్థానికుల ద్వారా తెలిసిందన్నారు. అయితే గొడవ విషయంపై తమకు నిర్వాహకుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

డయేరియాతో ఇద్దరు మృతి

- చికిత్స పొందుతున్న మరో 14మంది
- తిరుపతి జిల్లాలోని పాస్ మనోవికాస కేంద్రంలో వెలుగు చూసిన వైనం



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న మానసిక వికలాంగులు

తిరుపతి తుడా: ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన ఇద్దరు మానసిక వికలాంగులు డయేరియాతో మృతి చెందగా.. మరో 15మంది తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం స్థానికంగా కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం, పద్మావతి పరం పంచాయతీలో మురళీకృష్ణ పాస్ మనోవికాస కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలో మొత్తం 72మంది మానసిక వికలాంగులు సంరక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి విరోచనాలు, వాంతులతో గణపతి (30) మృతి చెందాడు. ఇదే సమస్య మరికొందరిలో కనిపించడంతో వెంటనే అప్రమత్తమైన సంరక్షణకేంద్రం నిర్వాహకులు రుయా ఆస్పత్రికి తరలించారు. 15మందికి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరో మానసిక వికలాంగుడు శేషాచలం (16) మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. డయేరియా కారణంగానే ఇద్దరు మృతి చెందారని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి చికిత్స పొందుతున్న మానసిక వికలాంగులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని రుయా అధికారులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ వైద్యుల బృందం పాస్ మనోవికాస కేంద్రాన్ని తనిఖీ చేశారు.

అనపర్తిలో వంద పడకల ఆస్పత్రికి మళ్లీ శంకుస్థాపనా?

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: నియోజకవర్గ కేంద్రమైన అనపర్తిలోని సీహెచ్‌సీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు రూ.13 కోట్లతో అభివృద్ధి పనులను సైతం ప్రారంభించామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఇప్పుడు మళ్లీ అదే ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేస్తున్నామని ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేయడం హాస్యాస్పదమన్నారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అనపర్తి సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు అవసరమైన వైద్యులు, సిబ్బందిని కూడా నియమించామని చెప్పారు. ఒకవైపు వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభించిన వంద పడకల ఆస్పత్రి అదనపు భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నా... మరోవైపు మళ్లీ శంకుస్థాపన చేసి ఇదంతా తామే చేశామంటూ ఆ క్రెడిట్ తమ అకౌంట్లో వేసుకునేందుకు ఎన్డీఏ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.



అనపర్తి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రారంభించిన శిలాఫలకం (ఫైల్)

చెన్నై విమానాశ్రయంలో రూ.10 కోట్ల విలువైన కొకైన్ సీజ్

- దక్షిణాఫ్రికా మహిళ అరెస్ట్

అన్నానగర్: చెన్నై విమానాశ్రయంలో మంగళవారం రూ.10 కోట్ల విలువైన కిలో కొకైన్‌ను అధికారులు సీజ్ చేశారు. దీనికి సంబంధించి దక్షిణాఫ్రికాకు చెందిన ఓ మహిళా ప్రయాణికురాలిని అరెస్టు చేశారు. వివరాలు.. రహస్య సమాచారం మేరకు చెన్నై మీనంబాక్కం అన్నా అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర నార్కోటిక్స్ కంట్రోల్ డైరెక్టర్ అరవిందన్ నేతృత్వంలోని అధికారులు కస్టమ్స్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం నిఘా పెట్టారు. ఆ సమయంలో ఇథియోపియా రాజధాని అడిస్ అబాబా నుంచి ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం వచ్చింది. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన బ్రాడిలీన్ ఏప్రల్ (54) అనే మహిళా ప్రయాణికురాలు టూరిస్ట్ వీసాపై చెన్నైకి వచ్చింది. అనుమానంతో మహిళను అధికారులు తనిఖీ చేశారు. ఆమె బ్యాగులో అత్యంత శక్తివంతమైన కిలో కొకైన్ ఉన్నట్లు తేలింది. దాని విలువ రూ.10 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి..

- అరెస్టు నుంచి రక్షణ కల్పించండి
- హైకోర్టులో జోగి రమేష్, తలశిల రఘురాం, దేవినేని అవినాష్ పిటిషన్
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021లో జరిగిన దాడి ఘటనపై నమోదైన కేసులో నిందితులుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు దేవినేని అవినాష్, తలశిల రఘురాం ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా అవినాష్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఈ అభ్యర్థనతో అనుబంధ పిటిషన్ దాఖలు చేశామన్నారు. దీనిపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి వెనుక పిటిషనర్ ఉన్నారనేందుకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆయన ప్రోద్బలానికి సంబంధించిన ఆధారాలు కూడా లేవని వివరించారు. ఫిర్యాదుదారుకు సాధారణ గాయాలే అయ్యాయని, వైద్య నివేదిక సైతం ఇదే చెబుతోందన్నారు. ఘటన జరిగిన రెండేళ్ల తర్వాత ఇప్పుడు హై ప్రొఫైల్ కేసు అంటూ పోలీసులు హడావుడి చేస్తున్నారని తెలిపారు. ఇతర నిందితులకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులిచ్చిన పోలీసులు, పిటిషనర్‌కు మాత్రం ఇవ్వలేదన్నారు. ఆయనను అరెస్టుచేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు ఇలా చేశారని తెలిపారు. పోలీసుల తరఫున వాదనల నిమిత్తం విచారణ బుధవారానికి వాయిదా పడింది. అలాగే, తలశిల రఘురాం వ్యాజ్యంపై కూడా విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఆయన తరఫు న్యాయవాది యర్రంరెడ్డి నాగిరెడ్డి స్పందిస్తూ.. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై అనుబంధ పిటిషన్ వేశామన్నారు.

జోగి రమేష్‌కూ రక్షణ కల్పించాలి

మరోవైపు.. చంద్రబాబు ఇంటి వద్ద గతంలో జరిగిన గొడవకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో తనకూ ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈయన తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, పోలీసులు పూర్తి వివరాలు సమర్పించేందుకు అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అరెస్టు ప్రమాదం ఉంది కాబట్టే ఈ అభ్యర్థన చేస్తున్నామన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఇలా అరెస్టు నుంచి రక్షణ కోరుతూ ఎవరైనా పిటిషన్లు దాఖలు చేస్తే వాటిని వ్యతిరేకించలేదన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి మధ్యంతర ఉత్తర్వులను వ్యతిరేకించారు. ఇదే కేసుకు సంబంధించి మిగిలిన నిందితులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ బుధవారానికి వాయిదా పడిందని, ఈ వ్యాజ్యాన్ని కూడా వాటితో జతచేయాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ విచారణను వాయిదా వేశారు.

ప్రత్యేక హోదా సాధనకు అఖిలపక్షం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్



కాకినాడ సిటీ: రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా అప్పులు తప్పని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాజమహేంద్రవరంలో బీజేపీ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పడాన్ని రామకృష్ణ ఎద్దేవా చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయిన తర్వాత ఏర్పడ్డ డబుల్ ఇంజన్ సర్కార్ అప్పుడు కూడా ఏమీ చేయలేకపోయిందని, ఇప్పుడు మళ్లీ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలకడం, రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. బీహార్ ప్రభుత్వం మాదిరి, ఏపీ ప్రభుత్వం కూడా హోదాపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు.

“

ఉక్రెయిన్ సమగ్రతను గౌరవించాలి

భారత్ మా వ్యూహాత్మక భాగస్వామి. ఇరు దేశాల మధ్య బంధాన్ని నిరంతరం సమగ్రమైన చర్చలతో ముందుకు తీసుకెళ్తున్నాం. అయితే రష్యాతో భారత్ మైత్రి కొనసాగింపుపై మా ఆందోళనలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ఉక్రెయిన్ వివాదం విషయంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి తీర్మానం చేయాలంటూ రష్యాతో చర్చలు జరిపే ప్రతి దేశాన్ని కోరతాం. ఇప్పుడు భారత్‌కు కూడా ఇదే విజ్ఞప్తి చేస్తున్నాం.

- అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్

నేరస్తునితో ఆలింగనమా?

సోమవారం ఉక్రెయిన్‌పై రష్యా దారుణ క్షిపణి దాడుల్లో ముగ్గురు చిన్నారులుసహా 37 మంది ప్రాణాలు కోల్పోయారు. 13 మంది పిల్లలు సహా 170 మంది గాయపడ్డారు. చిన్నారుల ఆసుపత్రిపైనా రష్యా కనికరంచూపలేదు. ఎంతోమంది శిథిలాల కింద సమాధి అయ్యారు. ఈరోజే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి చెందిన నాయకుడు.. ప్రపంచంలోనే అత్యంత కిరాతక నేరస్థుడిని ఆలింగనం చేసుకున్నారు. ఇది తీవ్ర నిరాశ కలిగించింది. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి ఎదురుదెబ్బ.

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

రక్షణ విడిభాగాల తయారీకి...

భారత్‌లో కొత్తగా ప్లాంట్

2030కల్లా 100 బిలియన్ డాలర్లకు వాణిజ్యం

దిగుమతులకు సొంత కరెన్సీల్లోనే చెల్లింపులు

మాస్కో: రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ఆయుధాలు, రక్షణ ఉత్పత్తుల విడిభాగాలు ఆలస్యంగా సరఫరా అవుతుండటంతో ప్రత్యామ్నాయంగా భారత్‌లోనే విడిభాగాల తయారీ కర్మాగారాలను నెలకొల్పాలని భారత్, రష్యా నిర్ణయించాయి. దీంతో విడిభాగాల కొరతతో సతమతమవుతున్న భారత త్రివిధ దళాలకు పెద్ద ఊరట లభించనుంది. జాయింట్ వెంచర్ ద్వారా సంయుక్తంగా తయారీకి, అదనపు ఉత్పత్తులను ఉమ్మడి అంగీకారంతో ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు భారత్, రష్యా సూచనప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్పేర్ పార్ట్‌లు, కాంపోనెంట్లు, మెయింటెనెన్స్‌కు సంబంధించిన ఇతర పరికరాలను ఇకపై ఇక్కడే తయారుచేయనున్నారు. ‘‘ భారత ఆత్మనిర్భరతకు బాటలు పరుస్తూనే సంయుక్తంగా పరిశోధన, అభివృద్ధి, సంయుక్తంగా రక్షణ సాంకేతికత, వ్యవస్థల ఉత్పత్తిని ఈ ఉమ్మడి సాకారం చేయనుంది’ అని ఇరుదేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.

తొమ్మిది అవగాహన ఒప్పందాలు

భారత్–రష్యా మధ్య వాణిజ్యాన్ని 2030కల్లా 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరుదేశాలు కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. దిగుమతులకు సొంత కరెన్సీల్లోనే చెల్లింపులు చేసుకోవాలంటూ ఈ సందర్భంగా కీలక నిర్ణయం కూడా తీసుకోవడం విశేషం. దీంతోపాటు మొత్తం తొమ్మిది అవగాహన ఒప్పందాలు కుదిరాయి.



మాస్కో శివార్లలోని పుతిన్ అధికార నివాస ప్రాంగణంలో ఇరువురు నేతల చర్చలు

బాంబులు, తూటాల నడుమ...

శాంతి చర్చలు సాగవు

పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ • ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు

మాస్కో: బాంబులు, తుపాకులు, తూటాల వర్షం నడుమ శాంతి చర్చలు ఎప్పటికీ ఫలప్రదం కాబోవని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం ఎప్పటికైనా చర్చలతోనే లభిస్తుంది తప్ప యుద్ధ క్షేత్రంలో కాదని కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పిల్లల ఆస్పత్రిపై జరిగిన క్షిపణి దాడిపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. రెండు రోజుల రష్యా పర్యటనలో భాగంగా మంగళవారం ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో క్రెమ్లిన్ భవనంలో మోదీ 22వ ఇండో–రష్యా శిఖరాగ్ర చర్చలు జరిపారు. ముక్కుపచ్చలారని అమాయక చిన్నారులు దాడిలో పదుల సంఖ్యలో బలైన వైనం హృదయాలను తీవ్రంగా కలచివేస్తోందంటూ ఆవేదన వెలిబుచ్చారు. చర్చల వివరాలను మీడియాతో పంచుకుంటూ విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా ఈ మేరకు వెల్లడించారు. పుతిన్, మోదీ గాఢాలింగనంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన నేపథ్యంలో ప్రధాని తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సోమవారం పుతిన్‌తో వ్యక్తిగత సంభాషణ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై లోతుగా చర్చించినట్టు మోదీ వెల్లడించారు. ‘‘సమస్యకు చర్చల ద్వారానే ముగింపు పలకాలన్నదే భారత వైఖరి. ఈ విషయాన్ని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేయదలచా. అందుకు అన్నివిధాలా సాయపడేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధమే. నేను చెప్పిన అన్ని విషయాలనూ పుతిన్ ఓపిగ్గా విన్నారు. ఉక్రెయిన్ సమస్యపై అభిప్రాయాలను పంచుకున్నారు. యుద్ధానికి తెర దించేందుకు ఆసక్తికరమైన మార్గాలు చర్చ సందర్భంగా తెరపైకొచ్చాయి’’ అని ప్రధాని వివరించారు. భారత్‌ను పట్టి పీడిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని కూడా ప్రస్తావించారు. ఉక్రెయిన్ సంక్షోభ నివారణకు మోదీ చేస్తున్న ప్రయత్నాలకు పుతిన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపినట్టు టాస్ వార్తా సంస్థ పేర్కొంది. అన్ని అంశాలపైనా మోదీ, తాను మనసు విప్పి మాట్లాడుకున్నట్టు పుతిన్ వెల్లడించారు. అనంతరం ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ నేతలిద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మాస్కో సిటీ హాల్‌పై, కశ్మీర్‌లో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదుల ప్రాణాంతక దాడిని తీవ్రంగా నిరసించారు. ఉగ్రవాదంపై పోరులో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఇవి గుర్తు చేశాయన్నారు. ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి మోదీ చేసిన శాంతి ప్రతిపాదనలతో నాటో కూటమి ఏకీభవించకపోవచ్చని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అన్నారు.

ద్వైపాక్షిక బంధం మరింత సుదృఢం

కొన్నేళ్లుగా ప్రపంచాన్ని వేధిస్తున్న ఆహార, ఇంధన, ఎరువుల కొరత భారత్‌లో రైతులకు ఎదురవకుండా రష్యా అందిస్తున్న సహకారం అమూల్యమంటూ మోదీ కొనియాడారు. ‘‘పుతిన్‌తో చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయి. వర్తకం, వాణిజ్యం, భద్రత, వ్యవసాయం, టెక్నాలజీ వంటి పలు రంగాలపై లోతుగా చర్చించాం. పలు రంగాల్లో రష్యాతో బంధాన్ని మరింతగా విస్తరించడమే మా లక్ష్యం’’ అని స్పష్టం చేశారు. ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ వేదికలపై పలు అంశాల్లో భారత్, రష్యా సన్నిహితంగా కలిసి పని చేస్తున్నాయని పుతిన్ అన్నారు. ‘‘ఇరు దేశాలవీ దశాబ్దాలకు పైబడ్డ సుదృఢమైన బంధం. భారత్‌తో రష్యా వర్తకం గతేడాది ఏకంగా 66 శాతం పెరిగింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే మరో 20 శాతం పెరుగుదల నమోదైంది’’ అని అన్నారు. అక్టోబర్లో రష్యాలోని కజాన్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్రానికి మోదీని ఈ సందర్భంగా పుతిన్ ఆహ్వానించారు. అనంతరం మోదీ రష్యా పర్యటన ముగించుకుని ఆస్ట్రియా రాజధాని వియన్నా చేరుకున్నారు. భారత ప్రధాని ఆ దేశంలో పర్యటించనుండటం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

రష్యా సైన్యంలోని భారతీయులకు విముక్తి!

ఉక్రెయిన్ కదనరంగంలో రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులను స్వదేశానికి పంపేందుకు రష్యా అంగీకరించింది. పుతిన్ వద్ద ఈ అంశాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో పని చేస్తున్న భారతీయులను క్షేమంగా స్వదేశానికి పంపిస్తామని పుతిన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రష్యాలో ఉపాధి కల్పిస్తామంటూ కొందరు భారతీయ యువకులను ఏజెంట్లు రష్యాకు తీసుకెళ్లి అక్కడి సైన్యం సహాయకులుగా నియమించిన సంగతి తెలిసిందే.

మన అభివృద్ధి ప్రపంచాన్నే

ఆశ్చర్యపరుస్తోంది

- మూడో దఫాలో మూడురెట్లు వేగంతో పనిచేస్తా..
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరింపజేస్తా
- రష్యాలో ప్రవాస భారతీయులతో మోదీ

మాస్కో: భారత్ అద్భుత పురోగతి సాధిస్తోందని, దేశాభివృద్ధి చూసి ప్రపంచమే నివ్వెరపోతోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మాస్కో పర్యటనలో ఉన్న మోదీ మంగళవారం అక్కడి ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ‘మోదీ మోదీ’, ‘మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే’ నినాదాల నడుమ నరేంద్ర మోదీ మాట్లాడారు. ‘‘ 140 కోట్ల మంది భారతీయుల శక్తిసామర్థ్యాలను వినియోగించుకుంటూ భారత్ దీటుగా ఎదుగుతోంది. భారతీయులంతా వికసిత్ భారత్ కలను నిజంచేసుకునేందుకు కృతనిశ్చయంతో ముందుకుసాగుతున్నారు. 2014కు ముందు భారత్‌లో పరిస్థితి వేరేలా ఉండేది. కానీ ఇప్పుడు భారత్ పూర్తి ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. ఆత్మవిశ్వాసమే భారత్‌కున్న అతిపెద్ద మూలధనం. మీలాంటి ప్రజల ఆశీస్సులు ఉంటే పెద్ద ఆశయాలను సైతం దేశం సాధించగలదు. అనుకున్న లక్ష్యాలను భారత్ చేరుకోవడం మీరందరూ చూస్తున్నారు. రాబోయే రోజుల్లో భారత్ తన నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ నూతన అధ్యాయనాన్ని లిఖించబోతోంది. సవాళ్లకే సవాల్ విసిరే గుణం నా డీఎన్ఏలోనే ఉంది. సరిగ్గా నెలరోజుల క్రితం మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టా. మూడో దఫాలో మూడు రెట్లు వేగంతో పనిచేస్తా. భారత ఆకాంక్షలను నెరవేరుస్తా. భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరింపజేయాలనేదే మా ప్రభుత్వ సంకల్పం. పేదల కోసం మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తాం. మూడు కోట్ల మంది పేద మహిళలు లక్షాధికారులను చేస్తాం. గత పదేళ్లలో భారత్‌లో కనిపించిన అభివృద్ధి ఒక ట్రైలర్ మాత్రమే. వచ్చే పదేళ్లలో అంతకుమించిన అభివృద్ధిని మీరు చూడబోతున్నారు’’ అని మోదీ అన్నారు.

సర్వకాల సర్వావస్థలయందు స్నేహితుడే

రష్యాతో భారత బంధాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ‘రష్యా అనే పేరు వినబడగానే ప్రతి భారతీయుని మదిలో మెదిలే ఒకే ఒక్క వాక్యం.. సర్వకాల సర్వావస్థలయందు తోడుగా నిలిచే స్నేహితుడు. నమ్మకమైన నేస్తం’ అని మోదీ కొనియాడారు. ‘అన్ని కాలాల్లోనూ రష్యాతో భారత స్నేహం కొనసాగుతుంది. రష్యాలో గడ్డకట్టే చలిలో ఉష్ణోగ్రత సున్నా డిగ్రీ సెల్సియస్‌కు పడిపోతుందేమోగానీ ఇండియా–రష్యా స్నేహబంధం ఎల్లప్పుడూ ‘ప్లస్’లోనే నులివెచ్చగా ఉంటుంది అని మోదీ అన్నారు.

రష్యాలో మరో రెండు కాన్సులేట్లు

రష్యాతో పర్యాటకం, వాణిజ్యం, విద్యా రంగాల్లో బంధం బలోపేతానికి భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రష్యాలో కొత్తగా రెండు నగరాల్లో భారత కాన్సులేట్లను ఏర్పాటు చేయబోతోంది. ప్రధాని మోదీ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. కజన్, యెకటేరిన్‌బర్గ్ నగరాల్లో వీటిని నెలకొల్పుతారు. ప్రస్తుతం సెయింట్‌పీటర్స్‌బర్గ్, వ్లాడివోస్టోక్ నగరాల్లో మాత్రమే భారత కాన్సులేట్లు పనిచేస్తున్నాయి.

మోదీకి అత్యున్నత పౌర పురస్కారం

ఇరుదేశాల ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి కృషిచేస్తున్నందుకు సూచికగా ప్రధాని మోదీని పుతిన్ ‘ ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్’ పురస్కారంతో సత్కరించారు. రష్యా అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నేతగా మోదీ రికార్డ్ సృష్టించారు. ఈ పురస్కారాన్ని భారతీయులకు అంకితం చేస్తున్నానని పురస్కారం స్వీకరించిన సందర్భంగా మోదీ ‘ఎక్స్’లో పోస్ట్‌చేశారు. రష్యాలో తొలి క్రైస్తవ మత బోధకుడైన సెయింట్ ఆండ్రూ పేరిట 1698 సంవత్సరంలో రష్యా చక్రవర్తి పీటర్ కృషితో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయడం ప్రారంభించారు.



కార్యక్రమంలో మోదీ ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న ప్రవాస భారతీయులు

భూగోళం లాంటి మరో గ్రహం!

మాంట్రియల్: సువిశాల విశ్వంలో జీవుల నివాసయోగ్యమైన గ్రహం ఇప్పటి దాకా మనకు తెలిసి భూమి ఒక్కటే. ఇతర గ్రహాలపై జీవం ఉందా? లేదా? అనేది గుర్తించడానికి దశబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. మానవ నివాసానికి ఆస్కారం ఉన్న మరో గ్రహం కోసం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. నిజంగా ఇలాంటి గ్రహం ఒకటి దొరికితే అది మానవాళికి ఒక వరం అనే చెప్పాలి. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్ సైంటిస్టులు ఈ దిశగా కొంత పురోగతి సాధించారు. భూగోళం లాంటి మరో గ్రహం ఉన్నట్లు గుర్తించారు. జేమ్స్ వెబ్ స్పేస్‌తో పాటు స్పిట్జర్, హబుల్ అంతరిక్ష టెలిస్కోప్‌లు సేకరించిన సమాచారాన్ని, చిత్రాలను క్రోడీకరించి ఈ సూపర్ ఎర్త్‌పై వాతావరణాన్ని అంచనా వేశారు. భూమికి 48 కాంతి సంవత్సరాల దూరంలో రాళ్లు, నీటితో నిండి ఉన్న ఈ గ్రహాన్ని ఎల్‌హెచ్‌ఎస్ 1140బిగా పిలుస్తున్నారు. దీనిపై నీరు చాలావరకు ద్రవ రూపంలోనే ఉందని, భూమిపై మాదిరిగానే అక్కడ నైట్రోజన్ వాయువుతో కూడిన వాతావరణం ఉందని పరిశోధకులు చార్లెస్ కాడియక్స్ తెలిపారు. భూమి కంటే పెద్దదైన ఇది ఎరుపు రంగు మరుగుజ్జు నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తోందని వెల్లడించారు.

పూరీ రథయాత్రలో మరో అపశ్రుతి

భువనేశ్వర్: ఒడిశాలో పూరీలోని జగన్నాథుని రథయాత్రలో మంగళవారం మరో అపశ్రుతి చోటుచేసుకుంది. బలభద్రుని భారీ దారు విగ్రహం గుండీచా మందిరంలోకి తీసుకువెళ్లే క్రమంలో రథంపై నుంచి పడిపోయింది. ఘటనలో 9 మంది సేవకులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఐదుగురిని ఆస్పత్రిలో చేర్చారు. ఘటన తర్వాత జగన్నాథ, సుభద్ర విగ్రహాలను మందిరంలోకి చేర్చినట్లు అధికారులు చెప్పారు. 15వ తేదీన మూడు దేవతా మూర్తుల విగ్రహాలు జగన్నాథుని ఆలయానికి తిరుగు పయనమవుతాయి.

రాయ్‌బరేలీలో రాహుల్ పర్యటన

వీర జవాను కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ ఎంపీ

రాయ్‌బరేలీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం సొంత నియోజకవర్గం యూపీలోని రాయ్‌బరేలీలో పర్యటించారు. మరణానంతరం కీర్తి చక్ర పురస్కారం పొందిన కెప్టెన్ అన్షుమన్ సింగ్ కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం ఢిల్లీ నుంచి లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ అక్కడికి 80 కిలోమీటర్ల దూరంలోని రాయ్‌బరేలీలోకి రోడ్డు మార్గంలో ప్రయాణం చేశారు. స్థానిక అతిథిగృహంలో రాహుల్ గాంధీ కెప్టెన్ అన్షుమన్ సింగ్ తల్లి మంజు సింగ్, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంజు సింగ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ..తమ కుటుంబానికి సాధ్యమైనంత మేర సాయం అందేలా చూస్తామని రాహుల్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం రాహుల్ కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్థానిక నేతలతో ముచ్చటించారు. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్‌ను సందర్శించారు. రాహుల్ మీడియాతో మాట్లాడుతూ..ఆర్మీని రెండు వర్గాలుగా విడగొట్టే అగ్నివీర్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని కోరారు.



రాయ్‌బరేలీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారితో ముచ్చటిస్తున్న రాహుల్ గాంధీ

జనాభా నియంత్రణకు జాతీయ విధానం: ఆరెస్సెస్

కొన్ని ప్రాంతాల్లో ముస్లింల సంఖ్య పెరిగిపోతోందని ఆందోళన

న్యూఢిల్లీ: దేశంలో కొన్ని ప్రాంతాల్లో ముస్లింల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక ‘ఆర్గనైజర్’ ఆందోళన వ్యక్తం చేసింది. ‘‘ఫలితంగా అక్కడ జనాభా అసమతుల్యత ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని నివారించడానికి సమగ్ర జాతీయ జనాభా నియంత్రణ విధానం తేవాలి’’ అని తాజా సంచిక సంపాదకీయంలో సూచించింది. జనాభా విషయంలో ప్రాంతాల మధ్య కూడా అసమతుల్యత కనిపిస్తోందని, దేశంలో కొన్ని రాష్ట్రాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోతోందని ఆర్గనైజర్ పేర్కొంది. జనాభా పెరుగుదల నియంత్రణలో పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన పనితీరును ప్రదర్శిస్తున్నాయని ప్రశంసించింది. అయితే, జనాభా తగ్గిపోతుండడం వల్ల పార్లమెంట్‌లో తమ రాష్ట్రాల నుంచి కొన్ని సీట్లు కూడా తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నాయని వెల్లడించింది. ఇతర దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో అక్రమ వలసల కారణంగా జనాభా అసహజ రీతిలో పెరుగుతోందని వివరించింది. దేశవ్యాప్తంగా చూస్తే జనాభా పెరుగుదల స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ కొన్ని మతాలు, ప్రాంతాలకు సంబంధించి జనాభా పెరుగుదలలో స్పష్టమైన వ్యత్యాసాలు ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో ముస్లింల జనాభా పెరుగుతోందని స్పష్టం చేసింది.

ముస్లింలు పూజాసామగ్రి అమ్మకుండా నిలువరించాలి: వీహెచ్‌పీ

ఆలయాల సమీపంలో ముస్లింలు ప్రసాదాలు, ఆహార పదార్థాలు, పూజా సామగ్రి విక్రయించకుండా నిలువరించాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. ‘కేదర్‌నాథ్ వంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల వద్ద కొందరు ముస్లిం దుకాణాదారులు ప్రసాదాలు, పూజ సామగ్రిపై ఉమ్మేసి వాటిని విక్రయిస్తున్నారు’’ అని ఆరోపించింది.

కుట్రను కొట్టిపారేయలేం

హత్రాస్ తొక్కిసలాటపై ‘సిట్’ నివేదిక

లక్నో: 121 మందిని బలితీసుకున్న హత్రాస్ తొక్కిసలాట వెనుక పెద్ద కుట్రను కొట్టిపారేయలేమని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పేర్కొంది. ఈ మేరకు తన ప్రాథమిక దర్యాప్తు నివేదికను మంగళవారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. నివేదికపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. తొక్కిసలాటకు బాధ్యులుగా గుర్తిస్తూ స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీఎం), సర్కిల్ అధికారి, ఎస్‌హెచ్‌ఓ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, పోలీసు ఔట్‌పోస్టు ఇన్‌చార్జిని సస్పెండ్ చేసింది. ఈ నెల 2న యూపీలోని హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించిన సంగతి తెలసిందే. స్థానిక అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యం వల్ల తొక్కిసలాట జరిగినట్లు ‘సిట్’ తన నివేదికలో పేర్కొంది. ఈ ఘటనకు సత్సంగ్ నిర్వాహకులు కూడా బాధ్యత వహించాలని తేల్చిచెప్పింది.

ముంబై బీఎండబ్ల్యూ ప్రమాదం కేసు..

ప్రధాన నిందితుడు మిహిర్ షా అరెస్ట్

ముంబై: ముంబై బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసులో ప్రధాన నిందితుడు, శివసేన నేత కుమారుడు మిహిర్ షా (24)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో కారు నడుపుతూ బైక్‌ను ఢీకొట్టడంతో కావేరీ నఖ్వా అనే మహిళ చనిపోగా ఆమె భర్త గాయపడటం తెలిసిందే. మూడు రోజులుగా పరారీలో ఉన్న మిహిర్‌ను ముంబైలోని విరార్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని తల్లి, ఇద్దరు చెల్లెళ్లను మరో 10 మందితో కలిపి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిహిర్‌కు మద్యం సరఫరా చేసిన బార్ యజమానిని అరెస్ట్ చేయడంతో పాటు బార్‌ను మూసేశారు. మిహిర్ తండ్రిని, స్నేహితున్ని ఇప్పటికే అరెస్ట్ చేశారు.



నీ రాక కోసం...

అంతరిక్షంలో చిక్కుబడ్డ సునీత

నెలకు పైగా ఐఎస్ఎస్‌లోనే ఎదురుతెన్నులు	బోయింగ్ వ్యోమనౌకలో సమస్యలే కారణం
దానికి చేయాల్సిన రిపేర్లపై నాసా కసరత్తులు	ఐఎస్ఎస్‌లో పరిశోధనల్లో గడుపుతున్న సునీత
	తిరుగు ప్రయాణానికి మరింత సమయం!

సునీతా విలియమ్స్. పరిచయమే అవసరం లేని పేరు. భారత మూలాలున్న ఈ నాసా వ్యోమగామి మరో సహచరునితో కలిసి ఇటీవలే ముచ్చటగా మూడో అంతరిక్ష యాత్ర చేపట్టి మరోసారి వార్తల్లోకెక్కారు. తీరా అంతరిక్ష కేంద్రానికి చేరాక వ్యోమ నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అక్కడే చిక్కుబడిపోయి నెలకు పైగా రోజూ వార్తల్లోనే నిలుస్తూ వస్తున్నారు. వ్యోమ నౌకకు నాసా తల పెట్టిన మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయి, సునీత ఎప్పుడు సురక్షితంగా తిరిగొస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. దీనికి ఎప్పటికి తెర పడుతుందన్న దానిపై ప్రస్తుతానికైతే స్పష్టత లేదు...



ఐఎస్ఎస్‌లో సునీత, విల్మోర్

ప్రపంచంలో అతి పెద్ద ఏరో స్పేస్ కంపెనీల్లో ఒకటైన బోయింగ్ ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి మానవసహిత రోదసీ యాత్రలో సునీత భాగస్వామి అయ్యారు. సహచరుడు బారీ బుచ్ విల్మోర్‌తో కలిసి బోయింగ్ ‘స్టార్‌లైనర్’ వ్యోమ నౌకలో జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి పయనమయ్యారు. అయితే యాత్ర సజావుగా సాగలేదు. ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే క్రమంలో హీలియం లీకేజీ మొదలుకుని వ్యోమ నౌకలో పలు లోపాలు తలెత్తాయి. ఉత్కంఠ నడుమే ఎట్టకేలకు జూన్ 6న స్టార్‌లైనర్ సురక్షితంగా ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. నిజానికి ఇది మానవసహిత యాత్రల సన్నద్ధతను పరీక్షించేందుకు బోయింగ్ చేసిన క్రూ ఫ్లైట్ టెస్ట్ (సీఎఫ్‌టీ). షెడ్యూల్ ప్రకారం సునీత, విల్మోర్ వారం పాటు ఐఎస్ఎస్‌లో ఉండి జూన్ 13న బయల్దేరి 14న భూమికి చేరుకోవాలి. కానీ ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే క్రమంలో హీలియం లీకేజీ తదితరాలకు తోడు వ్యోమ నౌకలో మరిన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు గుర్తించారు. వీటన్నింటినీ సరిచేసే పనిలో నాసా ప్రస్తుతం తలమునకలుగా ఉంది. వ్యోమగాములను వెనక్కు తీసుకొచ్చే విషయంలో తమకు హడావుడేమీ లేదని నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ స్పష్టం చేశారు. వారి భద్రతకే తొలి ప్రాధాన్యమని వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సమస్యలు ఏమిటి?

- స్టార్‌లైనర్ వ్యోమ నౌకలో ఏకంగా ఐదు చోట్ల హీలియం లీకేజీలు చోటుచేసుకున్నాయి. ఇది పెను సమస్య. దీనివల్ల వ్యోమనౌక లోపలి భాగంలో అవసరమైన మేరకు ఒత్తిడిని మెయిన్‌టెయిన్ చేయడం కష్టమవుతుంది. నౌక పనితీరూ బాగా దెబ్బ తింటుంది.
- దీంతోపాటు వ్యోమ నౌకలో కీలకమైన 28 రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లలో ఏకంగా ఐదు విఫలమైనట్టు నాసా సైంటిస్టులు గుర్తించారు. అవి ఉన్నట్టుండి పని చేయడం మానేశాయి. సురక్షితంగా తిరిగి రావాలంటే కనీసం 14 థ్రస్టర్లు సజావుగా పని చేయాలి.
- ప్రొపెల్లెంట్ వాల్వ్ కూడా పాక్షికంగా ఫెయిలైంది.
- వీటిని పరిశీలిస్తున్న క్రమంలో మరిన్ని సాంకేతిక సమస్యలూ బయటపడ్డాయి. థ్రస్టర్లలో ప్రస్తుతానికి నాలుగింటిని రిపేర్ చేశారని, అవి సజావుగా పని చేస్తున్నాయని చెబుతున్నారు.
- ఈ సమస్యలను సరి చేసేందుకు బోయింగ్ బృందం నాసాతో కలిసి పని చేస్తోంది. నెవెడాలో అచ్చం ఐఎస్ఎస్ తరహా పరిస్థితులను సృష్టించి స్టార్‌లైనర్‌లో తలెత్తిన సమస్యలను ఎలా పరిష్కరించాలో పరీక్షిస్తున్నారు. ఇది తుది దశలో ఉన్నట్టు సమాచారం.

ప్రత్యామ్నాయాలూ ఉన్నాయి...

బోయింగ్ స్టార్‌లైనర్ గరిష్ఠంగా 45 రోజుల పాటు ఐఎస్ఎస్‌తో అనుసంధానమై ఉండగలదు. అది జూన్ 6న అక్కడికి చేరింది. ఆ లెక్కన జూలై 22 దాకా సమయముంది. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే? సునీత, బుచ్ విల్మోర్‌లను వెనక్కు తీసుకొచ్చేందుకు ప్రత్యామ్నాయాలున్నాయి. స్పేస్ ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ ద్వారా, లేదంటే రష్యా సూయజ్ వ్యోమ నౌక ద్వారా వారిని వెనక్కు తీసుకురావచ్చు.

ఐఎస్ఎస్‌లోనే మకాం

సునీత, విల్మోర్ ప్రస్తుతానికి ఐఎస్ఎస్‌లోనే సురక్షితంగా ఉన్నారు. సునీత తన అనుభవం దృష్ట్యా పరిశోధనలు, ప్రయోగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే అక్కడున్న ఏడుగురుతో కలిసి ఐఎస్ఎస్ నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాల్లో బిజీగా గడుపుతున్నారు.

నేను, మీ సునీతను...!

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న సునీతా విలియమ్స్ తమ తాజా అంతరిక్ష యాత్ర గురించి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడనున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30కు ఈ కార్యక్రమం ఉంటుంది. నాసా టీవీ, నాసా యాప్, సంస్థ వెబ్‌సైట్‌తో పాటు యూట్యూబ్‌లో దీన్ని ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.

సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం ¦ 10 ¦ జూలై ¦ 2024

ఏఆర్‌ఎస్ స్టీల్స్ అంబాసిడర్‌గా ద్రావిడ్



సాక్షి, చెన్నై: తమిళనాడు మార్కెట్‌లో నాణ్యత ప్రమాణాలలో తిరుగులేని నాయకత్వంతో ముందుకెళ్తున్న తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా క్రికెట్ దిగ్గజం కెప్టెన్ రాహుల్ ద్రావిడ్‌ను ఎంపిక చేసినట్టు ఏఆర్‌ఎస్ స్టీల్స్ ఎండీ అశ్వనీ కుమార్ భాటియా తెలిపారు. మంగళవారం స్థానికంగా సరికొత్త తుప్పు నిరోధక స్టీల్(సీఆర్‌ఎస్)ను పరిచయం చేస్తూ వివరాలను ఆయన వెల్లడించారు. సీఆర్‌ఎస్‌ను ప్రారంభించేందుకు ద్రావిడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత నాణ్యత పర్యవేక్షను తాము ప్రవేశ పెట్టడం ద్వారా వినియోగ దారులు స్టీల్‌కొనుగోలు విధానాన్నే మార్చామని పేర్కొన్నారు. 2023లో నో ద ట్రూత్ ప్రచారాన్ని ప్రారంభించామని గుర్తు చేస్తూ, టీఎంటీ బార్‌లను కొనుగోలు చేసే ముందుగా అన్ని రకాల పరిశోధనలను వినియోగదారులు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు.

న్యూస్‌రీల్

కారును ఢీకొన్న బైక్

– ఇద్దరు యువకుల మృతి

కొరుక్కుపేట: నీలగిరి ఎస్పీ భార్య కారును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాలు.. నీలగిరి జిల్లా ఎస్పీగా సుందరవడివేల్ పనిచేస్తున్నారు. ఆయన భార్య ప్రభుత్వ కారులో సోమవారం మెట్టుపాళయం మీదుగా కోయంబత్తూరు వెళ్లారు. కారును తమిళ కుడిమగన్ (32) అనే పోలీస్ కానిస్టేబుల్ నడుపుతున్నాడు. కల్లార్ దగ్గరికి వస్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి ఊటీలోని కంథాల్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ కాటేజీ ఉద్యోగి అల్తాఫ్ (21), అతని స్నేహితుడు మధు జునైద్ (19) కారును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. తర్వాత కోయంబత్తూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చాగా అక్కడ చికిత్స అందక అల్తాఫ్ మృతి చెందాడు. తీవ్ర గాయాలతో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న మహ్మద్ జునైద్ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. మెట్టుపాళయం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్మగ్లర్లకు సహకారం

– ఇమిగ్రేషన్ అధికారి సస్పెన్షన్

సాక్షి, చెన్నై: చెన్నై విమానాశ్రయంలో పనిచేస్తున్న ఇమిగ్రేషన్ అధికారి ఒకరిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. బంగారం స్మగ్లర్లకు ఈ అధికారి సహకరిస్తున్నట్లు విచారణలో తేలింది. విదేశాల నుంచి చెన్నైకు పెద్దఎత్తున బంగారం తరలుతున్న విషయం తెలిసిందే. రోజూ విమానాశ్రయంలో బంగారం పట్టుబడుతూనే ఉంది. అయితే పట్టుబడేది గోరంతే, తరలుతున్నది కొండంత అన్న ఆరోపణలు సైతం అధికంగానే ఉంటూ వస్తున్నాయి. ఇటీవల కాలంలో శ్రీలంక నుంచే సుమారు 267 కేజీల బంగారం చెన్నైలో చిక్కింది. ఇందుకు సహకరించినట్టుగా ఓ సీనియర్ అధికారి, విమానాశ్రయంలో ఫ్యాన్సీ షాపు నడుపుతున్న ఓ వ్యక్తి, అతడి సిబ్బందిని కస్టమ్స్ అధికారులు విచారణ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ వ్యవహారం ఓ వైపు సాగుతోన్న నేపథ్యంలో మరోవైపు స్మగ్లర్లకు ఇమిగ్రేషన్ అధికారిగా పనిచేస్తున్న శరవణన్ సహకరిస్తూ రావడం విచారణలో తేలింది. విదేశాల నుంచి వచ్చే వారి నుంచి ఇమిగ్రేషన్ తనిఖీల సమయంలో శరవణన్ బంగారం తీసుకుని, వాటిని కస్టమ్స్ తనిఖీలకు ఆస్కారం ఇవ్వకుండా బయటకు చేరుస్తూ వచ్చి నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో శరవణన్‌ను సస్పెండ్ చేస్తూ, విచారించేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే, 267 కేజీల బంగారం స్మగ్లింగ్ కేసుతో శరవణన్‌కు సంబంధం లేదని, ఈ కేసు స్మగ్లర్లకు సహకరిస్తున్న కేసుగా విమానాశ్రయ వర్గాలు పేర్కొంటున్నాయి.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

– ఒకరోజు వేతనం కట్



చెన్నైలో కార్మికుల నిరసన

సాక్షి, చెన్నై: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం తమ డిమాండ్ల పరిష్కార నినాదంతో విద్యుత్ ఉద్యోగ, కార్మికులు నిరసనలు చేపట్టారు. చెన్నై అన్నాసాలైలోని విద్యుత్‌బోర్డు ప్రధాన కార్యాలయ ఆవరణలో ఆందోళనకు దిగారు. వివరాలు.. విద్యుత్ బోర్డులో ఖాళీల భర్తీ, ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఒప్పంద, కాంట్రాక్ట్ కార్మికుల పర్మినెంట్, రిటైర్డ్ ఉద్యోగులకు పదవీ విరమణ మొత్తాల బకాయి చెల్లింపు తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదిస్తూ సీఐటీయూ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్త నిరసనకు పిలుపునిచ్చారు. దీంతో మంగళవారం విధులను బహిష్కరించిన ఉద్యోగ, కార్మికులు సీఐటీయూ నేతృత్వంలో అన్ని జిల్లా కేంద్రాల్లోని ట్రాన్స్ జెండ్ కో కార్యాలయాల వద్ద విద్యుత్ ఆందోళనకు దిగారు. చెన్నై అన్నాసాలైలోని ప్రధాన కార్యాలయం వద్ద నిరసనకు దిగిన కార్మికుల కార్యాలయంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. మెజారిటీ శాతం ఉద్యోగ, కార్మికులు విధులను బహిష్కరించడంతో విద్యుత్‌సేవలకు ఇబ్బందులు తప్పలేదు. అయితే మిగిలిన సిబ్బంది ద్వారా సమస్యలను త్వరితగతిన అధిగమించారు. నిరసన పేరిట విధులను బహిష్కరించిన వారికి ఒక రోజు వేతనం కట్‌చేస్తూ విద్యుత్ అధికారులు నిర్ణయంతీసుకున్నట్లు సంకేతాలు వెలువడ్డాయి.

ఫిర్యాదులను ఎదుర్కొంటున్న నటులపై చర్యలు

తమిళసినిమా: తమిళ చలన చిత్ర నిర్మాతల మండలి కార్యవర్గ సమావేశం మంగళవారం చెన్నైలోని ఫిలింఛాంబర్‌లో జరిగింది. నిర్వాతల మండలి అధ్యక్షుడు ఎన్.రామసామి అధ్యక్షతను జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణన్,కధిరేశన్, ఉపాధ్యక్షుడు జీఎం.తమిళ్‌కుమరన్, ఉపకార్యదర్శి సౌందర్ పాండియన్, కోశాధికారి చంద్ర ప్రకాశ్ జైన్‌తో పాటు పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా నిర్మాతల మండలికి, దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్యకు మధ్య కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమలు పరచాలని పేర్కొన్నారు. అదేవిధంగా స్క్వాడ్ పేరుతో ఎవరూ షూటింగ్ స్పాట్‌కు వెళ్లరాదని, షూటింగ్‌లను అడ్డుకోరాదని తీర్మానం చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే ఫెఫ్సీ నిర్వాహకుల దృష్టికి తీసుకురావాలని, అలాంటి సమస్యలను ఫెఫ్సీ, నిర్మాతల మండలి చర్చించి పరిష్కారం చేస్తాయని అన్నారు. ఇకపోతే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నటీనటులపై నిర్మాతల ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు.

హంతకులను వదిలి పెట్టం!

ఆమ్‌స్ట్రాంగ్ హత్య వెనుక ఎంతటి వారు ఉన్నా వదిలి పెట్టబోమని, అందరికీ శిక్షపడేలా చేస్తామని బాధిత కుటుంబానికి సీఎం స్టాలిన్ హామీ ఇచ్చారు. ఆయన సతీమణి పొర్కొడిని మంగళవారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఇక ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసును సుమోటోగా విచారించాలని జాతీయ ఎస్సీ కమిషన్ నిర్ణయించింది. ఈ మేరకు వివరణ కోరుతూ డీజీపీ, సీఎస్‌కు నోటీసులు పంపించింది.

- నేరస్తులకు శిక్షపడేలా చేస్తాం
- ఆమ్‌స్ట్రాంగ్ కుటుంబానికి స్టాలిన్ హామీ
- సతీమణి పొర్కొడికి ఓదార్పు
- పళని, అన్బుమణి పరామర్శ



పోలీసు అధికారులతో సీఎం స్టాలిన్ సమీక్ష

సాక్షి, చెన్నై: బహుజన్ సమాజ్ వాదీ పార్టీ(బీఎస్పీ) తమిళనాడు అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ ఈనెల 5వ తేదీ రాత్రి పెరంబూరు బందర్ గార్డెన్‌లో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన పార్థీవదేహాన్ని చెన్నై శివారులోని పొత్తురులో ఖననం చేశారు. ఈకేసులో 11 మందిని ఇప్పటి వరకు పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో కలకలం రేపిన ఈ ఘటన పోలీసు ఉన్నతాధికారుల బదిలీలకు సైతం దారి తీసింది. అదే సమయంలో ఈ హత్య వెనుక రాజకీయ కోణం ఉందన్న ఆరోపణలు కొనసాగుతూ వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మంగళవారం ఉదయాన్నే మంత్రి శేఖర్‌బాబుతో కలిసి సీఎం స్టాలిన్ ఐనావరంలోని ఆమ్‌స్ట్రాంగ్ నివాసానికి వెళ్లారు. ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన సతీమణి పొర్కొడికి సానుభూతి తెలుపుతూ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఆమెతో పాటు ఏడాది న్నర బిడ్డ, బంధువులకు ఈ సందర్భంగా భరోసా కల్పించారు. నిందితులు ఏ ఒక్కర్నీ వదిలి పెట్టమని, అందరినీ శిక్షిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎక్స్ పేజీలో సీఎం స్టాలిన్ ఓ ట్వీట్ చేశారు. పొర్కొడికి ఓదార్పు గురించి ప్రస్తావిస్తూ, ఈ హత్య ఘటన వెనుక ఎంతటి వారు ఉన్నా, వదిలి పెట్టమని, అందరినీ అరెస్టు చేసి చట్ట ముందు నిలబెట్టి కఠిన శిక్షపడేలా చేస్తామన్నారు. ఆయన అంత్యక్రియలకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు ప్రభుత్వం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ దారుణానికి పాల్పడిన వారందరినీ అరెస్టు చేస్తామని, తమది అందరి ప్రభుత్వమని, న్యాయాన్ని నిలబెడుతామని, పోలీసులు పక్షపాతం లేకుండా నిజాయితీతో పనిచేసి నిందితులకు శిక్ష పడేలా చేస్తారని స్పష్టం చేశారు. అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి, ముఖ్య నేతలు జయకుమార్ తదితరులు, పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాసు వేరువేరుగా ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడిని కలిసి సానుభూతి తెలియజేశారు. ఆమ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

రంగంలోకి ఎస్సీ కమిషన్

మీడియాలు, పత్రికలలో వచ్చిన కథనాలు, వార్తల ఆధారంగా ఆమ్ స్ట్రాంగ్ హత్యకేసును సుమోటోగా విచారణకు స్వీకరించాలని జాతీయ ఎస్సీ కమిషన్ నిర్ణయించింది. ఈ హత్య ఘటనకు సంబంధించిన సమగ్ర సమాచారంతో వివరణను సమర్పించాలని సీఎస్ శివదాసన్ మీనా, డీజీపీ శంకర్‌జివ్వాల్‌ను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

డీఎంకేపై పా.రంజిత్ ఆరోపణలు

ఆమ్‌స్ట్రాంగ్ హత్య ఘటన నేపథ్యంలో దర్శకుడు పా.రంజిత్ తన ఎక్స్ పేజీ ద్వారా డీఎంకే ప్రభుత్వంపై ఆరోపణలు, విమర్శలతో పలు ప్రశ్నలను సంధించడం చర్చకు దారి తీసింది. పోలీసు స్టేషన్‌కు అతి సమీపంలోనే ఈ హత్య జరిగిందంటే, భద్రత గురించి హంతకులకు ఏమాత్రం భయం లేదనే విషయం స్పష్టమవుతోందన్నారు. రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయని ప్రశ్నించారు. ఈ కేసులో లొంగిపోయిన వారు ఇచ్చే వాంగ్మూలం చుట్టే కథ తిరుగుతోందని, దీనితోనే ముగించే ప్రయత్నాలు చేస్తున్నట్లుందని పేర్కొంటూ, వెనుక ఉన్న వారెవరో? అని ప్రశ్నించారు. పెరంబూరులో అంత్యక్రియలు జరగనివ్వకుండా పథకం ప్రకారం కుట్ర చేశారని, దళిత సామాజిక వర్గం, దళిత నేతలపై ఈ పాలకులకు చిత్తశుద్ధి లేదని, సామాజిక న్యాయం అన్నది కేవలం ఓట్ల కోసం మాత్రమే అని వ్యాఖ్యానించారు. పా. రంజింత్ వ్యాఖ్యలపై డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ దీటుగానే స్పందించారు. ఓ నేత హత్య కేసు విచారణ తీవ్రంగా జరుగుతోన్న సమయంలో ఆ వివరాలను బహిర్గతం చేసే అవకాశం ఉందా? అన్న విషయం కూడా రంజిత్‌కు తెలియదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సామాజిక వర్గ ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా డీఎంకే ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. తమిళనాడు పోలీసులు దేశంలోనే బెస్ట్ అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దళిత సామాజికవర్గానికి డీఎంకే వ్యతిరేకం అన్నట్లుగా బురద జల్లే ప్రయత్నాన్ని చేస్తుండడం దారుణమని విమర్శించారు.



ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడిని ఓదార్చుతున్న సీఎం స్టాలిన్



ఆమ్‌స్ట్రాంగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాన ప్రతిపక్ష నేత పళనిస్వామి

పోలీసు అధికారులతో సమీక్ష

ఆమ్‌స్ట్రాంగ్ హత్య, రాష్ట్రంలో నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ప్రభుత్వాన్ని కలవరంలో పడేసింది. ప్రస్తుతం హత్యా నేరాలు అమాంతం పెరగడాన్ని సీఎం స్టాలిన్ తీవ్రంగా పరిగణించారు. సచివాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సీఎస్ శివదాస్‌మీన, హోం శాఖ కార్యదర్శి పి అముదా, డీజీపీ శంకర్ జివ్వాల్, అదనపు డీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదం, చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్, ఆవడి పోలీసు కమిషనర్ శంకర్, తాంబరం పోలీసు కమిషనర్ అమల్‌రాజ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా నేరగాళ్లపై ఉక్కుపాదం మోపే విధంగా కఠినంగా వ్యవహరించాలని, కిరాయి ముఠాలు, పాత నేరస్తులు, రౌడీలు, దాదాల కదలికలను పసిగట్టే విధంగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని సీఎం ఆదేశించారు. దీంతో అదనపు డీజీపీ డేవిడ్సన్ ఆదేశాలతో రాష్ట్రంలోని జిల్లాలో ఎస్పీల పర్యవేక్షణలో రౌడీల వేట ముమ్మరంగా జరుగుతోంది. చెన్నైలో 6వేల మంది రౌడీలు ఉన్నట్లుగా తేలడంతో వారెవ్వక్కడ ఉన్నారో అని ఇళ్ల వద్దకే వెళ్లి ఆరా తీస్తున్నారు. కాగా తాజాగా రౌడీల వేట కంటితుడుపు చర్య అని, ఇవన్నీ నాటకాలేనని, తమిళనాట ఎవరికీ భద్రత లేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు.

శివకాశిలో బాణసంచా పేలుడు

- ఇద్దరి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం

సాక్షి, చెన్నై: విరుదునగర్ జిల్లా శివకాశిలో మంగళవారం బాణసంచా పేలుడు చోటు చేసుకుంది. ఈప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరు ఆస్పత్రిలో తీవ్ర చికిత్స పొందుతున్నారు. వివరాలు.. విరుదునగర్ జిల్లా శివకాశి, సాత్తూరు డివిజన్‌లోని గ్రామాలు బాణసంచా తయారీలో అగ్రగామిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఇక్కడ ఏడు ప్రమాదాలు జరిగాయి. సుమారు 40 మందికి పైగా మరణించారు. గత నెల రోజులలోనే జరిగిన మూడు ప్రమాదాలలో 16 మంది మృతి చెందారు. ఈ పరిస్థితులలో మంగళవారం శివకాశి సమీపంలోని కాలయార్ కురిచ్చి గ్రామంలోని బాణసంచా పరిశ్రమలో పేలుడు జరిగింది. ఓ గదిలో పేలుడు జరగడంతో అందులో ఉన్న ఇద్దరు కార్మికులు ఘటనా స్థలంలోనే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అలాగే మంటలు ఇతర గదులకు వ్యాపించకుండా జాగ్రత్తలు పడ్డారు. పేలుడు సమయంలో ఇతర గదుల్లో ఉన్న కార్మికులు భయంతో బయటకు పరుగులు పెట్టారు. ఈ ప్రమాదంలో చిదంబరపురానికి చెందిన మారియప్పన్(45), ముత్తుమురుగన్(45) మరణించినట్లు గుర్తించారు. ఓ మహిళతో పాటు మరొకరు తీవ్రగాయాలతో శివకాశి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సబ్ కలెక్టర్ ప్రియ రవిచంద్రన్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేయించారు. ఈ పరిశ్రమ యజమాని మురుగన్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు, గాయపడి ఆస్పత్రిలో ఉన్న వారికి తలా రూ. లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

అడవి దున్నల దాడిలో రైతు మృతి

సేలం: పంట పొలంలోకి చొరబడిన అడవి దున్నలను తరిమే క్రమంలో వాటి దాడికి గురై ఓ రైతు మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. సేలం జిల్లా కరుమత్తురై సమీపంలోని కారియకోవిల్ సడయంపట్టికి చెందిన గణేషన్ (54). ఇతని భార్య దేవి. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరు ముట్టల్ ఏరి సమీపంలోని వీరి పొలంలో కర్రపెండలం పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇతని పంటపై అడవి దున్నలు పడి నాశనం చేస్తుండడంతో స్థానికులు ఈ విషయాన్ని గణేషన్‌కు తెలిపారు. దీంతో పొలం వద్దకు వెళ్లి వస్తానని తెలిపి ఇంటి నుంచి వెళ్లిన గణేషన్ తర్వాత తిరిగి రాలేదు. సాయంత్రం కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా పొలంలో తీవ్రగాయాలతో శవమై కనిపించాడు. అడవి దున్నల దాడిలో అతడు మరణించినట్లు అటవీ శాఖ సిబ్బంది నిర్ధారించారు.

17 నుంచి తెన్‌కాశిలో చిన్నమ్మ పర్యటన

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే కేడర్‌కు చేరువయ్యే విధంగా రాష్ట్ర పర్యటనకు దివంగత సీఎం జె. జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళ సిద్ధమయ్యారు. ఈనెల 17నుంచి తెన్‌కాశిలో పర్యటించేందుకు నిర్ణయించారు. వివరాలు.. ప్రస్తుతం అన్నాడీంఎంకే కేడర్ ముక్కలై ఉన్న విషయం తెలిసిందే. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా పళణిస్వామి పార్టీని నడుపుతూ వస్తున్నా, ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన చిన్నమ్మ శశికళ ఓ శిబిరంగా, మాజీ సీఎం పన్నీరు సెల్వం మరో శిబిరంగా, టీటీవీ దినకరన్ అమ్మమక్కల్ మున్నేట్రక కళగం పార్టీతో రాజకీయ పయనం సాగిస్తున్నారు. లోక్ సభ ఎన్నికలలో అన్నాడీఎంకే ఓటమితో పార్టీని రక్షించుకునే ప్రయత్నాలపై దృష్టి పెట్టబోతున్నట్టు శశికళ ప్రకటించారు. అందర్నీ ఏకం చేయడమే లక్ష్యం, నాయకులు తలా ఓ దారిలో ఉన్నా, కేడర్ అభిప్రాయమే తనకు ముఖ్యం అని పేర్కొన్నారు. కేడర్‌ను ఏకం చేసే విధంగా రాష్ట్ర పర్యటన చేయబోతున్నానని తెలియజేశారు.

ఇందుకు అనుగుణంగా ఆమె పర్యటన రూట్ మ్యాప్ సిద్ధమవుతోంది. 2026 అసెంబ్లీ ఎన్నికల ద్వారా అన్నాడీఎంకేను అధికారంలోకి తీసుకు రావడమే లక్ష్యంగా, అందరూ ఒకే వేదిక మీదకు రావాలన్న పిలుపుతో ఈ పర్యటనకు చిన్నమ్మ కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. తెన్‌కాశి నుంచి తన పర్యటన చేపట్టబోతున్నారు. తెన్‌కాశి పర్యటన తదుపరి ఏ జిల్లాలో పర్యటిస్తామో ప్రకటిస్తామన్నారు.

సీనియర్ ఐపీఎస్ అధికారుల బదిలీ

– 18 మందికి స్థాన చలనం

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో 18 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రధాన కార్యదర్శి పి. అముద మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం సచివాలయంలో సీఎం స్టాలిన్ పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కీలక నిర్ణయాలు ఇందులో తీసుకున్నారు. ఈ పరిస్థితుల్లో భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కావడం పోలీసు వర్గాల్లో విస్మయానికి గురి చేసింది. ఈ బదిలీలో డీజీపీ, ఏడీజీపీ, ఐజీ హోదాలలోని అధికారులు ఉన్నారు.

తాంబరం కమిషనర్‌గా అబిన్

హోంశాఖ ఉత్తర్వుల మేరకు తాంబరం కమిషనర్‌గా ఉన్న ఎ.అమల్‌రాజ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో – సీఐడీ ఏడీజీపీగా బదిలీ చేశారు. తాంబరం కమిషనర్‌గా స్టేట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ఏడీజీపీగా ఉన్న అబిన్ దినేష్ మొదక్‌ను నియమించారు. ఆర్మ్డ్ పోలీసు ఏడీజీపీగా ఉన్న హెచ్.ఎం.జయరామ్‌ను క్రైమ్ రికార్డ్ బ్యూరోకు, వీఆర్‌లో ఉన్న డీజీపీ స్థాయి అధికారి మహేష్ కుమార్ అగర్వాల్‌ను ఆర్మ్డ్ పోలీసు విభాగానికి స్థాన చలనం కల్పించారు. క్రైమ్ బ్రాంచ్ సీఐడీ ఏడీజీపీగా ఉన్న జీ.వెంకటరమణన్‌ను పోలీసు అడ్మినిస్ట్రేషన్ విభాగానికి, ఇక్కడ పని చేస్తున్న దేవ్ వాంక్‌డేను పోలీసు హెడ్ క్వార్టర్స్ ఏడీజీపీగా బదిలీ చేశారు. క్రైమ్ బ్రాంచ్ సీఐడీ ఐజీ టీఎస్ అన్బుకు అదేవిభాగం ఏడీజీపీగా, సైబర్ క్రైమ్ ఏడీజీపీ సంజయ్ కుమార్‌ను కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్‌నకు, ఇక్కడ పని చేస్తున్న సందీప్ మిట్టల్‌ను సైబర్ క్రైమ్‌కు మార్చారు. వీఆర్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్‌ను మహిళలు, పిల్లల నేర విచారణ విభాగానికి, ఇక్కడ పని చేస్తున్న తమిళ్ చంద్రన్‌ను పోలీసు టెక్నికల్ సర్వీస్‌కు స్థాన చలనం కల్పించారు. గ్రేటర్ చెన్నై అదనపు కమిషనర్(దక్షిణం) ప్రేమానంద్ సిన్హాను మదురై ఐజీగా, ఇక్కడ పని చేస్తున్న కన్నన్‌ను గ్రేటర్ చెన్నై (దక్షిణం)కు, గ్రేటర్ చెన్నై లా అండ్ ఆర్డర్ అదనపు కమిషనర్ అస్రాకార్గ్‌ను నార్త్ జోన్(చెన్నై) ఐజీగా, ఇక్కడ పని చేస్తున్న నరేంద్రన్ నాయర్‌ను గ్రేటర్ చెన్నై లా అండ్ ఆర్డర్ అదనపు కమిషనర్‌గా బదిలీ చేశారు. తిరుప్పూర్ సిటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ అభినవ్‌ను సేలం కమిషనర్‌గా, ఇక్కడ పని చేస్తున్న బి. విజయకుమారిని చెన్నై ఆర్మ్డ్ పోలీసు ఐజీగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్. లక్ష్మిని తిరుప్పూర్ సిటీ కమిషనర్ స్థాన చలనం కల్పించారు.



పోలీసు హెడ్‌క్వార్టర్ భవనం

ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

- విక్రవాండిలో నేడు ఓటింగ్
- నిఘా కట్టుదిట్టం



డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు

సాక్షి, చెన్నై: ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. విక్రవాండిలో బుధవారం పోలింగ్ జరగనుంది. ప్రజలకు శాంతియుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునే విధంగా నియోజకవర్గంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. వివరాలు.. డీఎంకే ఎమ్మెల్యే పుగళేంది మరణంతో విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలో డీఎంకే అభ్యర్థిగా అన్నియూరు శివ, బీజేపీ కూటమిలో పీఎంకే అభ్యర్థిగా సి. అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా అభినయ పోటీలో ఉన్నారు. వీరితో పాటుగా 29 మంది స్వతంత్ర అభ్యర్థులు అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో పడ్డారు. ఈ ఎన్నికలలో లక్ష ఓట్ల మెజారిటీ సాధించడమే లక్ష్యంగా డీఎంకే, గెలుపు ధ్యేయంగా బీజేపీ కూటమి ఓట్ల వేటలో దూసుకెళ్లాయి. ఉప ఎన్నిక నగారా మోగినానంతరం కళ్లకురిచ్చిలో చోటు చేసున్న కల్తీ సారా మరణాలు, బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య వంటి ఘటనలతో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయనే విషయాన్ని ప్రచార సమయంలో ప్రజల్లోకి బీజేపీ కూటమి తీవ్రంగానే తీసుకెళ్లింది. డీఎంకే అభ్యర్థిని ఓడించి ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలనే లక్ష్యంతో ఓటర్లకు పిలుపు నిచ్చారు. ఈ పరిణామాలతో విక్రవాండిలో ఉప సమరం ఉత్కంఠగా మారింది. ఈ సమయంలో బుధవారం ఓటింగ్ ప్రక్రియ జరగనుండడంతో ఎలాంటి వివాదాలు, అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా ఎన్నికను విజయవంతం చేయడానికి విల్లుపురం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పళణి నేతృత్వంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరిగాయి.

ఓటింగ్‌కు సర్వం సిద్ధం

విక్రవాండి నియోజకవర్గంలో 2,37,031 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,16,962 మంది పురుషులు, 1,20,040 పురుషులు, 29 మంది ఇతరులు. ఇక్కడ 138 కేంద్రాలలలో 276 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇందులో 42 సమస్యాత్మకమైనవి. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 140 పోలింగ్ బూత్‌లలో వెలుపల, పరిసరాలలోనూ సీసీ కెమెరాల నిఘాకు చర్యలు తీసుకున్నారు. 44 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను పూర్తిగా పారా మిలటరీ భద్రత కల్పించారు. ఎన్నికలకు అవసరమైన 1,349 ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ ప్యానల్స్‌తో పాటు ఓటరు వివరాల జాబితా, పెన్నులు, సిరా, ఇతర సామాగ్రితో కూడిన బాక్సులను ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు మధ్యాహ్నం తర్వాత తాలుకా కార్యాలయం నుంచి తీసుకెళ్లారు. సాయంత్రం సమయానికి అన్ని పోలింగ్ బూత్‌లకు సామాగ్రి చేర్చారు. వీటికి భద్రతగా పోలింగ్ బూత్‌ల వద్ద పారా మిలటరీ, స్పెషల్ ఫోర్సుతో పాటుగా 3 వేల మంది పోలీసులు విధుల్లో ఉన్నారు. పోలింగ్ బూత్‌ల పరిసరాలు, గ్రామాలలో ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించారు. శాంతియుత వాతావరణంలో తమ హక్కును ఓటర్లు వినియోగించుకునేందుకు వీలుగా నియోజక వర్గాన్ని పూర్తిగా నిఘా నీడలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే టాస్మాక్ మద్యం దుకాణాలను మూసి వేశారు. స్థానిక సెలవు ప్రకటించడంతో ప్రజలందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ పళణి పిలుపు నిచ్చారు. ఎన్నికల విధులకు హాజరయ్యే పోలీసులతో పాటు సుమారు 2 వేల మంది ఇతర సిబ్బందిలో అనేక మంది తమ పోస్టల్ ఓట్లను ఇప్పటికే వినియోగించుకున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు 574 మంది తమ పోస్టల్ ఓట్లను నమోదు చేసుకోవడం గమనార్హం. ఇక బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. ఉప ఎన్నిక ప్రక్రియను చెన్నై నుంచి ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ పర్యవేక్షించనున్నారు.



సీసీ కెమెరాల పనితీరును కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలిస్తున్న కలెక్టర్ పళని



ఎన్నికల సామాగ్రి సిద్ధం



వాహనాల తనిఖీ

చెన్నై
బుధవారం ၊ 10 ၊ జూలై ၊ 2024
సాక్షి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా కవరపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వివరాలు.. కల్లకురుచ్చి జిల్లా చిన్నసేలం ప్రాంతానికి చెందిన నెహ్రూ కుమారుడు శక్తివేల్(30) తిరువళ్లూరు జిల్లా కవరపేట సమీపంలోని తమిళనాడు ఇటుక బట్టీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం శక్తివేల్ తన స్నేహితుడు సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో కవరపేట నుంచి గుమ్మిడిపూండి వైపు బయలుదేరాడు. కరవపేట మెయిన్ రోడ్డుకు వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శక్తివేల్ తీవ్రంగా గాయపడగా అతడిని స్థానికులు చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కవరపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోయంబేడు బ్రిడ్జిపై కార్మికుడు..

తిరువొత్తియూరు: చెన్నై, కోయంబేడు వంతెనపై మోటారు సైకిల్ ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. వివరాలు.. తిరువేర్కాడు ప్రాంతానికి చెందిన కుమరవేల్ (46) అన్నానగర్‌లోని ఓ టీ దుకాణంలో మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటలకు మోటారు సైకిల్‌పై మధురవాయల్ వైపు వెళుతున్నాడు. కోయంబేడు బ్రిడ్జిపై వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా కుమారవేల్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా వెళ్లింది. కుమరవేల్ అదుపుతప్పి మోటార్‌సైకిల్‌తో రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కోయంబేడు ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ..

తిరుత్తణి: విద్యుదాఘాతంతో రైల్వే కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు.. తిరుత్తణి సమీపంలోని పొన్పాడి రైల్వే స్టేషన్ ప్రాంతంలో సిగ్నలింగ్, ట్రాక్ మరమ్మతు పనుల్లో తిరుపత్తూరు జిల్లా బొమ్మనాయకన్ పాళ్యంకు చెందిన మునుస్వామి(64) పాల్గొన్నాడు. పొన్పాడి వద్ద అద్దె ఇల్లు తీసుకుని ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్నానం చేసేందుకు వీలుగా మోటారు వేసే సమయంలో విద్యుదాఘాతం చోటు చేసుకోవడంతో మునుస్వామి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కార్మికులు సమాచారంతో తిరుత్తణి పోలీసులు మునుస్వామి మృతదేహం చేపట్టి పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యాపకుల నిరసన



కళాశాల ఎదుట నినాదాలు చేస్తున్న ప్రొఫెసర్లు

వేలూరు: వేలూరు ఓటేరిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్‌లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భువనేశ్వరి మాట్లాడుతూ తాము ప్రభుత్వ కళాశాలలో 20 ఏళ్లుగా ప్యాకేజీ వేతనాలపై పనిచేస్తున్నా పర్మనెంట్ చేయడం లేదని, హైకోర్టు నియమించిన నెలసరి వేతనం రూ. 57,700ను వెంటనే ఇప్పించాలని, ప్రొఫెసర్‌లకు బకాయిలుగా ఉన్న రూ. 17 లక్షలను వెంటనే చెల్లించాలని, మహిళా ప్రొఫెసర్‌లకు ప్రభుత్వ ప్రయోజనాలతో కూడిన ప్రసూతి సెలవులు ఇప్పించాలని, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల రాత పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని, అధ్యాపక పోస్టుల్లో దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ప్రొఫెసర్‌లు గోవింద స్వామి, మురళీక్రిష్ణ, రఘుపతి ఉన్నారు.

పుదుచ్చేరిలో మద్యం తాగిన నలుగురికి అస్వస్థత

తిరువొత్తియూరు: విల్లుపురం జిల్లాలోని విక్రవాండి నియోజకవర్గ అసెంబ్లీ ఉప ఎన్నిక బుధవారం (10వ తేదీ) జరగనుంది. ఈ నేపథ్యంలో విక్రవాండి ప్రాంతానికి లోని టాస్మాక్ మద్యం దుకాణాలకు 8, 9, 10, 13 తేదీల్లో సెలవులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ క్రమంలో విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కంజనూరు, పురికుటి సాయికి చెందిన రాజా, బాబు, రవికుమార్, ప్రశాంత్ వలవనూరు సమీపంలో కూలీ పనులకు వెళ్లారు. పని పూర్తయ్యాక పుదుచ్చేరి రాష్ట్ర సరిహద్దుల్లో మద్యం కొనుగోలు చేశారు. తర్వాత స్వగ్రామానికి తీసుకొచ్చి తాగారు. అయితే వాంతులు, విరేచనాలు కావడంతో నలుగురిని సోమవారం ముండియంబాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంచనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి గొంతు కోసి 45 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: వృద్ధురాలి గొంతు కోసి 45 సవర్ల నగలు దోచుకెళ్లిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. మదురై జిల్లా తిరుమంగళం సమీపంలోని పెరియవగై కులం మయోన్ నగర్‌కు చెందిన తంగరాజ్. ఇతని భార్య కసమ్మాల్ (75). వడ్డీ వ్యాపారం చేసే తంగరాజ్ ఇటీవల ప్రమాదానికి గురయ్యాడు. ఇతను నాగమలైలోని పుదుకోట్టైలోని తన కుమార్తె ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి కసమ్మాల్ ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె గొంతు కోసి హత్య చేసి ఇంట్లో ఉన్న 45 సవర్ల బంగారు నగలను అపహరించారు. సమాచారం అందుకున్న పోలీసులు కసమ్మాల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుమంగళం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య

అన్నానగర్: చెన్నై ఎంజీఆర్ నగర్ కపిలర్ వీధికి చెందిన శేఖర్ కుమార్తె అనిత (22). ఈమె కే.కే. నగర్‌లోని ఓ ఆయిల్ షాపులో పనిచేస్తోంది. ఎప్పటిలాగే సోమవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చింది. తర్వాత ఆమె సోదరుడు అజిత్ భోజనానికి ఇంటికి వచ్చాడు. చాలా సేపటి వరకు అనిత తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి కిటికీలోంచి చూడగా అనిత ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరణించి ఉండడంతో స్థానికుల సాయంతో ఇంటి తలుపులు పగులగొట్టాడు. అనితను రక్షించి నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎం.జీ.ఆర్ నగర్ పోలీసులు ఆత్మహత్యకు పాల్పడిన అనిత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. అందులో చిన్నమలై ప్రాంతానికి చెందిన ఆకాష్‌ను రెండేళ్లుగా ఇన్‌స్టాగామ్‌లో ప్రేమిస్తున్నట్లు తెలిసింది. 3 రోజుల క్రితం ఆకాష్ తన ఇన్‌స్టాగామ్ పేజీలో వరుడి అలంకరణలో మరో అమ్మాయితో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశాడు. ఇది చూసిన అనిత షాక్ గురైంది. అతని ఫోన్ నంబర్ కలవకపోవడంతో మనస్థాపానికి గురైన అనిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

పురుగుల మందు తాగి యువకుడు..

తిరువళ్లూరు: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా రంగాపురం గ్రామానికి చెందిన శ్రీను(58). ఇతను గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైనట్లు తెలుస్తోంది. ఇటీవల చెన్నై వైద్యశాలలో చికిత్స కూడా తీసుకుంటున్నాడు. అయినా ఆరోగ్య సమస్యల తీవ్రం కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈక్రమంలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు.

ఆస్కా ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాల వితరణ



నోట్ పుస్తకాలను అందజేస్తున్న సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు

కొరుక్కుపేట: ఆస్కా ట్రస్ట్ నేతృత్వంలో పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు, స్కాలర్ షిప్ పంపిణీ చేపట్టారు. వివరాలు.. విల్లివాక్కంలోని శ్రీ కనకదుర్గ తెలుగు మహోన్నత పాఠశాల (ఎస్‌కేడీటీ)లో కరస్పాండెంట్ డాక్టర్ సీఎం కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 6 నుంచి 12 తరగతులకు చెందిన 500 మంది విద్యార్థులకు ఆస్కా అధ్యక్షులు కె.సుబ్బారెడ్డి, ఆస్కా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసులు రెడ్డిలు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఆదినారాయణ రెడ్డి, సభ్యులు జానకీ రామ్, శ్రీనాథ్, అజంతా శంకర రావు, ప్రధానోపాధ్యాయురాలు సారా సుహాసిని, ఏహెచ్‌ఎం మోహన్ నాయుడు, కార్యదర్శి శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్కా అధ్యక్షులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. మెరిట్ సాధించిన విద్యార్థుల ఉన్నత చదువులకు ఆస్కా ట్రస్ట్ తరపున సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తెలుగు విద్యార్థులకు ఆస్కా ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు.

పర్యాటక కేంద్రాల ప్రాముఖ్యతపై అవగాహన



తిరుత్తణి ఆలయం వద్ద విద్యార్థులతో హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్న అధికారులు

తిరుత్తణి: పర్యాటక కేంద్రాల ప్రాముఖ్యత పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించే క్రమంగా పర్యాటక శాఖ ద్వారా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి మంగళవారం విద్యార్థుల హెరిటేజ్ వాక్ నిర్వహించారు. తిరుత్తణి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. ఇందులో పర్యాటక శాఖ, హిందూ దేవదాయ శాఖ అధికారులు పాల్గొని ఘాట్‌రోడ్డు మార్గంలో విద్యార్థులతో పాదయాత్రగా వెళ్లి ఆలయం విశిష్టత, శిలా వైభవం, ఆలయ చరిత్ర, పురాతాన గోపురాలు, కట్టడాలకు సంబంధించి వివరాలను తెలియజేశారు.

ద్విచక్ర వాహనాల వేలం



వేలానికి సిద్ధంగా ఉంచిన వాహనాలు

తిరువళ్లూరు: వేర్వేరు కారణాలతో పోలీసులు సీజ్ చేసిన వాహనాలను మంగళవారం వేలం వేశారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి, పొన్నేరి, గుమ్మిడిపూండి, తిరువళ్లూరు, ఊత్తుకోట తదితర సబ్‌డివిజన్ పరిధిలో వేలాది వాహనాలను గత కొద్ది నెలల క్రితం సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను కొన్నింటిని డాక్యుమంట్‌లను సరి చూసి వాహనదారులకు అప్పగించారు. మిగిలిన 2 వేల వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని వేలం వేసి తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లో వున్న వాహనాలను తిరువళ్లూరు ఎస్పీ కార్యాలయానికి తరలించి అక్కడ వేలం నిర్వహించారు. వేలం పాటలో 550 మంది పాల్గొనగా రూ.20 లక్షలు ఆదాయం వచ్చింది.

ఐటీఐ విద్యార్థులకు 15న వృత్తి శిక్షణ

కొరుక్కుపేట: సదరన్ రీజియన్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరెక్టరేట్ సంయుక్తంగా ఐటీఐ పూర్తి చేసిన విద్యావంతుల కోసం ఈనెల 15న జిల్లా స్థాయి జాతీయవృత్తి నైపుణ్య శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెన్నై కలెక్టర్ రష్మిసిద్ధార్థ్ తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా స్థాయి జాతీయ వృత్తి శిక్షణ శిబిరం 15వ తేదీ ఉదయం 9 గంటలకు ఉత్తర చెన్నై ఆర్. కె. నగర్‌లోని ప్రభుత్వ వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.apprenticerhipindia.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



అ'పూర్వ' కలయిక

ఎస్‌కేపీడీ పాఠశాల పూర్వ విద్యార్థులు (1970 ఎస్ఎస్ఎల్‌సీ బ్యాచ్) 34 మంది కోయంబత్తూరులోని ఈషా కేంద్రంలో ఒకే వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాతజ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆధ్యాత్మికంగా, ఆహ్లాదకరంగా గడిపారు. - కొరుక్కుపేట

ఇప్పుడు కెమెరా వెనుక..



నటుడు రెహ్మాన్ వారసురాలు అలీషా

తమిళసినిమా: రిస్క్‌లోనూ ఎంటర్‌టెయిన్‌మెంట్ మిస్ కాని రంగం సినిమా. జయాపజయాలను పక్కన పెడితే ఈ కలర్‌ఫుల్ రంగంలోకి రావడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఇక సెలబ్రిటీల వారసుల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల వారు ఎక్కుగా సినిమా రంగంపైనే ఆసక్తి చూపుతున్నారని చెప్పవచ్చు. టాలెంట్ ఎవరి సొంతం కాదన్నట్టు, ప్రతిభ ఉంటే ఇక్కడ ఎవరైనా రాణించవచ్చు. కమలహాసన్ కుటుంబానికి చెందిన నటి సుహాసిని ముందుగా సినీ రంగప్రవేశం చేసింది ఛాయాగ్రహకురాలిగానే. ఆ తరువాత నటిగా మారి, ఆపై కథానాయకిగా బహుభాషా నటిగా వెలిగారు. ఇక కమలహాసన్ వారసురాళ్లు శృతిహాసన్, అక్షరహాసన్‌లో నటిగా పరిచయం అయ్యారు. వారిలో నటి శృతిహాసన్ ప్రస్తుతం అగ్రకథానాయకిగా రాణిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది సెలబ్రిటీ వారసులు సినీ రంగంలో తమ సత్తా చాటుకుంటున్నారు. తాగా ఈ కోవలోకి మరో వారసురాలు చేరారు. నటుడు రెహ్మాన్(రఘు) గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు.

1986లో నిలవే మలరే చిత్రంతో కథానాయకుడిగా తెరంగేట్రం చేసిన ఈయన ఆ తరువాత పలు చిత్రాల్లో కథానాయకుడిగా నటించి రాణించారు. తమిళం, తెలుగు, మలయాళం అంటూ పలు భాషల్లో పలు రకాల పాత్రల్లో నటిస్తున్న రెహ్మాన్ ఇటీవల పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో కూడా ముఖ్య పాత్రను పోషించారు. కాగా తాజాగా ఈయన వారసురాలు సినీ రంగప్రవేశం చేశారు. రెహ్మాన్ కూతురు పేరు అలీషా. ఈమెకు చిన్నతనం నుంచి సినిమాలంటే ఎంతో ఇష్టం అట. చూడ సక్కని నగుమోము, ఆకర్షణీయమైన అవయవ సంపద, కథానాయకికి కావాల్సిన లక్షణాలన్నీ ఈమెలో ఉన్నాయి. అయినప్పుడికీ ముందు అలీషా కెమెరా ముందుకు కాకుండా కెమెరా వెనుక ప్రతిభను చాటుకోవడానికి ఇష్టపడ్డారు. దర్శకుడు మణిరత్నం వద్ద సహాయ దర్శకురాలిగా చేరారు. ప్రస్తుతం థగ్ లైఫ్ చిత్రానికి ఈమె సహాయ దర్శకురాలిగా పని చేస్తున్నారు. ఈ చిత్రం పూర్తి అయిన తరువాత అలీషా మోగాఫోన్ పడతారో, లేక కెమెరా ముందు కథానాయకిగా కనిపిస్తారో? అన్న చర్చ కోలీవుడ్ వర్గాల్లో జరుగుతోంది. మొత్తం మీద అలీషా ఫొటోలిప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

కోలీవుడ్ టాక్స్

కాళిదాస్-2 చిత్రం ప్రారంభోత్సవంలో నటుడు శివకార్తికేయన్‌తో యూనిట్ సభ్యులు



కాళిదాస్-2 మొదలైంది

తమిళసినిమా: 2019లో నటుడు భరత్ హీరోగా నటించిన చిత్రం కాళిదాస్. ఈ చిత్రం విమర్శకులను సైతం మెప్పించి, కమర్షియల్‌గానూ మంచి విజయాన్ని సాధించింది. కాగా ఐదేళ్ల తరువాత దానికి సీక్వెల్‌గా కాళిదాస్-2 చిత్రం సోమవారం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. నటుడు భరత్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి కాళిదాస్ చిత్రం ఫేమ్ శ్రీ సెంథిల్‌నే దర్శకత్వం వహిస్తున్నారు. నటుడు అజయ్ కార్తీ ముఖ్య పాత్రను పోషిస్తున్న ఈ చిత్రాన్ని స్కై పిక్చర్స్ సంస్థ అధినేత, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత ఫైవ్‌స్టార్ సెంథిల్, యోగేశ్వరన్ కలిసి నిర్మిస్తున్నారు. సురేష్ బాలా ఛాయాగ్రహణం, శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూజా కార్యక్రమాల్లో నటుడు శివకార్తికేయన్ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. అలాగే నిర్మాత లలిత్‌కుమార్, అమ్మా క్రియేషన్స్ టి.శివ, ఫైవ్‌స్టార్ కదిరేశన్, అరుణ్ విశ్వా, అంబేత్‌కుమార్, సినీష్, కరుణామూర్తి, కుమార్, దేవరాజ్, ఫైవ్‌స్టార్ కల్యాణ్, పంపిణీదారుడు అళగర్‌సామి, అరవింద్, దర్శకుడు గణేశ్‌బాబు, కె.కల్యాణ్, జగన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిత్రం యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. కాగా కాళిదాస్-2 చిత్రానికి ఇప్పుడు పూజా కార్యక్రమాలను నిర్వహించామని, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను నిర్వహించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. అలాగే ఇందులో నటించే నటీనటుల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు.

వచ్చే ఏడాది బిరియానికి సిద్ధం!



అభిమానులతో నటుడు కార్తీ

తమిళసినిమా: కోలీవుడ్‌లో చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉన్న కొద్ది మంది హీరోలలో కార్తీ ఒకరు. ప్రస్తుతం ఈయన రెండు చిత్రాలను పూర్తి చేశారు. తాజాగా సర్దార్ 2 చిత్రంలో నటిస్తున్నారు. కాగా నటుడు కార్తీకి అభిమానులు ఎక్కువే. తమిళంతో పాటు తెలుగు, కన్నడం, మలయాళంలోనూ అనేక మంది అభిమానులు ఉన్నారు. వారంతా అభిమానంతో సరిపెట్టుకోకుండా జిల్లాల వారీగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ సేవాతత్వాన్ని నిరూపించుకుంటున్నారు. కాగా గత మే నెల 25వ తేదీ నటుడు కార్తీ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా రక్తదాన శిబిరాలను నిర్వహించారు. కాగా అలా రక్తదాన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అభిమానుల్లో మొదటి విడతగా ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై, కళ్లకురిచ్చి,తిరువారూర్, తిరువళ్లూర్ ప్రాంతాలకు చెందిన మొత్తం 200 మందికి పైగా అభిమానులను ఆదివారం నటుడు కార్తీ కలిశారు. వారందరినీ చెన్నైకి పలిపించి, స్థానిక టీ.నగర్‌లోని ఒక ఏరియాలో కలిశారు. వారందరిని సేవా కార్యక్రమాలకు గానూ ఎంతగానో అభినందించారు. అందరికీ ప్రశంసా పత్రాలను అందించి, వారితో ఫొటోలు దిగి ఖుషీ పరిచారు. అంతే కాకుండా మంచి పసందైన విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్తీ మాట్లాడుతూ అభిమానులందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాలను నిర్వహించిన వారందరినీ కలుసుకోవాలని భావించానని, అయితే అనారోగ్యం కారణంగా అందులో పాల్గొనలేకపోయానని పేర్కొన్నారు. వచ్చే పుట్టిన రోజున కచ్చితంగా మీతో కలిసి పాల్గొంటానని మాట ఇచ్చారు. ప్రస్తుతం తాను రెండు చిత్రాలను చేసి సర్దార్ -2 చిత్రంలో నటిస్తున్నాని చెప్పారు. అదేవిధంగా వచ్చే ఏడాది లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో బిరియాని తినడానికి (ఖైదీ 2 చిత్రంలో నటించడానికి) సిద్ధం అవుతున్నానని కార్తీ అభిమానులకు చెప్పారు.

సంతోషాన్ని రేపటికి వాయిదా వేయకూడదు



బన్ బట్టర్ జామ్ చిత్రం యూనిట్

తమిళసినిమా: రెయిన్ ఆఫ్ ఆరోస్ పతాకంపై సురేష్ సుబ్రమణియన్ నిర్మిస్తున్న చిత్రం బన్ బట్టర్ జామ్. రాఘవ్ మిర్థాత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ద్వారా బిగ్‌బాస్ సీజన్ 5లో విన్నర్‌గా నిలిచిన రాజు జయమోహన్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. నటి ఆద్యప్రసాద్, భవ్య త్రిక్కా నాయికలుగా నటిస్తున్న ఇందులో నటుడు చార్లీ, శరణ్యా పొన్వన్నన్, దేవదర్శిణి, మైకెల్ తంగదురై, వీజే పప్పు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బాబు ఛాయాగ్రహణం, నివాస్ కే.ప్రసన్న సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం చిత్రం పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు రాఘవ్ మాట్లాడుతూ సాధారణంగా చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సినీ ప్రముఖుల సమక్షంలో విడుదల చేస్తుంటారన్నారు. అయితే తన తొలి చిత్రానికి పత్రికల వారు అందించిన ఆదరణ కారణంగా వారి సమక్షంలోనే ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయాలన్న కోరికను నిర్మాత వద్ద వ్యక్తం చేయగా ఆయన వెంటనే ఓకే చెప్పారన్నారు. ఇలాంటి నిర్మాత ఉంటే మనం అనుకున్నది అనుకున్నట్లుగా చిత్రాన్ని తెరపై ఆవిష్కరించవచ్చు అన్నట్లుగా సినిమాపై ఆసక్తి కలిగిన ఈ చిత్ర నిర్మాత తనకు అవసరం అయిన అన్నింటినీ సమకూర్చారన్నారు. ఈ నిర్మాతను తనకు పరిచయం చేసింది, కథానాయకుడు రాజును ఈ చిత్రంలోకి తీసుకువచ్చింది మిత్రుడు సతీష్ అని దర్శకుడు పేర్కొన్నారు. చిత్రం కథను రెండు గంటల పాటు విన్న నటుడు రాజు వెంటనే నటించడానికి అంగీకరించినట్లు చెప్పారు. మనం పలు సమస్యల కారణంగా జీవితాన్ని సరిగ్గా అనుభవించలేకపోతామన్నారు. రేపు చూద్దాంలే అని వాయిదా వేస్తుంటామన్నారు. అయితే ఒక రోజు రేపు అన్నదే లేకుండా పోతుందన్నారు. అందుకే ఆయా సమయాల్లో సంతోషాన్ని అప్పుడే అనుభవించాలని చేప్పే కథా చిత్రంగా బన్ బట్టర్ జామ్ ఉంటుందన్నారు. నటి ఆద్య ప్రసాద్ మాట్లాడుతూ దర్శకుడు చెప్పిన కథ తన జీవితానికి కనెక్ట్ అవడంతో వెంటనే నటించడానికి ఒకే చెప్పానన్నారు. కథానాయకుడు రాజు మాట్లాడుతూ మన ఇంటి సమీపంలో ఉన్న థియేటర్‌కే అనుకున్న సమయానికి వెళ్లలేమన్నారు. అలాంటిది ఒక చిత్రాన్ని థియేటర్ వరకూ తీసుకెళ్లడానికి ఎంత ఆలస్యం అవుతుందీ అని ఆలోచిస్తే తమ చిత్ర నిర్మాణా కార్యక్రమాలు కొంచెం వేగంగానే జరిగాయనే భావన తనకు కలిగిందన్నారు. అవకాశాల కోసం కంపెనీల చుట్టూ తిరుగుతున్న తరుణంలో బిగ్ బాస్ తనకో విజయాన్ని అందించిందన్నారు. ఆ తరువాత దర్శకులు కథలు చెప్పడం ప్రారంభించారని చెప్పారు. అలా వచ్చిన చిత్రమే బన్ బట్టర్ జామ్ అని చెప్పారు. ఈ చిత్రం అందరికీ నచ్చుతుందనే అభిప్రాయాన్ని నటుడు రాజు వ్యక్తం చేశారు.



కామెడీ కథా పాత్రల్లో నటించాలని ఉంది

తమిళసినిమా: నటి సాయిపల్లవి ఈ పేరు నటనకు, డాన్స్‌కు చిరునామా అని పేర్కొనవచ్చు. మలయాళంలో ప్రేమమ్ అనే చిత్రంలో టీజర్‌గా నటించి అందరి ప్రశంసలు అందుకున్న అచ్చ తమిళ నటి సాయి పల్లవి. ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో పలు చిత్రాల్లో కథానాయకిగా నటించి మంచి పేరు తెచ్చుకున్న ఈమె వచ్చిన అవకాశాలన్నీ ఒప్పేసుకోకుండా, పాత్ర నచ్చితేనే నటించడానికి అంగీకరిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం తమిళంలో కమలహాసన్ తన రాజ్‌కమల్ ఫిలింస్ పతాకంపై శివకార్తికేయన్ హీరోగా నిర్మిస్తున్న అమరన్ చిత్రంలో నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. అలాగే తెలుగులో నాగచైతన్య సరసన ఒక చిత్రం చేస్తున్న సాయిపల్లవి బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అక్కడ రామయణం చిత్రంలో సీతగా నటిస్తున్నారు. కాగా ఇటీవల ఒక భేటీలో సాయి పల్లవి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ వివిధ భాషల్లో రకరకాల పాత్రలు పోషించానన్నారు. ముఖ్యంగా తెలుగులో ఫిదా, లవ్‌స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాటపర్వం వంటి చిత్రాల్లో నటనకు అవకాశం ఉన్న పాత్రల్లో నటించానని చెప్పారు. అయితే వాటన్నింటి కంటే విభిన్నమైన కామెడీ కథా పాత్రలో నటించాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాంటి చిత్రంలో అవకాశం వస్తే భాషా బేధం లేకుండా నటించడానికి రెడీ అని నటి సాయిపల్లవి పేర్కొన్నారు.

క్లుప్తంగా

పొలంలో అకస్మాత్తుగా గుంత

– ఆశ్చర్యంతో చూస్తున్న గ్రామస్తులు



పొలంలో ఏర్పడిన గుంత

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని పొలంలో ఉన్న ఫళంగా గుంత ఏర్పడటంతో గ్రామస్తులు ఆశ్చర్యంగా చూస్తున్నారు. తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని అచ్చమంగళం గ్రామంలో గత మే నెలలో పెద్ద పేలుడు జరగడంతో గంత ఏర్పడిన విషయం తెలిసిందే. ఆ గుంతలో అగ్గి, బూడిద ఉండడంతో వాటిని సేకరించిన అధికారులు తనిఖీ చేసేందుకు చెన్నైకి తీసుకెళ్లారు. ఆ ప్రాంతంలో గుర్తు తెలియని వస్తువు పడడంతోనే పెద్ద గుంత ఏర్పడిందని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ఆంబూరు సమీపంలోని వీరాంకుప్పం గ్రామంలో ఇక్బాల్ అనే వ్యక్తి పొలంలో ఉన్న ఫళంగా పెద్ద గుంత ఏర్పడింది. ఈ గుంత సుమారు పది అడుగుల లోతులో ఉండడంతో దీన్ని చూసిన ఇక్బాల్ రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశాడు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఈ ప్రాంతంలో ఎవరైనా గుప్త నిధుల కోసం తవ్వారా? లేక భూప్రకంపనలు ఏర్పడ్డాయా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. అనంతరం ఈ ప్రాంతం వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలని ముఖ్యంగా మేకలు, పశువుల కాపరులు వెళ్లకుండా చూడాలని గ్రామ పరిపాలన అధికారికి తెలిపారు.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి మృతి

తిరువొత్తియూరు: పలవంతాంగల్‌కు ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందాడు. పలవంతాంగల్ ప్రాంతానికి చెందిన మోహన రంగం (43) ఓ ప్రైవేట్ కార్ సర్వీస్ కంపెనీలో పని చేస్తున్నాడు. కల్పాక్కం సమీపంలో ఉన్న కున్నత్తూరులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. మోహనరంగం అక్కడ వున్న స్విమ్మింగ్ పూల్‌లో స్నానం చేస్తున్న సమయంలో అతను అకస్మాత్తుగా నీటిలో మునిగి పోయాడు. స్నేహితులు అతడిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మోహన రంగం మృతి చెందినట్టు తెలిపారు. ఈ విషయమై చదరంగం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోహన రంగం స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందడం పోలీసులకు అనుమానం కలిగించింది. ఈ విషయమై పోలీసులు హాస్టల్ నిర్వాహకులను, వారితో పాటు ఉంటున్న స్నేహితులను విచారిస్తున్నారు.

స్పృహతప్పి పడి డ్రైవర్..

తిరువొత్తియూరు: స్పృహతప్పి పడి, ఓ డ్రైవర్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆరల్వాయిమొళి మూవేందర్ నగర్‌కు చెందిన కృష్ణ కుమార్ కుమారుడు సతీశ్వరన్ (37) చెన్నైలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య మణిమేగలై, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఊరికి వచ్చి ఉన్న సతీశ్వరన్ మంగళవారం ఉదయం ఇంట్లో టీ తాగుతున్న సమయంలో స్పృహతప్పి పడిపోయాడు. బంధువులు వెంటనే అంబులెన్స్ కోసం 108కి ఫోన్ చేశారు. నిర్ణీత సమయానికి రాకపోవడంతో ఆటోలో సతీశ్వరన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. మార్గం మధ్యలో ఎదురు వచ్చిన 108 అంబులెన్స్‌లో సేన్బగ రామన్‌పుదూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తున్న సమయంలో సతీశ్వరన్ మృతి చెందాడు. ఇది అతని బంధువులలో కలకలం రేపింది. 108 అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యమే సతీశ్వరన్ ప్రాణాలు తీసిందని వారు ఆరోపించారు. స్పృహతప్పి పడిపోయినప్పుడు 108కి ఫోన్ చేసి సమయంలో రాలేదని అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే సతీశ్వరన్ మృతి చెందారని, సకాలంలో ఆస్పత్రికి తరలించి ఉంటే బతికేవారని జిల్లా కలెక్టర్, ఆరోగ్యశాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

ఆడిటర్ ఇంట్లో 235 సవర్ల నగల దోపిడీ

– ముగ్గురి అరెస్టు

అన్నానగర్: ఈరోడ్‌లోని ఆడిటర్ ఇంట్లో 235 సవర్ల నగలు, రూ.48 లక్షలు దోచుకెళ్లిన ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈరోడ్ సూరంపట్టి, ఎన్.జి.జి.ఓ కాలనీ, ఏడో వీధికి చెందిన సుబ్రమణి (69). ఇతని భార్య సాధన. వీరిద్దరూ తేనిలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహ శుభకార్యానికి వెళ్లగా, ఆ సమయంలో ఇంట్లోకి చొరబడిన దుండగులు 235 తులాల నగలు, రూ. 48 లక్షల నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ చోరీలో బెంగళూరుకు చెందిన ఓ మాజీ ఖైదీ హస్తం ఉన్నట్లు తేలింది. పోలీసులు అతని కోసం వెతికారు. అలాగే చోరీలో సహాయకుడిగా అరుణ్ కుమార్ (36) ఉన్నట్లుగాను, ఇతను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని నిర్ధారించారు. అతడిని విచారించగా ఆడిటర్ డ్రైవర్ విఘ్నేష్ (24), సత్యన్ (34) దొంగతనానికి సహకరించినట్లు తేలింది. అనంతరం మంగళవారం పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి విచారణ కొనసాగించారు. వీరిచ్చిన సమాచారం మేరకు బెంగళూరులో 90 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసి పరారీలో ఉన్నాడు. కాగా అరెస్టు చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

'కంచి'కి చేరేనా!

- మేయర్‌పై అవిశ్వాస తీర్మానికి పట్టు
- కలెక్టర్‌తో డీఎంకే కార్పొరేటర్ల భేటీ
- 29న బల పరీక్ష



కంచి కార్పొరేషన్ కార్యాలయం. మేయర్ మహాలక్ష్మి (ఇన్‌సెట్)

సాక్షి,చెన్నై : కాంచీపురం కార్పొరేషన్‌లో డీఎంకే కార్పొరేటర్ల మధ్య వివాదం ముదిరింది. మేయర్ మహాలక్ష్మి యువరాజ్‌కు వ్యతిరేకంగా తిరుగుబావుట ఎగుర వేసిన కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్‌ను కలిసి కార్పొరేషన్ మేయర్, కమిషనర్ తీరుపై ఫిర్యాదు చేశారు.

కాంచీపురం మునిసిపల్ కార్పొరేషన్‌లో 51 వార్డులున్నాయి. ఇందులో 35 మంది డీఎంకే కార్పొరేటర్లు ఉన్నారు. డీఎంకేకు చెందిన మహాలక్ష్మి యువరాజ్ మేయర్‌గా ఉన్నారు. ఈమె తమ పనులను అడ్డుకుంటున్నారని, వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని డీఎంకే కార్పొరేటర్లు ఆరోపిస్తూ వచ్చారు. వార్డులో తాము తిరగలేని పరిస్థితి ఉందని, మేయర్ చర్యలు పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాయని పేర్కొంటూ, ఆమెను తప్పించాలని ఇప్పటికే పలు మార్లు డీఎంకే అధిష్టానికి కార్పొరేటర్లు ఫిర్యాదులు చేశారు. అయినా ఫలితం శూన్యం. దీంతో డీఎంకే కార్పొరేటర్లు తిరుగుబాటు ధోరణితో గత నెల రోజులుగా ముందుకు సాగుతూ వస్తున్నారు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. అయితే, ఆయన మౌనం వహిస్తూ రావడం కార్పొరేటర్లలో ఆగ్రహాన్ని రేపింది. 33 మంది కార్పొరేటర్లు మంగళవారం ఉదయం కలెక్టర్ కలైసెల్వి మోహన్‌ను కలిశారు. పాలక మండలి సమావేశం నిర్వహణ చర్యలకు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కమిషనర్ తీరును కలెక్టర్‌కు వివరించారు. కమిషనర్‌కు బదులుగా మరొకరిని నియమించాలని, పాలక మండలి సమావేశానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు అందజేసి, ఉన్నామని, తక్షణం సమావేశం ముందు తీర్మానాన్ని ఉంచాలని పట్టుబట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలో కంచి డీఎంకే రాజకీయాలు వెడ్కెక్కాయి. ఇప్పటికే కార్పొరేటర్లను మంత్రి కేఎన్ నెహ్రూ పిలిచి మాట్లాడినా ఫలితం శూన్యం. ఈ సమయంలో అవిశ్వాస తీర్మానం నోటీసు ఎలాంటి వివాదాలకు దారి తీయనున్నా, కంచి డీఎంకే రాజకీయాలను ఎక్కడికి చేర్చేనో అన్నది వేచి చూడాల్సిందే. అదే సమయంలో గత వారం డీఎంకేకు చెందిన కోయంబత్తూరు, తిరునల్వేలి మేయర్లకు వ్యతిరేకంగా ఆ పార్టీ కార్పొరేటర్లు తిరుగు బావుట ఎగరవేయడం, వారు రాజీనామా చేయాల్సిన పరిస్థితి రావడం గమనార్హం. అదే సమయంలో కాంచీపురం కార్పొరేషన్ పాలక మండలి సమావేశం నిర్వహణకు ఎట్టకేలకు కమిషనర్ నిర్ణయం తీసుకుంటూ సాయంత్రం ప్రకటన చేశారు. ఈనెల 29వ తేదీన కాంచీపురం పాలక మండలి సమావేశం జరుగుతుందని, ఇందులో మేయర్ తన బలాన్ని నిరూపించుకోవాలని ప్రకటించారు.

వందశాతం సారా రహిత జిల్లాకు చర్యలు



గుడియాత్తం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ మణివన్నన్

వేలూరు: జిల్లాను వందశాతం సారారహిత జిల్లాగా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ మణివన్నన్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం ఉదయం వేలూరు జిల్లా గుడియాత్తం పోలీస్ స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండేళ్లలో పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులపై వివరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులపై సత్వర న్యాయం చేసేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో అధికంగా ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు వడ్డీలకు అప్పులిచ్చి ప్రజలను అప్పులు పాలు చేయడంతోపాటు అప్పులు చెల్లించకుంటే బెదిరిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా వేలూరు జిల్లా ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో సారా చిత్తూరు జిల్లా సరిహద్దులో విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, అయితే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టి వందశాతం సారా రహితంగా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే గంజాయి, గుట్కా తదితర నిషేధిత పదార్థాలను కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి తరలిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో వీటి కోసం ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా ఉంచుతున్నామన్నారు. పాత నేరస్తులు, రౌడీలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఆయన వెంట డీఎస్పీ రవిచంద్రన్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

న్యాయవాదుల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తిరువళ్లూరు: నూతన న్యాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ కోర్టును బహిష్కరించి న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి కోర్డినేటర్లు ఎస్కే ఆధామ్, రామ్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కొత్త చట్టాలు, చట్టాల పేరు మార్పులను చేసి, పార్లమెంట్‌లో ఆమోదించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలను వెంటనే వెనుక్కి తీసుకోవాలన్నారు. భారతీయ శిక్షాచట్టం, నేరశాస్త్ర ఆచరణ చట్టం, సాక్షులకు సంబంధించిన చట్టాలను భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షిత సన్హిత్, భారత్ సాక్షాత్తు చట్టాలుగా మార్చడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదుల సంఘం నేతలు సెంథిల్‌కుమార్, సురేష్, జార్జ్‌ముల్లర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంను బదిలీ చేయొద్దని రాస్తారోకో



విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చిస్తున్న విద్యాశాఖ అధికారులు

వేలూరు: జిల్లాలోని చిన్నఅల్లాపురంలో కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సెంథిల్‌కుమారను బదిలీ చేయవద్దని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు రాస్తారోకో చేశారు. చిన్నఅల్లాపురం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సెంథిల్‌కుమార్‌ను సోమవారం జరిగిన హెచ్‌ఎంల కౌన్సెలింగ్‌లో వేరే జిల్లాకు బదిలీ చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు మంగళవారం ఉదయం పాఠశాల ఎదుట చేరుకుని హెచ్‌ఎం బదిలీని ఆపివేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రోడ్డుపైకి చేరుకొని ధర్నా చేయడంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు, విద్యాశాఖాధికారి దయాళన్, తహసీల్దార్ మురళీధరన్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చలు జరిపారు. హెచ్‌ఎంను బదిలీ చేస్తే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తల్లిదండ్రులు తెలపడంతో అధికారులు వారితో చర్చలు జరిపి రాస్తారోకోను విరమింప జేశారు.

ఆకట్టుకున్న స్వాతంత్య్ర యోధుల ఫొటో ప్రదర్శన



కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

తిరువళ్లూరు: స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని అమరులైన వారి ఫొటోలను తిరువళ్లూరు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేయడం అందరినీ ఆకర్షించింది. స్వాతంత్య్ర పోరాటం సమయంలో తిరువళ్లూరు, పొన్నేరి, సెంగుండ్రం, తిరునిండ్రవూర్, పూందమల్లి, తిరుత్తణి, ఆర్కేపేటతో పాటు పలు ప్రాంతాలకు చెందిన వీరులు పాల్గొన్నారు. వీరికి స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సన్మానం సైతం నిర్వహించేవారు. కాగా స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న వారిని స్మరించుకునేలా ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుమారు 50 మంది ఫొటోలను కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు.

వంట మనిషి సస్పెన్షన్

తిరువొత్తియూరు: పొన్నగరం సమీపంలో ఇంట్లో స్కాన్ పరికరం ద్వారా లింగనిర్ధారణ చేసే బృందానికి మధ్యవర్తిగా వ్యవహరించిన పౌష్టికాహారం కేంద్రం వంట మనిషిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శాంతి ఆదేశాలు జారీ చేశారు. ధర్మపురి జిల్లా పొన్నగరం సమీపంలో నెర్కురింద ముత్తప్పనగర్ నివాసి లలిత(47) నడపనఅల్లి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లోని పౌష్టికాహారం సెంటర్‌లో వంట మనిషిగా పని చేస్తున్నారు. గర్భిణులకు పుట్టబోయే బిడ్డ లింగనిర్ధారణ చెప్పే స్కానింగ్ మిషన్‌ను ఇంట్లోనే అమర్చుకుని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు ఆరోగ్య సేవ, గ్రామీణ సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శాంతికి ఫిర్యాదు అందింది. అనంతరం గత 28వ తేదీన వైద్య శాఖ బృందం లలిత ఇంట్లో సోదాలు చేశారు. ఆ సమయంలో ఇంట్లోని ఓ గదిలో అనుమతి లేకుండా స్కానింగ్ పరికరం ద్వారా లింగ నిర్ధారణ పరీక్ష చే స్తున్నట్టు తెలిసింది. ఒక్కొక్కరి నుంచి రూ.13 వేలు ఫీజు తీసుకుంటున్నట్టు తెలిసింది. అనంతరం కళ్లకురిచ్చికి చెందిన స్కాన్ సెంటర్‌లో పనిచేస్తున్న మురుగేషన్, చిన్నరాజ్, లలితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ధర్మపురి కలెక్టర్ శాంతి, కడుపులోని బిడ్డ లింగాన్ని తెలుసుకునే బృందానికి మధ్యవర్తిగా వ్యవహరించిన పౌష్టికాహారం సెంటర్ వంట మనిషి లలితను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కొరుక్కుపేట: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తమిళనాడు సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరించారు. సైబర్ మోసగాళ్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ పేరును ఉపయోగించి, వివిధ రకాల రివార్డ్ పాయింట్ల గురించి వాట్సాప్ ద్వారా తప్పుడు సందేశాలు పంపుతున్నారని తెలిపారు. హ్యాకర్లు ఈ గ్రూపుల చిహ్నాల పేర్లను కూడా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకిగా మారుస్తున్నారన్నారు. రివార్డ్ పాయింట్లను క్లెయిమ్ చేసే లింక్‌లపై స్పందించవద్దని, దీంతో ఆర్థిక నష్టం జరగవచ్చని హెచ్చరించారు. కొన్ని నెలలుగా తమిళనాడులో జరిగిన ఈ మోసాలకు సంబంధించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్ట్ పోర్టల్‌లో 73 సైబర్ ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

అన్నానగర్: పల్లావరం సమీపంలోని ఓ ప్లాస్టిక్ గోడౌన్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో గోడౌన్‌లో ఉన్న 20 మందికి పైగా కార్మికులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాలతో బయటపడ్డారు. పల్లావరం పక్కనే ఉన్న తిరునీర్మలై ఒయ్యాళి అమ్మన్ కోయిల్ వీధిలో సురేష్, జయరాజ్‌కు చెందిన ప్లాస్టిక్ గోడౌన్ ఉంది. రీసైక్లింగ్ కోసం పాత ప్లాస్టిక్ పదార్థాలను సేకరించేందుకు ఈ గోడౌన్ ఉపయోగిస్తారు. ఇక్కడ 20 మందికి పైగా ఉత్తర రాష్ట్ర కార్మికులు పని చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో గోడౌన్‌లో మంటలు రేగాయి. దీంతో అక్కడే ఉన్న ఉత్తర రాష్ట్ర కార్మికులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. ఇరుగుపొరుగు వారు నీళ్ల పోసి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపుకాకపోవడంతో తాంబరం ఫైర్ అండ్ రెస్క్యూ టీంకు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే ప్లాస్టిక్ గోడౌన్, అందులో రూ.లక్షల విలువ గల వస్తువులు కాలి పోయాయి. దీనిపై శంకర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్

కొరుక్కుపేట: హోసూరు సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారిని కిడ్నాప్ చేసి, రూ.20 లక్షలు డిమాండ్ చేసిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు వెంబడించి అరెస్టు చేశారు. కృష్ణగిరి జిల్లా హోసూరు తాలూకాలోని మత్తిగిరి సమీపంలోని నవతిభక్తికి చెందిన బీరేష్ (34) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు, బీరేష్ 7వ తేదీన ఒంటరిగా కారులో బెంగళూరు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటి దగ్గర కారు పార్క్ చేసి చూడగా బీరేష్ కనిపించలేదు. అలాగే అతని సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దీనిపై అతని భార్య రేణుక(30) మత్తిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహన తనిఖీ స్టేషన్‌లో పోలీసులు బిజీబిజీగా ఉన్న సమయంలో అటుగా ఓ కారు వచ్చింది. కారు ఆపేందుకు ప్రయత్నించగా కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. వెంటనే పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. తర్వాత కారులో తనిఖీ చేయగా బీరేష్ ఉన్నాడు. అనంతరం, సతీష్ (32), మురళి (36), మదివానన్ (33), అమిల్దాస్ (28)పార్థసారథి (32) కలసి రియల్ ఎస్టేట్ వ్యాపారి బీరేష్‌ను కిడ్నాప్ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి బీరేష్‌ను రక్షించారు. అరెస్టయిన వారిలో మురళి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రాజేంద్రన్, మదివానన్, అమిల్దాస్ కూలీ పనులు చేస్తున్నారు. పార్థసారథి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. బీరేష్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని, డబ్బు ఎక్కువగా ఉందనే కారణంతో అతడిని కారులో కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని బెదిరించాడని పోలీసులు జరిపిన విచారణలో తేలింది.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట బైఠాయింపు



తిరుత్తణి ఆర్డీఓ కార్యాలయంలో బైఠాయించిన కొండజాతి ప్రజలు

తిరుత్తణి: ఉచిత ఇళ్ల పట్టాలు, కనీస సదుపాయాలు కల్పనలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ కొండజాతి ప్రజలు కుటుంబాలతో తిరుత్తణి ఆర్డీఓ కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తిరుత్తణి, ఆర్కేపేట యూనియన్‌లోని 30కి పైబడిన గ్రామాల్లో తమ తెగకు చెందిన కుటుంబాలు నివాసముంటున్నాయన్నారు. తాము నివాసముంటున్న ఇళ్లకు ఉచిత ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. తాగునీరు, రోడ్లు, విద్యుదీపాలు, ప్రభుత్వ సహాయకాలు అందేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గతంలో తహసీల్దార్, ఆర్డీఓకు పలుసార్లు వినతిపత్రం అందజేశామన్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆర్డీఓ దీప, తహసీల్దార్ మదియళగన్ తదితరులు కొండజాతి ప్రజల సంఘం ప్రతినిధులతో మాట్లాడి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

సభాహక్కుల నోటీసు రద్దు తగదు

- హైకోర్టు వ్యాఖ్య



సాక్షి, చెన్నై: సభా హక్కుల ఉల్లంఘన నోటీసు రద్దు ఆమోద యోగ్యం కాదని హైకోర్టు న్యాయమూర్తి ఎస్ఎం సుబ్రమణియన్ స్పష్టం చేశారు. 2017లో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ వేదికగా గుట్కా విక్రయాలకు లంచం వ్యవహారం పెద్ద దుమారానికి దారి తీసింది. యథేచ్ఛగా గుట్కా లభిస్తుందని చాటే విధంగా ఆ ప్యాకెట్లను అప్పటి ప్రధాన ప్రతిపక్షం నేత స్టాలిన్‌తోపాటు డీఎంకే ఎమ్మెల్యేలు సభకు తీసుకు రావడం వివాదానికి దారి తీసింది. స్టాలిన్‌తో పాటు 18 మందిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ అయ్యాయి. దీనిని వ్యతిరేకిస్తూ డీఎంకే సభ్యులు కోర్టుకు వెళ్లారు. కొంతకాలం జరిగిన విచారణతో నోటీసును కోర్టు రద్దు చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ అప్పటి అన్నాడీఎంకే పాలకులు హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లారు. ఈ పిటిషన్ విచారణ నేటికీ జరుగుతోంది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన డీఎంకే ఈ నోటీసు వ్యవహారంగా కోర్టులో ఉన్న పిటిషన్ విచారణకు ముగింపు పలికే ప్రయత్నాలు చేసింది. నోటీసు వ్యవహారం వెనక్కి తీసుకుంటున్నట్టు కోర్టుకు వివరించారు. అయితే దీనిని కోర్టు పరిగణించక పోగా, వాడీవేడిగా వాదనలు విచారణ సమయంలో జరుగుతూ వచ్చింది. మంగళవారం పిటిషన్ తుది విచారణ జరగ్గా, ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది పీఎస్ రామన్ హాజరై వాదనలు వినిపించారు. అసెంబ్లీ వ్యవహారాలలో కోర్టు జోక్యం చేసుకునేందుకు వీలు లేదని, ఇది స్పీకర్ నిర్ణయం అని వాదనలు వినిపించారు. ఈ సమయంలో సభా హక్కుల నోటీసు రద్దు ఆమోద యోగ్యం కాదని, కోర్టు, అసెంబ్లీ వేర్వేరైనా వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదా? అన్న ప్రశ్నలను న్యాయమూర్తి సంధించారు. చివరకు వాదనలు ముగించి తీర్పు తేదీని ప్రకటించకుండా వాయిదా వేశారు. గతంలో ఎప్పుడో జరిగిన వ్యవహారం ప్రస్తుతం మళ్లీ కోర్టులో వాడీవేడిగా వాదనలతో సాగడం డీఎంకే వర్గాలను విస్మయంలో పడేసింది. ఈ వ్యవహారంలో ఎలాంటి తీర్పు వస్తుందో అనే టెన్షన్ ఆపార్టీ వర్గాల్లో నెలకొంది.

దారి మూసివేతతో ఆందోళన



వీధికి అడ్డంగా నాటిన రాతి స్తంభాలు

తిరుత్తణి: వీధి మూసివేస్తూ రాతి స్తంభాలు నాటడంతో కేజీ.కండ్రిగలో కలకలం రేపింది. తిరుత్తణి యూనియన్ కేజీ.కండ్రిగ గ్రామంలో కేవీఎన్ కండ్రిగకు వెళ్లే వీధిలో 50కు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ వీధిలో 20 ఏళ్ల కిందట తారు రోడ్డు వేసి, డ్రైనేజీ సైతం పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించారు. ఆ దారిలో కేవీఎన్ కండ్రిగ, కేజీ కండ్రిగ ప్రజలు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఉమ అనే మహిళ వీధి తమ ఆధీనంలో ఉందని, ఆ దారిలో ఎవరూ వెళ్లి రాకూడదని, మంగళవారం ఉదయం వీధికి రెండు వైపులా రాతి స్తంభాలు నాటి రాకపోకలకు నిషేధించారు. దీంతో ఆ ప్రాంతంలోని కుటుంబాల సభ్యులు వచ్చి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడ్డారు. ఆ ప్రాంతం వాసులు ఫిర్యాదుతో వీఆర్వో వినోత్, పంచాయతీ సర్పంచ్ సౌమ్య తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని పంచాయతీ రోడ్డు మూసివేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఉపయోగిస్తున్న రోడ్డును తమదిగా చెప్పుకోవడం ఏమిటని, 20 ఏళ్లుగా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఏమైనా వుంటే కోర్టుకు వెళ్లి చూసుకోవాలని చెప్పి రోడ్డుకు ఇరు వైపులా ఏర్పాటు చేసిన రాతి స్తంభాలు తొలగించడంతో ఆ ప్రాంతం వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

అన్నానగర్: తాంబరం సమీపంలో మంగళవారం ప్రభుత్వ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. చెన్నై సమీపంలోని క్రోంపేటలోని కాకన్నవాడి ప్రాంతానికి చెందిన ఇసకియమ్మాళ్ (80) పూల వ్యాపారం చేస్తుంది. మంగళవారం ఉదయం యథావిధిగా తాంబరం మార్కెట్‌లో పూలు కొనుగోలు చేసేందుకు శానిటోరియం ప్రాంతంలోని ప్రభుత్వ క్షయ ఆస్పత్రి వద్ద జీఎస్‌టీ రోడ్డు దాటేందుకు ప్రయత్నించింది. అప్పుడు తాంబరం వర్క్‌సైట్ నుంచి చెంగల్పట్టు వెళుతున్న ప్రభుత్వ బస్సు వృద్ధురాలిని ఢీ కొంది. ఇసక్కియమ్మాళ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. క్రోమ్‌పేట ట్రాఫిక్ ఇన్వెస్టిగేషన్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్వేయర్ బెల్టులో చిక్కుకుని ఎన్ఎల్‌సీ కార్మికుడు..

అన్నానగర్: కన్వేయర్ బెల్ట్‌లో చిక్కుకుని ఎన్ఎల్‌సీ కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కడలూరు జిల్లా నైవేలి సమీపంలోని పుదియ ప్రసనపట్టు గ్రామానికి చెందిన వ్యక్తి అన్బళగన్ (51) నైవేలి ఎన్ఎల్‌సీ ఇంకోసర్వ్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య కవిత, ఇవద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం ఉదయం యథావిధిగా అన్బళగన్ ఎన్ఎల్‌సీలో పనికి వెళ్లాడు. రెండో బొగ్గుగనిలో మట్టి తరలింపు యంత్రం నిర్వహణలో ఆయన పాల్గొన్నారు. ఆ సమయంలో కన్వేయర్ బెల్ట్‌కు చిక్కుకుని సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అ తని కుటుంబ సభ్యులు, బంధువులు, ఎన్ఎల్‌సీ సా రంగం రెండో ప్రవేశ ద్వారం ముందు గుమిగూడి నిరసనకు దిగారు. అనంతరం ఎన్ఎల్‌సీ అధికారులు మా ట్లాడుతూ అన్బళగన్ కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం, తగిన పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అంగీకరించి నిరసనను విరమించారు.

యువకుడు దారుణ హత్య

అన్నానగర్: తంజావూరులో హత్య కేసులో బెయిల్‌పై వచ్చిన యువకుడిని మంగళవారం నడిరోడ్డులో నరికి చంపారు. తంజావూరు సమీపంలోని కలిమేడు గ్రామానికి చెందిన శ్రీరామ్ (22) మెడికల్ కాలేజీ రోడ్డు మంగళాపురంలోని జిగర్తాండ దుకాణంలో పనిచేసేవాడు. సోమవారం రాత్రి షాపులో పనిచేస్తున్న సమయంలో మూడు బైకుల్లో వచ్చిన ఆరుగురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దుకాణం ముందుకు వచ్చారు. వారిని చూసిన శ్రీరామ్ షాపు నుంచి బయటకు వచ్చి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అయితే ఆ వ్యక్తులు అతన్ని వెంబడించి నడిరోడ్డుపై నరికారు. దీంతో శ్రీరామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. అనంతరం శ్రీరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తంజావూరు మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. విచారణలో తంజావూరు సమీపంలోని మాథాకోటకు చెందిన ప్రిన్స్ లారెన్స్ (28) 2022లో తిరుకనూర్‌పట్టిలో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో పోలీసులు శ్రీరామ్, దొరను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఈ స్థితిలో 2 నెలల క్రితం శ్రీరామ్ బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి జిగర్‌దండా దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి ఓ మిస్టరీ ముఠా అతడిని నరికి చంపింది. ప్రిన్స్ లారెన్స్ హత్యకు ప్రతికారంగా శ్రీరామ్‌ను హత్య చేశారా? లేక హత్యకు మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం తీసుకోవడానికి నిరాకరణ

తిరువళ్లూరు: ఆక్రమణల పేరిట ఇంటిని తొలగించడంతో ఆత్మహత్యకు పాల్పడిన రాజ్‌కుమార్ మృతదేహాన్ని తీసుకోవడానికి కుటుంబ సభ్యులు నిరాకరించారు. తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని స్పష్టం చేసి, ఆందోళన కొనసాగిస్తున్నారు. దీంతో కలెక్టర్ వారితో చర్చలకు ముందుకు వచ్చారు. సుమారు రెండు గంటల పాటు మృతుడి బంధువులతో కలెక్టర్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. తిరువళ్లూరు జిల్లాలోని కోట్టకరై గ్రామంలో బర్మా నుంచి స్థిరపడిన కల్యాణి తన ఇద్దరు కొడుకులతో కలిసి నివాసం ఉంటున్న ఇంటిని గతవారం అధికారులు తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె చిన్న కొడుకు రాజ్‌కుమార్ తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని అధికారుల ముందే ఆత్మాహుతికి యత్నించాడు. తీవ్ర గాయాల పాలైన రాజ్‌కుమార్‌ను అధికారులు, బంధువులు చికిత్స కోసం చెన్నై వైద్యశాలకు తరలించారు. అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం రాజ్‌కుమార్ మృతి చెందాడు. కాగా మృతి చెందిన రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకోవడానికి నిరాకరించి అప్పటి నుంచి ఆందోళన నిర్వహిస్తున్నారు. తమను వేధింపులకు గురి చేసి రాజ్‌కుమార్ ఆత్మహత్యకు యత్నించిన అధికారులు, పంచాయతీ అధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్‌కుమార్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ప్రత్యామ్నయంగా ఇంటి స్థలం కేటాయించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. దీంతో రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులను కలెక్టర్ చర్చలకు పిలిచారు. మృతుడి భార్య, తల్లి, సోదరుడి వచ్చిన బాధితులు కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లను కలెక్టర్ ముందు ఉంచారు. అయితే కలెక్టర్ మాత్రం తక్షణ సాయం కింద రూ.లక్ష ఇస్తామన్నారు. ప్రత్యామ్నయ ఇంటి స్థలం, మృతుడి భార్య ప్రభుత్వ ఉద్యోగం లాంటి సమస్యలను భవిషత్తులో పరిష్కరిస్తామని, ముందుగా మృతదేహాన్ని తీసుకుని అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. అయితే రాజ్‌కుమార్ బంధువులు తమకు తక్షణం అన్ని సమస్యలను పరిష్కరించడంతో పాటు తహసీల్దార్, ఆర్ఐ, వీఏలను విధుల నుంచి తొలగించి అరెస్టు చేయాలని పట్టుబట్టారు. ఇందుకు కలెక్టర్ అంగీకరించపోవడంతో చర్చల నుంచి బాధితులు అర్ధాంతరంగా బయటకు వచ్చారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని, మృతదేహాన్ని తీసుకోబోమని తేల్చిచెప్పారు. తమ ఇంటిని కూల్చేశారని, తాము మృతదేహాన్ని తీసుకుంటే ఎక్కడ ఉంచాలని ప్రశ్నించారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో తాను కూడా ఆత్మహత్య చేసుకుంటానని మృతుడి తల్లి హెచ్చరించారు. కాగా తమ డిమాండ్‌లను పరిష్కరించే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బాధితులు స్పష్టం చేశారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టాస్మాక్ ఉద్యోగికి పసిడి పతకం

కొరుక్కుపేట: జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టాస్మాక్ ఉద్యోగికి పసిడి పతకం వచ్చింది. రాజస్థాన్ రాష్ట్రంలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తమిళనాడు కోయంబత్తూరు ఐచెనారీ డివిజన్‌లోని టాస్మాక్ షాప్ సేల్స్‌మెన్ ఆర్ ఈశ్వరన్ ఈ పోటీల్లో పాల్గొని, సత్తా చాటి మూడు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఈశ్వరన్ మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతున్నాయని తెలిసి, తమిళనాడు తరపున పోటీల్లో పాల్గొన్నానని చెప్పారు. మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలో 455 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించానని, అలాగే బెంచ్ ప్రెస్ విభాగంలో 105 కిలోలు ఎత్తి స్వర్ణం, 200 కిలోలు ఎత్తి డెడ్‌లిస్ట్ విభాగంలో స్వర్ణం సాధించానని తెలిపారు. ఈ పోటీలో తాను అత్యంత ప్రతిభ చూపినందున తనకు స్ట్రాంగ్ మ్యాన్ బిరుదును ఇచ్చారన్నారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని, విజయం సాధించి దేశానికి గర్వకారణంగా నిలవడమే తన లక్ష్యం అని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

కేఆర్‌ఎంబీ పరిధిలోకి విద్యుత్ ప్రాజెక్టులు

ఏపీ పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు కేఆర్‌ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం విద్యుదుత్పత్తి చేస్తున్నదని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జితో కూడిన ధర్మాసనం విచారించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన రెండు ప్రభుత్వాలు వేర్వేరు వైఖరులు తెలిపాయని, ఈ అంశంపై నోటిఫికేషన్ విడుదల చేయడానికి కొన్ని సాంకేతిక కారణాలు అడ్డంగా ఉన్నాయని కేంద్రం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అనంతరం తదుపరి విచారణ ఆగస్టు 20న చేపడతామని, ఈలోపు కేంద్రం వైఖరి తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ ధర్మాసనం స్పష్టం చేసింది. కాగా, కేఆర్‌ఎంబీ పరిధిలోకి ఆయా ప్రాజెక్టులను తీసుకురావడంపై తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకత తెలుపుతూ ఇప్పటికే అఫిడవిట్ దాఖలు చేసింది.

కువైట్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి



కువైట్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు కువైట్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక హవెల్లిలోని ఆర్ఆర్ హోటల్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం.బాలిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ప్రదాత, బడుగు బలహీన వర్గాల సంక్షేమ సారథి అయిన వైఎస్సార్ తెలుగు వారి గుండెల్లో శాశ్వతంగా ఉంటారన్నారు. ఆయన లేని లోటు వారి తనయుడు, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఒక్కరే తీర్చగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అడ్వైజర్‌లు ఎం.వి.నరసారెడ్డి, నాయని మహేశ్వర్‌రెడ్డి, కోకన్వీనర్ రమణయాదవ్, గల్ఫ్ ప్రతినిధి నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ ముఖ్యనాయకులు పులపుత్తూర్ సురేష్‌రెడ్డి, వి.పి.రామచంద్రారెడ్డి, గజ్జల నరసారెడ్డి, పాటూరు వాసుదేవరెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, ఆరవ సుబ్బారెడ్డి, చంద్ర, హరిప్రసాద్, బసిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్ రాజీనామా

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా మండలి చైర్మన్ పదవికి ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించినట్లు మంగళవారం ఉన్నత విద్యా కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

హాస్టల్ సంక్షేమ అధికారులు స్థానికంగా ఉండాల్సిందే

అధికారులకు మంత్రి సవిత ఆదేశాలు

సాక్షి, అమరావతి: హాస్టల్ సంక్షేమ అధికారి కచ్చితంగా హెడ్‌క్వార్టర్‌లోనే నివాసం ఉండి హాస్టల్‌ను పర్యవేక్షించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత-జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో సమావేశం నిర్వహించిన మంత్రి... అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ప్రతి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ హాస్టల్స్‌ను ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, ప్రతి నెలా తప్పకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై నమ్మకంతో తల్లిదండ్రులు తమ బిడ్డలను సంక్షేమ హాస్టల్స్‌లో వదులుతున్నారని, ఆ పిల్లలను సొంత బిడ్డలు మాదిరిగా చూసుకోవాలని మంత్రి సూచించారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు 25 శాతం పూర్తి

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



పనులను పరిశీలిస్తున్న రామ్మోహన్ నాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు ఇప్పటికే 25 శాతం పూర్తయ్యాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పారు. విమానాశ్రయ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ తొలి దశ పనులు 2026 నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ జీఎంఆర్‌కు నిర్దేశించినట్టు వెల్లడించారు. విమానాశ్రయం నిర్మాణానికి సేకరించిన 2,750.78 ఎకరాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2,203 ఎకరాలను మాత్రమే జీఎంఆర్‌కు స్వాధీనం చేసిందని మంత్రి చెప్పారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు లోకం మాధవి, అదితి గజపతిరాజు పాల్గొన్నారు.

అమెరికాలో నలుగురు తెలుగోళ్ల అరెస్టు!

- మానవ అక్రమ రవాణా కేసులో..
- నకిలీ కంపెనీల సృష్టి.. అక్రమ నిర్బంధం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



చందన్ దాసిరెడ్డి



ద్వారకా గుండా



సంతోష్ కట్కూరి



అనిల్ మాలే

సాక్షి, హైదరాబాద్: టెక్సాస్‌లో మానవ అక్రమ రవాణా రాకెట్‌ను నడుపుతున్న నలుగురు భారతీయులను అక్కడి పోలీసులు అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరంతా.. నల్లగొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన వారిగా తేలింది. అరెస్టయిన నిందితులు నకిలీ కంపెనీలను సృష్టించి, కొంత మందితో బలవంతంగా పని చేయిస్తున్నట్టు ప్రిన్స్‌టన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు గుర్తించారు. స్థానిక మీడియాలో వచ్చిన వార్తల మేరకు పలు వివరాలను పీటీఐ వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది. అందులో పేర్కొన్న ప్రకారం వివరాలిలా... యూఎస్‌లోని టెక్సాస్‌లో ఒక ఇంటి నుంచి మానవ కార్మికుల అక్రమ రవాణాను ఓ పథకం ప్రకారం నడుపుతున్నారనే ఆరోపణలతో ఒక మహిళతో సహా నలుగురు భారతీయ అమెరికన్లపై అభియోగాలు నమోదయ్యాయి. పోలీసుల తనిఖీలో 15 మంది మహిళలను బాధితులుగా గుర్తించారు. ఈ అక్రమ నిర్బంధాలకు పాల్పడ్డ చందన్ దాసిరెడ్డి, ద్వారకా గుండా, సంతోష్ కట్కూరి, అనిల్ మాలేను గత మార్చిలో అరెస్టు చేశారు. తాజాగా వారిపై స్థానిక పోలీసులు వ్యక్తుల అక్రమ రవాణా, సెకండ్ డిగ్రీ నేరం వంటి అభియోగాలు మోపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో మరిన్ని అరెస్టులు చేసే అవకాశం ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది.

15మందిని ఒకే గదిలో నిర్బంధించి..

సంతోష్ కట్కూరి, అతడి భార్య ద్వారకా గుండాకు చెందిన పలు షెల్ కంపెనీలలో పని చేయాలని బాధితులను బలవంతం చేశారని దర్యాప్తులో వెల్లడైంది. మొత్తం 15 మందిని వీరు ఒకే గదిలో నిర్బంధించి పని చేయిస్తున్నట్టు గుర్తించారు. ప్రిన్స్‌టన్‌లోని కొలిన్ కౌంటీ సమీపాన గిన్స్‌బర్గ్ లేన్‌లోని సంతోష్ ఇంటిలో ఈ యువతులందరూ బలవంతంగా నేలపై పడుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ ఇంట్లో పలు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, ప్రింటర్లు, మోసపూరిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆ ఇంటిలోని ఒక గదిలో ఏవిధమైన ఫర్నిచర్ లేకుండా కేవలం కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, దుప్పట్లు, పెద్ద సంఖ్యలో సూట్ కేస్‌లను గమనించి ఓ పెస్ట్ కంపెనీకి చెందిన ఉద్యోగి ఒకరు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంతోష్ కట్కూరి ఇంటిలో సోదాలు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు ఓ వార్తా సంస్థ వెల్లడించింది. మరో వార్తా పోర్టల్ ప్రకారం.. ప్రిన్స్‌టన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని సీఐడీ డిటెక్టివ్‌లు.. సంతోష్ కట్కూరి ఇంటిలో సోదాలు చేయగా, 15 మంది యువతులను గుర్తించినట్టు తెలిపింది. వీరంతా సంతోష్ కట్కూరి, అతని భార్య ద్వారకా గుండా యాజమాన్యంలోని షెల్ కంపెనీల్లో బలవంతంగా పని చేస్తున్నట్టు పేర్కొంది. బాధితుల సంఖ్య వందకు పైగానే ఉంటుందని, వీరిలో సగానికి పైగా భారతీయులే ఉంటారని తెలిపింది. సంతోష్, ద్వారకా గుండాలకు చందన్ దాసిరెడ్డి, అనిల్‌మాలె సైతం సహకరించడంతో వారిని కూడా అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల దర్యాప్తులో ప్రిన్స్‌టన్, మెలిసా, మెకెన్నీ ప్రాంతాల్లోనూ బాధితులను గుర్తించారు.

విచారించారు.. అరెస్టు చేయలేదు

కనగల్: తమను అరెస్ట్ చేసినట్లు మీడియాతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తమని కట్కూరి సంతోష్, గుండా ద్వారక, చందన్‌రెడ్డి, మాలే అనిల్‌రెడ్డి తెలిపారు. ఇది నాలుగు నెలల క్రితం జరిగిన సంఘటన అని చెప్పుకొచ్చారు. తాము అన్ని ఆధారాలు సమర్పించామని, చట్ట ప్రకారంగానే తమ కంపెనీలు నడుస్తున్నట్లు వారు తెలిపారు. మహిళల అక్రమ రవాణా, ఉద్యోగాల పేరుతో ఎవరినీ మోసం చేయలేదని, షెల్ కంపెనీలు నిర్వహిస్తూ శ్రమ దోపిడీకి గురిచేసినట్లు తమనే పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు తెలిపారు. తాము ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వారు తెలిపారు. నాలుగు నెలల క్రితం అమెరికా పోలీసులు స్టేషన్‌లో విచారించిన విషయం వాస్తవమే అయినప్పటికీ అరెస్ట్ చేసినట్లు వస్తున్న కథనాలు మాత్రం పూర్తిగా అవాస్తవమన్నారు. కట్కూరి సంతోష్, గుండా ద్వారకలది కనగల్ మండలం చినమాదరం పరిధిలోని తంగెళ్లవారిగూడెం.

అసభ్యంగా ప్రవర్తించి.. ప్రతిఘటించడంతో రైలు నుంచి తోసేసి..

- రైలులో యువతితో అసభ్య ప్రవర్తన.. ప్రతిఘటించడంతో ఆమెను కిందకు తోసేసిన యువకుడు
- బ్యాలెన్స్ తప్పి తనూ కిందపడిన నిందితుడు

మిర్యాలగూడఅర్బన్: ప్రయాణిస్తున్న రైలులో యువతి పట్ల ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ప్రతిఘటించగా కిందకు తోశాడు. ఈ క్రమంలో ఆ యువకుడు కూడా రైలు నుంచి జారి కిందపడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని వాటర్‌ట్యాంక్ తండా వద్ద మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలు, స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్ చింతల్‌లో నివాసముంటూ ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తుంది. ఆమె మంగళవారం విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో తన స్వగ్రామానికి బయలుదేరింది. అదే ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ఒడిషాకు చెందిన బిశ్వాల్ ఆమెను గమనిస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆ యువతి చేతులు కడుక్కునేందుకు ట్రైన్‌లోని వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్లగా, ఆమె వెనకాలే అక్కడకు చేరుకున్న బిశ్వాల్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె అతడిని ప్రతిఘటించింది. దీంతో బిశ్వాల్ ఆమెను ట్రైన్‌లోంచి కిందకు నెట్టివేశాడు. ఈ క్రమంలో బిశ్వాల్ కూడా పట్టుకోల్పోయి ట్రైన్ కింద పడిపోయాడు. ట్రైన్ నుంచి కిందపడిన ఆ యువతి గాయాలతోనే సమీపంలో ఉన్న వాటర్‌ట్యాంక్ తండా వరకు అంటే అరకిలోమీటర్ వరకు నడుచుకుంటూ వెళ్లింది. తండాకు చెందిన మాజీ సర్పంచ్ ధనావత్ రామచంద్‌నాయక్ స్థానికుల సాయంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తల, చేతులకు గాయాలు కాగా, ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆ యువతి ఇచ్చిన సమాచారం మేరకు బిశ్వాల్‌ను కూడా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడికి స్వల్ప గాయాలయ్యాయి.

నాణ్యతకు, నమ్మకానికి భరోసా భారతి సిమెంట్



సమావేశాన్ని ప్రారంభిస్తున్న మల్లారెడ్డి

తిరుపతి కల్చరల్: నాణ్యతలో మేటిగా.. ప్రజల నమ్మకానికి చక్కటి భరోసాగా భారతి సిమెంట్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) ఎంసీ మల్లారెడ్డి తెలిపారు. తిరుపతిలోని మినర్వా హోటల్‌లో మంగళవారం జరిగిన జిల్లా డీలర్ల వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటూ విశేష ఆదరణ పొందుతోందన్నారు. ఇంజనీర్ లూయిస్ వికాట్ 1817లో సిమెంట్ తయారీని కనుగొనడం జరిగిందని తెలిపారు. వికాట్ సంస్థ ఆధ్వర్యంలోనే దేశవ్యాప్తంగా 16 సిమెంట్ పరిశ్రమలు, 267 రెడీమిక్స్, 72 కంకర యూనిట్లు నెలకొల్పారని తెలిపారు. ఏడాదికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని కంపెనీ సాధిస్తోందన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబొరేటరీ వంటి అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో భారతి సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. తాపీ మేస్త్రీలకు సంస్థ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ పథకాన్ని అమలు చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. భారతి సిమెంట్ సంస్థ అసిస్టెంట్ ఉపాధ్యక్షుడు (మార్కెటింగ్) టి.కొండల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఏ.వి జయవర్ధన్‌రెడ్డి, డీజీఎం (టెక్నికల్ సర్వీసెస్) సి.ఓబుళరెడ్డి, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.5.40 లక్షల కోట్లు

- ప్రాధాన్యత రంగాలకు రూ.3.75 లక్షల కోట్లు..
- ఇతర రంగాలకు రూ.1.65 లక్షల కోట్లు
- వ్యవసాయ రంగానికి రూ.2.64 లక్షల కోట్లు
- ఐదు రంగాల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో సబ్ కమిటీ
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం
- వార్షిక రుణ ప్రణాళిక విడుదల



రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.5.40 లక్షల కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. 227వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో సీఎం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 2024–25 వార్షిక రుణ ప్రణాళికను ఆయన విడుదల చేస్తూ ప్రాధాన్యత రంగాలకు రూ.3.75 లక్షల కోట్లు, ఇతర రంగాలకు రూ.1.65 లక్షల కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.2.64 లక్షల కోట్లు రుణాల లక్ష్యంగా చెప్పారు. గత లక్ష్యం కంటే 14 శాతం అధికంగా రుణాలివ్వాలని నిర్ణయించారు. డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌలిక సదుపాయాలకు రూ.32,600 కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యతా రంగానికి రూ.3,23,000కోట్లు రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఈ ఆర్థిక సంవత్సరానికి అది రూ.3,75,000 కోట్లుగా నిర్దేశించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 16 శాతం అధికంగా లక్ష్యం పెట్టుకున్నారు. అలాగే, వ్యవసాయ రంగానికి గత ఆర్థిక సంవత్సరం రూ.2.31 లక్షల కోట్ల రుణ లక్ష్యం కాగా.. 116 శాతం మేర అంటే రూ.2.68 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేశారు. అలాగే, ఎంఎస్‌ఎంఈ రంగానికి ఈ ఆర్థిక ఏడాది రూ.87,000 కోట్లు.. గృహ నిర్మాణానికి రూ.11,500 కోట్లు, సంప్రదాయేతర ఇంధన రంగానికి రూ.8,000 కోట్లు రుణాలు మంజూరు చేయాలన్నది ఈ ఏడాది లక్ష్యం. చంద్రబాబు మాట్లాడుతూ వ్యవసాయానికి ఊతమిచ్చేలా బ్యాంకులు పనిచేయాలని, కౌలు రైతులకు రుణాలు సులభంగా అందే పరిస్థితి రావాలన్నారు.

కౌలు రైతులకు సులభంగా రుణాలివ్వాలి..

ప్రభుత్వంపై ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారని.. వాటిని నెరవేర్చేందుకు తీసుకుంటున్న చర్యలకు బ్యాంకులు చేయూతనివ్వాలని చంద్రబాబు కోరారు. వ్యవసాయ రంగంలో సాగు ఖర్చులను తగ్గించాల్సిన అవసరముందని.. దీనిపై ప్రభుత్వం, బ్యాంకులు కలిసి పనిచేయాలన్నారు. పలు కీలక అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం, బ్యాంకులు కలిసి పనిచేయాలని.. దీనికోసం మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో కమిటీ ఏర్పాటుచేస్తామని చంద్రబాబు తెలిపారు. ఐదు అంశాలపై ప్రణాళిక సిద్ధంచేసి అమలుచేసేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని వివరించారు. అలాగే, సంపద సృష్టించే రంగాలకు బ్యాంకులు ప్రోత్సాహమిచ్చే విషయంపై దృష్టిపెట్టాలన్నారు.

డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలి..

డిజిటల్ లావాదేవీల్లో ఏపీ ప్రభుత్వం మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని, రానున్న రోజుల్లో నెంబర్‌వన్‌గా నిలిచే ప్రణాళికలు అమలు చేయాలని సీఎం అన్నారు. డిజిటల్ చెల్లింపులను బ్యాంకులు కూడా ప్రోత్సహించాలని చెప్పారు. దీనివల్ల అవినీతి తగ్గుతుందని.. ఉత్పాదకత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పేదరికం నిర్మూలన విషయంలో ప్రభుత్వం కొత్తగా పి–4 విధానం తీసుకొస్తుందని.. ఇందుకు తీసుకోవాల్సిన చర్యలపై సబ్ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అధ్యయనం..

అలాగే, యువతలో నైపుణ్యం పెంచడంపై తమ ప్రభుత్వం దృష్టిపెట్టిందని.. స్కిల్ డెవలప్‌మెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలపై సబ్ కమిటీ అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. సంపద సృష్టించే, జీఎస్‌డీపీ పెంచే రంగాలకు బ్యాంకుల ప్రోత్సాహం అవసరమన్న దానిపైనా ఎలా ముందుకెళ్లాలి అనే విషయంలో సబ్ కమిటీ చర్చిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ అంశాల్లో సత్వర నిర్ణయాలు, మెరుగైన ఫలితాలు సాధించేలా మంత్రులు, బ్యాంకర్లు, ఆయా రంగాల నిపుణులతో కమిటీ ఏర్పాటుచేస్తామని చంద్రబాబు తెలిపారు.

హార్టీకల్చర్, ఆక్వాను ప్రోత్సహించాలి..

వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ హార్టికల్చర్, ఆక్వా కల్చర్‌కు బ్యాంకులు రుణాలిచ్చి ప్రోత్సహించాలని కోరారు. పాడి పరిశ్రమాభివృద్ధి చెందేలా ఆవులు, గేదెలు కొనుగోలుకు బ్యాంకులు ఆంక్షల్లేకుండా రుణాలివ్వాలని సూచించారు. ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రజలకున్న అనేక ఆశలను తీర్చేందుకు కొత్త ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇందుకు బ్యాంకుల సహకారం అవసరమన్నారు. యూనియన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎస్ భాస్కర్‌రావు, ఇతర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీకి తోక పార్టీ కాంగ్రెస్

- వైఎస్సార్ పేరిట ఉన్న పథకాలను మారుస్తుంటే షర్మిల నోరెత్తరేం
- వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడరు
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఏనాడో భూస్థాపితం అయ్యిందని.. అలాంటి పార్టీ ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో పని చేస్తోందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కనుమూరు రవిచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చంద్రబాబు అజెండాను మోస్తూ టీడీపీకి తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ పేరుతో ఉన్న పథకాల పేరు మారుస్తుంటే షర్మిల ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ విగ్రహాలను తగులబెడుతున్నా.. పగులగొడుతున్నా కాంగ్రెస్ నాయకులు నోరు ఎందుకు పెగలడం లేదని నిలదీశారు. వారసత్వం కోసమే వైఎస్సార్ జపం చేస్తున్న షర్మిల తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఏపీ ప్రజల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఆయన తనయుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే పయనిస్తూ అనేక సంక్షేమ పథకాలతో ప్రజల మనస్సుల్లో నిలిచారని చెప్పారు. రూపాయి అవినీతి లేకుండా రూ.2.70 లక్షల కోట్లను సంక్షేమ పథకాల ద్వారా వైఎస్ జగన్ పేదలకు అందించారని చెప్పారు.

రేవంత్‌రెడ్డివి ఉత్తర కుమార ప్రగల్భాలు


గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన వైఎస్ జయంతి సభలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారని రవిచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. కడపలో ఉపఎన్నిక వస్తుందని, ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే రాబట్టుకుంటామని రేవంత్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఎంపీ స్థానాన్ని గెలిపించలేకపోయిన రేవంత్ మాటలు నమ్మడానికి ఏపీ ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఏపీ ప్రజలకు క్షమాపణ చెప్పే వరకు కాంగ్రెస్ పార్టీని ఎవరూ నమ్మొద్దన్నారు. షర్మిలకు నాయకత్వాన్నిచ్చిన కాంగ్రెస్ ఆమె ఆధ్వర్యంలో పార్టీ లేచి పరిగెడుతుందని నమ్మిద్దామనుకుంటే అది జరిగే పనికాదని తేల్చి చెప్పారు. ఏపీ ప్రజలెప్పుడూ కాంగ్రెస్ పార్టీని దగ్గరకు తీసుకోరన్నారు. ఏపీలో షర్మిల నాయకత్వంలో కొనసాగుతున్న కాంగ్రెస్ చంద్రబాబు అజెండాను మోస్తోందని ఎద్దేవా చేశారు.

ఒకే నాణేనికి రెండు ముఖాలు బాబు, రేవంత్

చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాలని, వారిద్దరి లోపాయికారీ బంధం ప్రజలకు తెలుసని రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అంటూ రేవంత్ వ్యాఖ్యానించారని.. నిజంగా ఎన్డీయేలో చేరింది బాబు, పవన్ మాత్రమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పుట్టినప్పటి నుంచి ఏ పార్టీతోనూ పొత్తు కోసం వెంపర్లాడలేదని స్పష్టం చేశారు. తాము ఎన్డీయేలో చేరాలనుకుంటే చంద్రబాబు గెలిచేవారు కాదన్నారు. చంద్రబాబు అందరి కాళ్లూ, గడ్డాలు పట్టుకుని పొత్తులు కుదుర్చుకుని అధికారంలోకి వచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం కోసం కట్టుబడి ఉందని, తాము పార్టీ జెండా, అజెండాతో పేద ప్రజల పక్షాన నిలిచామని స్పష్టం చేశారు. నాలుగు రోజులు ఆలస్యమైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కొంత సమయం ఇచ్చిన తర్వాత ప్రభుత్వం అమలు చేయని హామీలు, మోసపూరిత విధానాలపై ప్రజలతో మమేకమై పోరాటాలు చేసే సత్తా ఏపీలో వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు.

ఆ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోంది?

- మా ప్రభుత్వం దిగిపోయే నాటికి అందుబాటులో 80 లక్షల టన్నుల ఇసుక
- ఇప్పుడు 45 లక్షలే ఉందంటున్నారు.. మిగతాదంతా ఏమైంది?
- వైఎస్ జగన్ హయాంలో ఖజానాకు ఏటా రూ.750 కోట్ల ఆదాయం
- ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ఇసుక ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు డిమాండ్



సాక్షి, అమరావతి: ఉచిత ఇసుక పేరుతో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మండిపడ్డారు. ఓ వైపు ఉచితం అంటూనే చార్జీలు బాదేస్తున్నారని, ఇసుక రీచ్‌లలో రేట్లతో ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయం ఖజానాకు వచ్చేదని, ఇప్పుడా సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్తోందని ఆయన ప్రశ్నించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సుధాకర్‌బాబు మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

బాబులా ఎవరూ మోసాలు చేయరు..

ఎన్నికల హామీల్లో ప్రధానమైన 'ఉచిత ఇసుక' ఒట్టిదే అని తేలింది. ఇసుక ఉచితంగా ఇస్తానన్న చంద్రబాబు మరోసారి ప్రజలందరినీ బోల్తా కొట్టించారు. ఉచితంగా ఇవ్వకపోగా స్టాక్ యార్డుల వద్ద దారుణమైన రేట్లతో ఇసుకను విక్రయిస్తున్నట్లు ప్రకటించారు. అసలు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు చెల్లించిన ధర నేరుగా ప్రభుత్వ ఖజానాకు ఏటా సుమారు రూ.750 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పుడు రీచ్‌ల దగ్గర వసూలు చేసే డబ్బంతా ఎవరి దగ్గరకు వెళ్తోంది? ఆ డబ్బు ఇప్పుడు టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్తున్న మాట నిజమా కాదా? ఇసుక విషయంలో చంద్రబాబు చేసినట్లుగా మోసాలు ఎవరూ చేయరు. 2014–19 కాలంలో ఆయన అనేక జీఓలు విడుదల చేయడాన్ని హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్ తప్పుబట్టాయి. అయినా మళ్లీ అదే పాలసీని ఉచితం పేరుతో తీసుకొచ్చారు. సీనరేజీ, లోడింగ్, ట్రాన్స్‌పోర్టు, ర్యాంప్ నిర్వహణ, అడ్మిన్ ఖర్చులు, డీఎంఎఫ్, మెరిట్ ఫీజులు, జీఎస్టీ అని రకరకాల పేర్లతో డబ్బులు వసూలుచేసి ఉచితం అని ఎలా చెబుతారు?

మాయమైన ఇసుకపై విచారణ జరగాలి..

ఇక మా ప్రభుత్వం దిగిపోయి మీ ప్రభుత్వం వచ్చే నాటికి 80 లక్షల టన్నుల ఇసుక స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉంది. ఇప్పుడు 45 లక్షల టన్నులే అందుబాటులో ఉన్నట్లు ప్రభుత్వం చెబుతోంది. సుమారు 35 లక్షల టన్నుల ఇసుక మాయమైంది. రూ.కోట్ల విలువ చేసే ఈ ఇసుకను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కొట్టేశారా? దీనిపై విచారణ జరగాలి. ఉచితం పేరుతో సహజ వనరులను దోచుకుంటున్నారని, ప్రైవేటు వ్యక్తులు దోపిడీకి పాల్పడుతున్నారని గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ పేర్కొన్న మాట నిజమా.. కాదా? 2016–19 మధ్య కాలంలో దాదాపు వెయ్యికి పైగా అక్రమ కేసులు నమోదయ్యాయి. ఇది కేవలం గోరంతే. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, కార్యకర్తలను పెట్టుకుని పూర్తిగా దోచేశారని హైకోర్టు కూడా చెప్పింది. ఉచిత ఇసుక విధానాన్ని నిరసిస్తున్నాం. వెంటనే ప్రజలకు ఎక్కడికక్కడ అవసరమైన మేరకు ఉచితంగా ఇసుకను అందించాలి.

టీడీపీ దాడులపై చర్యలు తీసుకోండి

గుంటూరు జిల్లా ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి



ఎస్పీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

నగరంపాలెం: గుంటూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసిన టీడీపీ వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు (డైమండ్ బాబు), ప్రజాప్రతినిధులు, నాయకులు ఎస్పీ తుషార్‌డూడీ దృష్టికి తీసుకెళ్లారు. వారు మంగళవారం గుంటూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. గుంటూరు మల్లికార్జునపేటలో సోమవారం డిప్యూటీ మేయర్ కార్యాలయాన్ని ఇద్దరు ధ్వంసం చేసిన సీసీటీవీ పుటేజీని కూడా పోలీసులకు ఇచ్చామని, అయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఆధారాలు ఇచ్చినా పోలీసులు స్పందించలేదని ఎస్పీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీని కలిసిన అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ కూటమి గెలిచినప్పటినుంచి రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ఇది మంచిపద్ధతి కాదన్నారు. ఇటువంటి దుశ్చర్యలను రాష్ట్ర ప్రజలు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎల్లకాలం ఇలా ఉండదన్నారు. ఇటువంటి రాజకీయ విషసంస్కృతికి స్వస్తిచెప్పాలని హితవు పలికారు. కవ్వింపు చర్యలు, రెచ్చగొట్టే వాఖ్యలు చేయవద్దని కూటమి నాయకులకు సూచించారు. గుంటూరు డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ మెజార్టీతో గెలుపొందిన తరువాత రాష్ట్రంలో గుండుసూది కిందపడిన శబ్దం కూడా చేయలేదని చెప్పారు. కూటమి గెలిచిన తరువాత రాష్ట్రంలో దాడుల సంస్కృతికి తెరలేపిందన్నారు. ఇటీవల కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి ఇంటిపై దాడి చేశారని, 17వ డివిజన్‌లో, రెడ్డిపాలెంలో వైఎస్సార్ విగ్రహాల ధ్వంసం చేశారని, సుగాలికాలనీలో దాడులు చేశారని వివరించారు. ఆయా దుశ్చర్యలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. జీరో ఎఫ్ఐఆర్ కేసులు కూడా నమోదవడంలేదని విమర్శించారు. మాజీ రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారని, భౌతిక దాడులకు, వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని తెలిపారు. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి రోజున తన కార్యాలయాన్ని ధ్వంసం చేశారన్నారు. తాళాలు పగులకొట్టి, రాళ్లతో అద్దాలు ధ్వంసం చేశారని, అందులో ఒక రౌడీషీటర్ ఉన్నారని చెప్పారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈ దాడులను నివారించాలని కోరారు. ఇదేవిధంగా దాడులు కొనసాగితే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వస్తారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రౌడీయిజం, ఇళ్లపై దాడులు సరికాదని చెప్పారు. ఇటువంటి ఘటనలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్ యర్రి ధనలక్ష్మి ఇంటిపై గతనెల 26న దాడి జరిగితే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. వీరివెంట కార్పొరేటర్లు మల్లవరపు రమ్య, నిమ్మల వెంకటరమణ, అబుదాద్, అజయ్, ఆచారి, యాట్ల రవి, బూసి రాజలత, గోపి, దూపాటి వంశీ ఉన్నారు.

ఉచిత ఇసుక అనేది అబద్ధం

- ప్రభుత్వ సొమ్ము టీడీపీ నేతల జేబుల్లోకి
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం చెబుతోన్న ఉచిత ఇసుక అనేది పచ్చి అబద్ధమని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఉచితం పేరుతో ఇసుక దోపిడీకి చంద్రబాబు తెరలేపారని ఆరోపించారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఓ వైపు ఫ్రీ అంటూనే రీచ్‌లలో రేట్లతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు సీఎం చంద్రబాబు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో ఇసుక మీద ఖజానాకు ఏడాదికి రూ.750 కోట్ల ఆదాయం వచ్చేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ డబ్బంతా టీడీపీ నేతల జేబుల్లోకి వెళ్తోందని విమర్శించారు. ఎక్కడికక్కడ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి పారదర్శకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇసుక అందజేసిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి అందుబాటులో 80 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉందని ఇప్పుడు 45 లక్షల టన్నులే ఉందని చంద్రబాబు అంటున్నారని.. 35 లక్షల టన్నుల ఇసుక ఏమైందని ప్రశ్నించారు. ఈ ఇసుకను టీడీపీ నేతలు కొట్టేశారని ఆరోపించారు. ఉచిత ఇసుక విధానాన్ని తుంగలో తొక్కడాన్ని నిరసిస్తున్నామని, వెంటనే ప్రజలకు ఎక్కడికక్కడ అవసరమైన మేరకు ఇసుకను అందించాలని డిమాండ్ చేశారు. ఒక్క రూపాయి కూడా ప్రజల దగ్గర నుంచి వసూలు చేయకూడదని వ్యాఖ్యానించారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
బుధవారం ॥ 10-7-2024



ఇదో ఇంగ్లిష్ వింగ్లిష్



నారీ అదాలత్ ఏం చెబుతోంది?

**భారతీయ న్యాయ సంహిత తాజాగా అమలులోకి వచ్చింది.
అలాగే స్త్రీలకు సత్వర న్యాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం 'నారీ అదాలత్' పేరుతో ప్రత్యేక పంచాయతీ వ్యవస్థను పరిచయం చేయబోతోంది.
పైలట్ ప్రాజెక్ట్‌గా అసోం, జమ్ము–కశ్మీర్‌లలో ప్రవేశపెట్టనున్నారు.
ఇది కోర్టులా న్యాయం చేస్తుందా?
లేదా 'ఖాప్ పంచాయతీ'లా పంచాయతీ పెడుతుందా?
అసలు 'నారీ అదాలత్' ఏంటి?**

నళిని ప్రైవేట్ టీచర్. తమ ఊళ్లోనే ఉన్న కాన్వెంట్‌లో పని చేస్తోంది. వృత్తి అంటే ప్రాణం. వాళ్లది గ్రామ పంచాయతీ. వ్యవసాయ కుటుంబం. ఇంట్లోనే పాడి. భార్యగా, ఇంటి కోడలిగా ఆ బాధ్యతలన్నీ నళినే చూసుకోవాలని ఆమె మీద ఒత్తిడి.. భర్త, అత్తగారి నుంచి! ఆఖరికి వాకిలి ఊడ్చి, కళ్లాపి జల్లి, ముగ్గు వేసే పనినీ నౌకరుతో చేయిస్తోందని భర్త కంప్లయింట్. ఆ ఒత్తిడి హింసగా మారి నళిని మానసిక ఆరోగ్యం మీదా ప్రభావం చూపిస్తుండటంతో ఆమె గృహ హింస చట్టాన్ని ఆశ్రయించక తప్పలేదు. 'విమెన్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్'లో భర్త మీద ఫిర్యాదు చేసింది. భార్యాభర్తలిద్దరికీ రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా నళిని భర్తది ఒకటే మాట.. ఆమె ఉద్యోగం మానేయాలని! దానికి నళిని ససేమిరా అన్నది. దాంతో 'విమెన్ అండ్ చైల్డ్ వెల్‌ఫేర్ ఆఫీసర్ ఆ డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్'(తాము కౌన్సెలింగ్ చేసిన విధానం, అయినా ఫలితం రాని వైనాన్ని రాసిన నివేదిక)ను కోర్ట్‌కి సబ్‌మిట్ చేశారు. ఆ రిపోర్ట్ ఆధారంగా గృహ హింస చట్టం కింద కోర్ట్ ప్రొసీడింగ్స్ మొదలయ్యాయి. గృహ హింస చట్టంలో ఆరోపణ రుజువైతే బాధితులకు ఆర్థిక భద్రత కల్పించాలి. వాళ్లకున్న ప్రాథమిక హక్కుని గౌరవించాలి. ఇది మహిళలకు ఆ యాక్ట్ ద్వారా కోర్టులు అందించే న్యాయం.

నళిని ఉండే ఊర్లో 'నారీ అదాలత్' అమలయితే ఆ పంచాయతీ ఎలా ఉండొచ్చు?

'నారీ అదాలత్'లోని సభ్యుల్లో సగం మంది గ్రామ పంచాయత్ నుంచి ఉంటారు. మిగిలిన సగంలో టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సామాజిక కార్యకర్తలు మొదలైన వారుంటారు. వీళ్లను గ్రామస్థులే నామినేట్ చేస్తారు. ఈ కమిటీ అంతా మహిళలతోనే ఉంటుందా? లేక స్త్రీ, పురుషులతో కలసి ఉంటుందా అనేదాని మీద ఎక్కడా పూర్తి వివరం లేదు. సరే.. నళినీ కేసు నారీ అదాలత్ స్వీకరించినప్పుడు అదాలత్ సభ్యులపై నళిని అత్తగారి కుటుంబం పలుకుబడి ప్రభావం చూపదా? అలాగే పురుషస్వామ్య సంస్కృతి ప్రభావం వల్ల అదాలత్‌లోని సభ్యులకు కుటుంబం, స్త్రీ, ఆమె విధుల పట్ల సంప్రదాయ ఆలోచనలు, కచ్చితమైన అభిప్రాయాలు ఉండొచ్చు. ఈ నేపథ్యంలో నళిని విషయంలో ఎలాంటి తీర్పు వెలువడవచ్చు? ఆమె హక్కులు, వ్యక్తిత్వాన్ని గుర్తించే, గౌరవం లభించే అవకాశం ఎంత వరకు ఉంటుంది? దీనివల్ల దళిత, గిరిజన మహిళల మీద వేధింపులు పెరగవచ్చు, రాజకీయ ప్రయోజనాలూ మిళితమవచ్చు. కరప్షన్‌కి చాన్స్ ఉండొచ్చు. అసలు ఇది ఊళ్లల్లో పెద్ద మనుషుల పంచాయతీకి ఏ రకంగా భిన్నమైనది? దాన్ని ప్రభుత్వం గుర్తించలేదు.. ఈ అదాలత్‌లను ప్రభుత్వమే నిర్వహిస్తోంది అనే భేదం తప్ప! దీన్ని ఆసరాగా చేసుకుని నారీ అదాలత్ సభ్యులు నిందితుల లేదా వాళ్ల తరఫు పెద్ద మనుషుల ప్రలోభాలకు లొంగి బాధితురాలిని ఇబ్బంది పెట్టే ప్రమాదం మెండు. స్థానిక పోలీసులూ రెచ్చిపోయే అవకాశమూ అంతే అధికం. రేప్పొద్దున లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్ లాంటి సమస్యలను తీసుకుని మహిళలు పోలీస్ స్టేషన్‌కి వెళితే నిందితుల ప్రలోభాలకు తలొగ్గి స్టేషన్‌కి ఎందుకు వచ్చారు? నారీ అదాలత్‌లున్నాయి కదా అక్కడే తేల్చుకుపొండి అనే చాన్సూ ఉంటుంది. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుంది? ఈ క్రమంలో మహిళల కోసం వచ్చిన ప్రత్యేక చట్టాల ఉనికే దెబ్బతినే ప్రమాదం కనపడుతోంది. ఏదేమైనా ఇలాంటి ప్రయోగాలు లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలతో, ఒక నిర్దిష్ట రూపం దాల్చాకే అమల్లోకి వస్తే మంచిది అని అభిప్రాయపడుతున్నారు పలువురు న్యాయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు!

– సరస్వతి రమ

ట్రయల్ అండ్ ఎర్రర్‌గానే...

కోర్టులకు పనిభారం తగ్గించేందుకే కేంద్రం ఖాప్ పంచాయత్‌లను పోలిన నారీ అదాలత్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు అనిపిస్తోంది. ఇది ఏ రకంగానూ విమెన్ ఫ్రెండ్లీ కాదు. ఇప్పటి వరకు విన్న, చదివిన దాన్ని బట్టి ఇదో ట్రయల్ అండ్ ఎర్రర్‌గా మిగిలిపోనున్నది. ఎందుకంటే గ్రామస్థాయిలో న్యాయవాదులచే శిక్షణ పొందిన లీగల్ వలంటీర్ వ్యవస్థ ఉంది. మండల, జిల్లా స్థాయిల్లో లీగల్ సర్వీస్ అథారిటీ కేంద్రాలు, సఖీ సెంటర్లున్నాయి. ఇప్పటికే ప్రతి పోలీస్‌స్టేషన్‌కి అనుబంధంగా ఉన్న కౌన్సెలింగ్ సెంటర్స్ వల్ల పోలీసులు ఫిర్యాదులే తీసుకోవట్లేదు. ఎంత తీవ్రమైన సమస్యలనైనా కౌన్సెలింగ్ సెంటర్స్‌కే రిఫర్ చేస్తున్నారు. అక్కడ కొన్ని పరిష్కారం అయ్యి కొన్ని కాక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది రచ్చబండను పోలిన ఈ నారీ అదాలత్‌లు ఏం న్యాయం చేయగలవు!



– ఇ. పార్వతి,
ఫ్యామిలీ కౌన్సెలర్

అసంబద్ధమైన ఆలోచన



'నారీ అదాలత్' లాంటి అఫీషియల్ ఖాప్ పంచాయత్‌లు మహిళల హక్కుల ఉల్లంఘనకు పాల్పడతాయి. వీటివల్ల మహిళల ప్రైవసీ, డిగ్నిటీ, మర్యాదలకు భంగం వాటిల్లవచ్చు. అంతేకాదు పరువు పేరుతో వాళ్ల ప్రాణాలకూ ముప్పు ఉండొచ్చు. ఇదొక అసంబద్ధమైన ఆలోచన. జూన్ 30 వరకు అమలులో ఉన్న క్రిమినల్ చట్టాల ప్రకారం.. కుటుంబ వివాదాలకు సంబంధించిన అన్ని కేసులు ఇంకా చెప్పాలంటే ఏడేళ్లలోపు శిక్షలు పడ్డ అందరికీ స్టేషన్ బెయిల్ ఇవ్వాలి. అంటే బాధితులకు న్యాయాన్ని అందించడంతో పాటు నిందితుల హక్కులనూ గుర్తిస్తుందన్నమాట. కుటుంబ కలహాలు, గృహ హింస కేసుల్లో కౌన్సెలింగ్ ఫెయిలైతే సదరు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు రిపోర్ట్ పంపిస్తారు. దాని ప్రకారం వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చట్టం చెబుతోంది. ఇలాంటి కేసుల్లో కొత్త శిక్షాస్మృతీ దాన్నే ఫాలో కావాలి. కానీ కొత్త క్రిమినల్ చట్టాలు, ముఖ్యంగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్నెస్సెస్)లోని కొన్ని రూల్స్ వల్ల అలా జరగకపోవచ్చు. సాధారణంగా ఏ ఫిర్యాదు అందినా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అయితే కుటుంబ కలహాల కేసులు, ఆర్థిక నేరాలు వంటి కొన్ని ఆరోపణలలో ఏడు రోజుల వరకు ప్రిలిమినరీ ఎంక్వయిరీ చేయవచ్చు. కానీ అది నిజనిర్ధారణకు కాదు. కాగ్నిజబుల్ కేసు అనిపిస్తే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి తీరాలి. కానీ బీఎన్నెస్సెస్ ప్రకారం ప్రిలిమినరీ ఎంక్వయిరీ పవర్ పోలీసులకు వచ్చింది. కాబట్టే వాళ్లు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఆస్కారం తక్కువుంటుంది. ఇదివరకైతే పోలీసులు సహకరించకపోతే ఎఫ్ఐఆర్ వేయమని జిల్లా మేజిస్ట్రేట్ దగ్గర పిటిషన్ దాఖలు చేసుకునే వీలుండేది. కానీ ఇప్పుడు బీఎన్నెఎస్సెస్‌లోని సెక్షన్ 22 3 (1) ప్రకారం నిందితుడి పక్షం వినకుండా మెజిస్ట్రేట్.. ఎఫ్ఐఆర్ కోసం పోలీసులకు ఆదేశాలిచ్చే అవకాశం లేదు. దాంతో బలవంతులైన పురుషులకు బయటపడే మార్గాలను వెదుక్కునే చాన్స్ దొరుకుతోంది. వీటివల్ల 498 వంటి కేసుల్లోనూ ఎఫ్ఐఆర్ ఆలస్యం అయ్యే సూచనలు కనపడుతున్నాయి. ఇలా కోర్టు పరిధిని తగ్గించే ఇలాంటి ప్రయత్నాలేవీ సమాజానికి మంచివి కావు.

– శ్రీకాంత్ చింతల, తెలంగాణ హైకోర్టు న్యాయవాది

కిడ్స్‌కు పాఠం... క్వీన్ స్విమ్మర్

ఇంగ్లిష్ వింగ్లిష్ సినిమాలో శ్రీదేవి ఇంగ్లిష్ నేర్చుకుని ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఈతకు బద్ధకించే పిల్లల్ని ఇన్‌స్పైర్ చేయడానికి క్వీనీ విక్టోరియా ఏకంగా ఇంగ్లిష్ ఛానల్‌ను ఈది రికార్డ్ సృష్టించింది. ఈ తరానికి ఓ లక్ష్యాన్ని అందించింది. ప్రతి ఒక్కరికీ కలలుంటాయి. జీవనపోరాటంలో మునిగి కొన్నేళ్లకు ఆ కలలను మర్చిపోతాం. ప్రతి ఒక్కరూ జీవితంలో తమకంటూ కొన్ని పేజీలు రాసుకోవాలి. ఆ పేజీల్లో కలలను సాకారం చేసుకున్న కథనాలే ఉండాలి. అప్పుడే మన కలకు గౌరవం... కలకన్న మనసుకు సంతోషం... ఇది ఇటీవల ఇంగ్లిష్ చానెల్ ఈదిన క్వీనీ విక్టోరియా మనోగతం.

క్వీనీ విక్టోరియా గంధం 2018 వరకు సాధారణ గృహిణి. ఆమె స్విమ్మర్‌గా వార్తల్లోకి వచ్చి కొద్దికాలమే అయింది. 38 ఏళ్ల వయసులో స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేసిన విక్టోరియా గత జూన్ 25వ తేదీ (భారత కాలమానం ప్రకారం) తెల్లవారు జామున ఇంగ్లండ్ – ఫ్రాన్స్ దేశాల మధ్యనున్న ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు సృష్టించారు. 2018లో తొలి రికార్డు, ఇంటర్నేషనల్, నేషనల్, స్టేట్‌లెవెల్, డిస్ట్రిక్ట్ లెవెల్ పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాల జాబితాలో నలభైకి పైగా ఉంది. క్వీనీ విక్టోరియా ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా గుర్తింపు పొందిన సందర్భంగా సాక్షి ఫ్యామిలీతో పంచుకున్న విషయాలు.



ఇంగ్లిష్ చానెల్ ఈదిన తర్వాత జాతీయ పతాకంతో...



ఇంగ్లిష్ చానెల్ ఈదుతూ...

పిల్లలతో కలిసి ప్రాక్టీస్

''నా స్విమ్మింగ్ జర్నీ చాలా ఆశ్చర్యకరంగా మొదలైంది. మా పిల్లలిద్దరినీ స్విమ్మింగ్‌లో చేర్పాం. ప్రాక్టీస్‌కెళ్లడానికి బద్ధకించేవాళ్లు. అలసట, నీరసం, ఓపికలేదు, ఇంటరెస్ట్ లేదు... రోజూ ఏదో ఓ సాకు చెప్పేవాళ్లు. వాళ్లకు బాధ్యత నేర్పడానికి ప్రయత్నించినప్పుడు 'నీకు చెప్పడానికి బాగానే ఉంటుంది. రోజూ నీటిలో దిగి ఈత కొడితే కదా తెలుస్తుంది' అన్నారు. 'అంతకష్టమైన పనా, చూద్దాం పదండి' అని నేను కూడా జాయినయ్యాను. మొదలు పెట్టిన మూడు నెలల్లోనే సికింద్రాబాద్ స్విమ్మింగ్ పూల్‌లో పోటీలు జరిగాయి. పిల్లలిద్దరూ, నేను ముగ్గురం ఎవరి ఏజ్ కేటగిరీలో వాళ్లు పాల్గొన్నాం. ముగ్గురమూ విజేతలుగా నిలిచాం. ఇక అప్పటినుంచి నేను స్విమ్మింగ్‌ని ఆపలేదు.

ఏడు చానెళ్లనూ ఈదాలి

దేశవిదేశాల్లో జరిగిన పోటీలకు వెళ్లడం, పతకాలతో తిరిగి రావడం రెగ్యులర్ ప్రాక్టీస్‌గా మారింది. హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు, జాతీయ స్థాయి పోటీలు, దుబాయ్, సెర్బియా, ఈజిప్ట, శ్రీలంక, టర్కీలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించాను. ఇంగ్లిష్ చానెల్ ఈదిన అనుభవాన్ని మాటల్లో వర్ణించలేను. ఇది అందమైన భావన. గడ్డకట్టే చలి, దేహం బిగుసుకుపోయే చల్లదనపు నీటిలో ఈదాలి. రెండు గంటల సేపు చానెల్‌లో ఉన్నాను. 'చానెల్ స్విమ్మింగ్ అండ్ ఫ్లోటింగ్ ఫెడరేషన్, లండన్' నిర్వహించిన పోటీలో భాగంగా ఇంగ్లిష్ చానెల్‌ను ఈదే క్రమంలో ప్రతి సందర్భాన్నీ, ప్రతి సంఘటననూ ఎంజాయ్ చేశాను. ఏడు ఖండాల్లోని ఏడు చానెళ్లనూ ఈది రికార్డు సాధించాలనేది నా ముందున్న లక్ష్యం.

నా కుటుంబం... క్లయింట్‌ల ప్రోత్సాహం

మాది మధ్య తరగతి కుటుంబం. పాలమూరు జిల్లా, అమనగల్లు మా సొంతూరు. ఇంటర్ తర్వాత పెళ్లయింది. హైదరాబాద్, బర్కత్‌పురాలో వైవాహిక జీవితం మొదలైంది. ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీఈడీ చేశాను. కుటుంబ అవసరాల రీత్యా బర్కత్‌పురాలో 'క్వీన్స్ టైలరింగ్ షాప్' పెట్టాను. నా స్విమ్మింగ్ కెరీర్ మొదలైన తర్వాత నా క్లయింట్‌లు 'నెక్స్ట్ ఎక్కడ ఈదుతున్నారు' అని అడగడంతోపాటు, నాకు ఖర్చులకు డబ్బు సమకూర్చడం కోసం వాళ్లు వెంటనే అవసరం లేని దుస్తులు కూడా ఇచ్చి పని చేయించుకునేవాళ్లు. నా భర్త, నా క్లయింట్‌ల సహకారమే తప్ప ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రోత్సాహకంగా అందుకోలేదు. మొదట్నుంచీ అయిన ఖర్చు లెక్క ఎంతో చెప్పలేను, కానీ ఇంగ్లిష్ చానెల్ కోసం ఎనిమిది లక్షల రూపాయలు ఖర్చయ్యాయి. ఒక మిడిల్ క్లాస్ గృహిణిని, ఇద్దరు పిల్లల తల్లిని. ఆ డబ్బును ఇంటి కోసమో, పిల్లల చదువు కోసమో ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్న మహిళను. అలాంటి స్థితిలో ఉన్న నేను ఇంత ఖర్చు చేసింది ఒక అచీవ్‌మెంట్ కోసం. చిన్నప్పుడు స్కూల్లో కబడీ, ఖోఖో ఆడేదాన్ని. ఆడపిల్లనైన కారణంగా, మధ్య తరగతి కుటుంబం అయిన కారణంగా క్రీడాజీవితం తెర వెనక్కి వెళ్లిపోయింది.

పిల్లలు బద్ధకించేవాళ్లు

మా పిల్లలిద్దరినీ స్విమ్మింగ్‌లో చేర్పాం. ప్రాక్టీస్‌కెళ్లడానికి బద్ధకించేవాళ్లు. అలసట, నీరసం, ఓపిక లేదు, ఇంటరెస్ట్ లేదు... రోజూ ఏదో ఓ సాకు చెప్పేవాళ్లు. వాళ్లకు బాధ్యత నేర్పడానికి ప్రయత్నించినప్పుడు 'నీకు చెప్పడానికి బాగానే ఉంటుంది. రోజూ నీటిలో దిగి ఈత కొడితే కదా తెలుస్తుంది' అన్నారు. 'అంతకష్టమైన పనా, చూద్దాం పదండి' అని నేను కూడా జాయినయ్యాను.

– క్వీనీ విక్టోరియా గంధం, స్విమ్మర్

కానీ అనుకోకుండా పిల్లల రూపంలో వచ్చిన అవకాశాన్ని నేను జారవిడుచుకోలేదు. మహిళలందరికీ నేను చెప్పేదొక్కటే. మీరూ కలలు కని ఉంటారు. నిద్రలో జోగుతున్న ఆ కలల కళ్లు తెరవండి. కలను నిజం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి.

క్వీన్‌ను కలిసింది!

ఇంగ్లిష్ చానెల్ ఈదడం కోసం లండన్‌లో ఉన్న సమయంలోనే నా పుట్టినరోజు (జూన్ 30) వచ్చింది. మా నానమ్మ గంధం కాంతమ్మ. ఆమె దేవరకొండ మిషనరీ స్కూల్‌లో టీచర్. క్వీన్ విక్టోరియా మన దేశానికి వచ్చినప్పుడు ఆమెను కలిసిందట మా నానమ్మ. ఆమె స్ఫూర్తితోనే నాకు పేరు పెట్టింది. నేను ఆ క్వీన్ నేలమీదకు వెళ్లి ఈత విజేతగా నిలవడానికి నాంది మా నాన్నమ్మ పేరు పెట్టడంతో ముడివడిందేమోననిపించింది. మొత్తంగా నాకు ఈ విజయం అత్యంత సంతోషకరమైన క్షణాలనిచ్చింది'' అంటూ తన పేరు విజేతగా చరిత్రలో నమోదు కావడం గర్వంగా ఉందన్నారు క్వీనీ విక్టోరియా.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : **మోహనాచారి**

ఆషాఢం

నాగదోష నివారణకు.. సంతాన ప్రాప్తికి...



జ్ఞానవృద్ధికీ, కుజదోష నివారణకు, సంతాన ప్రాప్తికీ సుబ్రహ్మణ్య ఆరాధన సర్వ శ్రేష్ఠం. స్కంద పంచమి, షష్ఠి రోజుల్లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల శుభాలు చేకూరుతాయని పురాణ వచనం. ఆషాఢ శుద్ధ పంచమికి స్కంద పంచమి అని, షష్ఠికి కుమార షష్ఠి అనీ పేరు. ఈ స్కంద పంచమి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామిని అష్టోత్తర, శత నామావళితో పూజించి పాలు, పానకం, చలిమిడి నివేదించాలి. మర్నాడు ఉపవాసం ఉండి, కుమార వ్రతం ఆచరించాలి. అనంతరం బ్రహ్మచారికి భోజనం పెట్టి, నూతన వస్త్రాలు, దక్షిణ, తాంబూలాలు సమర్పించాలి.
(నేడు స్కంద పంచమి, రేపు కుమార షష్ఠి)

ఆహారం

అపోహ | వాస్తవం



సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

ఇడ్లీ, దోశల కోసం మినపప్పును మిక్సీలో వేస్తే పోషకాలు నశిస్తాయా? తప్పనిసరిగా వెట్ గ్రైండర్‌లో రుబ్బాల్సిందేనా?

ఇడ్లీ, దోశల రుచి మంత్రం పిండిరుబ్బడంలోనే ఉంటుందని పెద్దవాళ్లు చెప్పేమాటలో చాలా అర్థం ఉంది. రుచి మాత్రమే కాదు, ఇందులో ఆరోగ్యం కూడా దాగి ఉంది. అందుకే మిక్సీ కంటే వెట్ గ్రైండర్‌దే తొలి ప్రాధాన్యం. ఎందుకంటే మిక్సీతో పోలిస్తే వెట్ గ్రైండర్‌లో పిండి రుబ్బేటప్పుడు అందులో ఎక్కువ వేడి ఉత్పన్నం కాదు. పిండి మెదిగే క్రమంలో వేడి ఎక్కువైతే ఆ దినుసుల్లో ఉండే మైక్రో ఆర్గానిజమ్స్‌ను కోల్పోతాం. మైక్రో ఆర్గానిజమ్స్ పిండి ఫెర్మెంటేషన్‌కు (పులిసి, పొంగి, గుల్లగా రావడం) దోహదం చేస్తాయి. ఫెర్మెంటేషన్ బాగా జరిగితే ఆ పిండిలో జీర్ణవ్యవస్థ పనితీరుకు అవసరమైన ప్రోబయాటిక్ మోతాదు పెరుగుతుంది.

వెట్ గ్రైండర్‌లో పిండి మెదిగే క్రమంలో గోరువెచ్చగా మారుతుంది. ఆ ఉష్ణోగ్రత వల్ల పప్పుల్లో ఉండే మినరల్స్, విటమిన్స్ చక్కగా రక్షింపబడతాయి. మెత్తగా రుబ్బడం కూడా మంచిదే. బాగా పొంగిన మెత్తని పిండితో చేసిన ఇడ్లీలలోని పోషకాలను దేహం సరిగ్గా పీల్చుకోగలుగుతుంది. రాయికీ రాయికీ మధ్య రాపిడి వల్ల పప్పులు, బియ్యం మెదగడం ఆరోగ్యకరమైన పద్ధతి. ఇది పదార్థంలోని రుచిని పెంచడమే కాకుండా పోషకాలను పరిరక్షించి పిండిని ఆరోగ్యకరమైన ఆహారంగా మారుస్తుంది.

హెల్త్ ఫ్యాక్ట్

సిగరెట్ సగమే... రిస్క్ పూర్తి



సిగరెట్ అస్సలు ముట్టనివాళ్లతో పోలిస్తే... సగం సగం లేదా ఒకటి, రెండు ఫఫ్స్ తీసుకునే వారిలో 64 శాతం మందికి మామూలుగా పొగాకుతో కలిగే ముప్పులన్నీ వస్తుంటాయని హెచ్చరిస్తున్నారు యూఎస్‌లోని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చెందిన అధ్యయనవేత్తలు. ఆ అధ్యయనంలోని వివరాల ప్రకారం కొద్ది కొద్దిగా పఫ్ పీల్చినప్పటికీ వాళ్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ముప్పు ఇరత ఆరోగ్యకరమైన వ్యక్తుల కంటే 12 రెట్లు ఎక్కువని, అంతేకాకుండా కొద్దిపాటి మోతాదులోనైనా పొగ పీల్చేవాళ్లలో ఎంఫసిమా వంటి శ్వాసకోశ వ్యాధులు వచ్చే ముప్పు రెండున్నర రెట్లు అధికమని తేలింది. యాభై తొమ్మిది నుంచి ఎనభై రెండేళ్ల వరకు వయసున్న మొత్తం మూడు లక్షల మందిపై ఓ అధ్యయనం నిర్వహించాక వాటి ఫలితాలను బట్టి ఈ అంశాలు వెల్లడయ్యాయి.

యూత్ ప్లస్

ఇంకొంచెం ఇస్మార్ట్‌గా...

అటు ఫ్యాషన్‌ని, ఇటు ఫిట్‌నెస్‌ని... మిళితం చేసి ఫ్యాషనబుల్ ఫిట్‌నెస్ డివైజ్‌లపై ఆసక్తి ప్రదర్శిస్తోంది యువతరం. స్మార్ట్ రింగ్స్ నుంచి ఫిట్‌నెస్ ట్రాకర్‌ల వరకు ఎన్నో డివైజ్‌లను ఇష్టపడుతున్నారు యువత.

యువతరంలో పెరుగుతున్న సెల్ఫ్–ట్రాకింగ్ కల్చర్, బయోఫీడ్ బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకొని శాంసంగ్, యాపిల్ లాంటి దిగ్గజ సంస్థలు ఫిట్‌నెస్ డివైజ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాయి...



బాలీవుడ్ నటి ఆలియా భట్‌ను ఫిట్‌నెస్ డివైజ్‌ల గురించి అడిగితే బోలెడు విషయాలు చెబుతుంది. ఆమెకు ఇష్టమైనది ఒరా రింగ్. ఫిన్‌ల్యాండ్‌లో తయారైన ఈ సెన్సర్–లోడెడ్ టైటానియమ్ రింగ్‌కు యువతరంలో ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. తన బయో–ట్రాకింగ్ సామర్థ్యంతో 'ఒరా'కు కల్ట్ ఫాలోయింగ్ ఏర్పడింది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని యాపిల్, శాంసంగ్ లాంటి టెక్ దిగ్గజాలు తమదైన సొంత వెర్షన్‌ను సిద్ధం చేస్తున్నాయి.

స్మార్ట్ రింగ్‌లకు యువతంలోని క్రేజ్‌ను గమనించి నాయిస్, అల్ట్రాహ్యూమన్, పై రింగ్‌లాంటి ఎన్నో కంపెనీలు రంగంలోకి దిగాయి. 'మా స్మార్ట్‌రింగ్స్ లాంచ్ అయిన 24 గంటల్లోనే అమ్ముడు అయ్యాయి' అంటున్నాడు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ 'బోట్' కో–ఫౌండర్ అమన్ గుప్తా.

వివిధ కంపెనీల స్మార్ట్‌రింగ్‌లు హార్ట్‌రేట్ నుంచి ఆక్సిజన్ ఫ్లో వరకు మానిటర్ చేస్తాయి.

నాయిస్, అల్ట్రాహ్యూమన్, పీ రింగ్‌లాంటి కంపెనీలు అందుబాటు ధరల్లో ఉండే స్మార్ట్ రింగ్స్, గ్లూకోజ్ మానిటరింగ్ డివైజ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. మన దేశంలో యువతరాన్ని భయపెడుతున్న వ్యాధి డయాబెటిస్.

మన దేశంలో యువతరంలో డయాబెటిస్ పెరుగుతున్న నేపథ్యంలో టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌ను దృష్టిలో పెట్టుకొని అల్ట్రాహ్యూమన్, కంటూర్ ప్లస్‌లాంటి గ్లూకోజ్ మానిటర్ డివైజ్‌లు వచ్చాయి.

'వ్యక్తిగత ఆరోగ్యం గురించి శ్రద్ధ పెరిగినప్పుడు హెల్త్ కేర్ టూల్స్‌కు ప్రాధాన్యత పెరగడం అనేది సహజ విషయం' అంటున్నాడు అమన్ గుప్తా.

ఫిట్‌నెస్ టూల్స్ గురించి యూత్‌లో ఆసక్తి పెరగడం ఆహ్వానించదగిన పరిణామం అంటుంది నేషనల్ ఫుట్‌బాల్ టీమ్ గోల్‌కీపర్, షీ కిక్స్ ఫుట్‌బాల్ అకాడమీ వ్యవస్థాపకురాలు అదితి చౌహాన్.

'వ్యాయామ సమయంలో నా శరీరం పనితీరును, నిద్రను పర్యవేక్షించడానికి నేను యాపిల్ వాచ్‌ను ఉపయోగిస్తాను. సమయానికి నిద్రపోవడం లాంటి వాటిని ఇది సూచిస్తుంది' అంటుంది అదితి.

స్టెప్స్, ఫిజికల్ యాక్టివిటీలను ట్రాక్ చేసే ఫిట్‌నెస్ వాచ్‌లను ధరించడానికి యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఒకప్పుడు నాకు ఆరోగ్య విషయాలపై శ్రద్ధ ఉండేది. అయితే కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చిన తరువాత నాలో మార్పు వచ్చింది. బయోఫీడ్‌బ్యాక్‌పై ఆసక్తి పెరిగింది. దీంతో రకరకాల గ్యాడ్జెట్స్‌ను వాడుతున్నాను' అంటుంది బెంగళూరుకు చెందిన ఎంసీఏ స్టూడెంట్ సజిత.

హెల్త్‌గ్యాడ్జెట్స్‌ను ప్రేమించేవారితో పాటు వాటి అతి వినియోగాన్ని విమర్శిస్తున్న వారు కూడా యూత్‌లో ఉన్నారు.

'వందశాతం కచ్చితత్వం కోసం సర్టిఫైడ్ టూల్స్ మాత్రమే వాడాలి. లేకపోతే అనవసర ఆందోళనకు దగ్గర కావాల్సి వస్తుంది. గ్యాడ్జెట్‌ల వాడకంలో ఆచితూచి వ్యవహరించాలి' అంటున్నారు నిపుణులు.

'వెల్‌నెస్ వేరబుల్ టెక్నాలజీదే భవిష్యత్' అనే మాట వినిపిస్తున్నప్పటికీ వేలం వెర్రి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా యువతరంపై ఉంది.



ఐసీసీ 'ప్లేయర్స్ ఆఫ్ ద మంత్'గా బుమ్రా, స్మృతి

జూన్ నెలకుగాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులకు మహిళల విభాగంలో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన... పురుషుల విభాగంలో భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎంపికయ్యారు. జూన్ నెలలో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో స్మృతి 343 పరుగులు చేసింది. మరోవైపు బుమ్రా టి20 ప్రపంచకప్‌లో 15 వికెట్లు తీశాడు.

అండర్సన్... ఆఖరిసారి బరిలోకి...



రెండు దశాబ్దాలుగా ఇంగ్లండ్ పేస్ బౌలింగ్‌కు ముఖచిత్రంగా ఉన్న జేమ్స్ అండర్సన్ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి టెస్టు ఆడనున్నాడు. 2003 మే నెలలో జింబాబ్వేపై లార్డ్స్ మైదానంలో తొలి టెస్టు ఆడిన అండర్సన్ తన కెరీర్‌లో చివరి టెస్టును కూడా లార్డ్స్ మైదానంలోనే ఆడనున్నాడు. వెస్టిండీస్ జట్టుతో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేడు లార్డ్స్ మైదానంలో మొదలయ్యే తొలి టెస్టులో అండర్సన్ జాతీయ జట్టు తరఫున ఆఖరిసారి బరిలోకి దిగనున్నాడు. 187 టెస్టులు ఆడిన 41 ఏళ్ల అండర్సన్ 700 వికెట్లు పడగొట్టాడు.

ఘనవిజయంతో ముగింపు



టి20 సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా, భారత కెప్టెన్ హర్మన్

- చివరి టి20లో 10 వికెట్లతో నెగ్గిన భారత మహిళల జట్టు
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- స్మృతి అజేయ అర్ధసెంచరీ
- దక్షిణాఫ్రికాతో సిరీస్ 1–1తో సమం

చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌ను 1–1తో సమంగా ముగించింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 10 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. తొలి టి20లో దక్షిణాఫ్రికా నెగ్గగా... రెండో టి20 వర్షం కారణంగా రద్దయింది. 2006 నుంచి ఇప్పటి వరకు 187 టి20 మ్యాచ్‌లు ఆడిన భారత జట్టుకిది 100వ విజయం కావడం విశేషం. ప్రత్యర్థి జట్టుపై టీమిండియా 10 వికెట్లతో నెగ్గడం ఇది మూడోసారి. ఈ మ్యాచ్‌కంటే ముందు భారత జట్టు 2016లో ఆస్ట్రేలియాపై, 2019లో వెస్టిండీస్‌పై 10 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్‌ను సమం చేయాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన భారత జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 17.1 ఓవర్లలో 84 పరుగులకే కుప్పకూలింది. భారత పేస్ బౌలర్ పూజా వస్త్రకర్ 13 పరుగులిచ్చి 4 వికెట్లు, స్పిన్నర్ రాధా యాదవ్ 6 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను దెబ్బ తీశారు. అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు. అనంతరం 85 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు ఆడుతూపాడుతూ ఛేదించింది. 10.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 88 పరుగులు చేసి టీమిండియా గెలిచింది. స్మృతి మంధాన (40 బంతుల్లో 54 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా... షఫాలీ వర్మ (25 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) కూడా రాణించింది. పూజా వస్త్రకర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లౌరా వొల్‌వార్ట్ (సి) అరుంధతి (బి) శ్రేయాంక 9; తజ్మీన్ బ్రిట్స్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 20; మరిజన్ కాప్ (సి) షఫాలీ (బి) పూజ 10; అనెక్ బోష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పూజ 17; చోల్ ట్రయాన్ (సి) రాధ (బి) అరుంధతి 9; నదినె డి క్లెర్క్ (బి) పూజ 0; డెర్క్‌సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రాధ 2; సినాలో జాఫ్టా (సి) అరుంధతి (బి) రాధ 8; ఎలీజ్ (బి) ఉమా ఛెత్రి (బి) పూజ 7; మలాబా (సి) సజన (బి) రాధ 0; ఖాకా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (17.1 ఓవర్లలో ఆలౌట్) 84.**

వికెట్ల పతనం: 1-19, 2-30, 3-45, 4-61, 5-61, 6-65, 7-75, 8-84, 9-84, 10-84. **బౌలింగ్:** పూజా వస్త్రకర్ 3.1-0-13-4, సజన 1-0-11-0, అరుంధతి రెడ్డి 3-0-14-1, శ్రేయాంక పాటిల్ 3-0-19-1, రాధా యాదవ్ 3-1-6-3, దీప్తి శర్మ 4-0-21-1. **భారత ఇన్నింగ్స్:** షఫాలీ (నాటౌట్) 27; స్మృతి మంధాన (నాటౌట్) 54; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (10.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా) 88.** **బౌలింగ్:** ఖాకా 2-0-20-0, కాప్ 2-0-3-0, ట్రయాన్ 2-0-8-0, ఎలీజ్ 1-0-11-0, మలాబా 2-0-20-0, క్లెర్క్ 1.5-0-22-0.

టాప్ సీడ్ సినెర్‌కు షాక్

ఐదు సెట్‌లలో మెద్వెదెవ్ విజయం




లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. 4 గంటల పాటు జరిగిన మ్యాచ్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-7 (7/9), 6-4, 7-6 (7/4), 2-6, 6-3తో సినెర్‌ను బోల్తా కొట్టించి వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరో క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) 5-7, 6-4, 6-2, 6-2తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించాడు. రెండో సీడ్ జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో 37వ ర్యాంకర్ డోనా వెకిచ్ (క్రొయేషియా) 5-7, 6-4, 6-1తో లులు సున్ (న్యూజిలాండ్)పై, ఏడో ర్యాంకర్ జాస్మిన్ (ఇటలీ) 6-2, 6-1తో 19వ సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)పై నెగ్గి సెమీఫైనల్‌కు చేరారు.

గౌతముడే శిక్షకుడు

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్

బీసీసీఐ అధికారిక ప్రకటన • మూడున్నరేళ్ల పాటు పదవీ కాలం



భారత క్రికెట్‌కు సంబంధించి గత కొంత కాలంగా వినిపించిన 'బహిరంగ రహస్యం' ఇప్పుడు అధికారికంగా ఆమోదముద్ర పొందింది. టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం దరఖాస్తులు కోరిన నాటినుంచి వినిపించిన పేరునే బీసీసీఐ ఖరారు చేసింది. ఇంటర్వ్యూలాంటి లాంఛనాలు ముగించక ముందే అందరికీ తెలిసిపోయిన పేరుకే బోర్డు ఓటు వేసింది. మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్‌ను భారత సీనియర్ పురుషుల జట్టు కొత్త హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వరల్డ్ కప్ విజయం తర్వాత కోచ్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న గంభీర్ మూడున్నరేళ్ల పాటు జట్టుకు శిక్షకుడిగా వ్యవహరిస్తాడు. ఆటగాడిగా మైదానంలో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరించిన గంభీర్... మృదుస్వభావి ద్రవిడ్‌కు కోచింగ్ వారసుడిగా ఎలాంటి ముద్ర చూపిస్తాడనే ఆసక్తికరం.

> "నా చిరునామా భారతదేశం. దేశానికి సేవ చేయగలడం నా జీవితంలో కలిగిన అతి పెద్ద అదృష్టం. ఇప్పుడు మరో రూపంలో పునరాగమనం చేయడం గౌరవంగా భావిస్తున్నా. ఎప్పటిలాగే ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేయడమే నా లక్ష్యం. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను టీమిండియా మోస్తుంది. వారి కలలు నిజం చేసేందుకు నా స్థాయిలో ఏదైనా చేసేందుకు నేను సిద్ధం.
>
> –గౌతమ్ గంభీర్, భారత జట్టు కొత్త హెడ్ కోచ్

ముంబై: భారత మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ ఇకపై కొత్త పాత్రలో టీమిండియాతో కలిసి పని చేయనున్నాడు. 43 ఏళ్ల గంభీర్‌ను భారత హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు మంగళవారం బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) అన్ని దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూల అనంతరం గంభీర్‌ను కోచ్‌గా ఎంపిక చేసింది. ఈ నెల 27 నుంచి శ్రీలంక గడ్డపై భారత జట్టు 3 వన్డేలు, 3 టి20లు ఆడుతుంది. ఇదే సిరీస్ నుంచి గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. డిసెంబర్ 2027 వరకు అతని పదవీ కాలం ఉంటుంది. కొత్త కోచ్ కోసం మే 13 నుంచి బీసీసీఐ దరఖాస్తులు కోరింది. అంతకుముందే కోచ్ పదవిని స్వీకరించమంటూ మరో మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్‌ను బీసీసీఐ కోరినా... అతను తిరస్కరించాడు. తన ఆసక్తిని బహిరంగంగానే ప్రకటిస్తూ గంభీర్ కూడా దరఖాస్తు చేసుకోగా, ఒక్క డబ్ల్యూవీ రామన్ మాత్రమే అతనితో పోటీ పడ్డాడు. ఎలాగూ ముందే నిర్ణయించేశారనే భావన వల్ల కావచ్చు, విదేశీ కోచ్‌లు ఎవరూ ఆసక్తి చూపించలేదు. చివరకు ఊహించినట్లుగా గంభీర్‌కు పగ్గాలు లభించాయి.

ఆటగాడిగా ఘనమైన రికార్డు...

2004-2012 మధ్య కాలంలో మూడు ఫార్మాట్‌లలో గంభీర్ ఓపెనర్‌గా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 58 టెస్టుల్లో 41.95 సగటుతో 4154 పరుగులు చేసిన అతను 9 సెంచరీలు, 22 అర్ధసెంచరీలు చేశాడు. 147 వన్డేల్లో 39.68 సగటుతో 5238 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 34 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 37 అంతర్జాతీయ టి20ల్లో 119.02 స్ట్రయిక్ రేట్, 7 హాఫ్ సెంచరీలతో 932 పరుగులు పరుగులు సాధించాడు. అన్నింటికి మించి చిరకాలం గుర్తుంచుకునే గంభీర్ రెండు అత్యుత్తమ ప్రదర్శనలు ప్రపంచ కప్ ఫైనల్స్‌లో వచ్చాయి. పాకిస్తాన్‌తో 2007 టి20 వరల్డ్ కప్ ఫైనల్లో 75 పరుగులతో, శ్రీలంకతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో 97 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నేపియర్‌లో న్యూజిలాండ్‌తో 11 గంటల పాటు క్రీజ్‌లో నిలిచి 436 బంతుల్లో 137 పరుగులు చేసి భారత్‌ను ఓటమి నుంచి కాపాడటం టెస్టుల్లో అతని అత్యుత్తమ ప్రదర్శన. ఐపీఎల్‌లో ముందుగా ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన గంభీర్ ఆ తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మారాడు. 2012, 2014లలో కెప్టెన్‌గా కేకేఆర్‌కు ఐపీఎల్ టైటిల్ అందించాడు.

కోచ్‌గా తొలిసారి...

రిటైర్మెంట్ తర్వాత చాలామందిలాగే గంభీర్ కూడా కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా పని చేశాడు. 2019లో బీజేపీ తరఫున ఈస్ట్ ఢిల్లీ నుంచి పార్లమెంట్ సభ్యుడిగా కూడా ఎన్నికయిన అతను పదవీ కాలం ముగిసిన తర్వాత ఈ ఏడాది ఎన్నికలకు ముందు రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే అధికారికంగా కోచ్ హోదాలో పని చేయడం గంభీర్‌కు ఇదే తొలిసారి. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు 2022, 2023 సీజన్లలో మెంటార్‌గా వ్యవహరించగా, రెండుసార్లు కూడా లక్నో 'ప్లే ఆఫ్స్'కు చేరింది. అయితే 2024 సీజన్‌లో కోల్‌కతాకు మెంటార్‌గా వెళ్లిన అతను టీమ్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సాఫల్యమే అతడిని భారత జట్టు కోచ్ రేసులో ముందంజలో నిలిపింది. మరోవైపు టి20 వరల్డ్ కప్ వరకు జట్టుతో పని చేసిన విక్రమ్ రాథోడ్ (బ్యాటింగ్ కోచ్), పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్), టి.దిలీప్ (ఫీల్డింగ్ కోచ్) పదవీ కాలం కూడా ముగిసినట్లు బీసీసీఐ ప్రకటించింది. వీరి స్థానాల్లో తన ఆలోచనలకు అనుగుణంగా కొత్త బృందాన్ని ఎంచుకునే అధికారం గంభీర్‌కు ఉంది.



2007 టి20 వరల్డ్‌కప్ విజేత జట్టు సభ్యులతో



2011 వన్డే వరల్డ్‌కప్‌తో...

మరో విజయంపై భారత్ దృష్టి

- నేడు జింబాబ్వేతో మూడో టి20 మ్యాచ్
- సాయంత్రం గం. 4:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

హరారే: యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, శివమ్ దూబే చేరికతో మరింత పటిష్టంగా మారిన భారత జట్టు... నేడు జింబాబ్వేతో జరిగే మూడో టి20 మ్యాచ్‌లో భారీ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రెండో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీ, రుతురాజ్ అర్ధసెంచరీతో మెరిశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మూడో మ్యాచ్‌లో రాణిస్తాడో లేదో చూడాలి.

సినిమా

వీరి వీరి గుమ్మడిపండు ఈ స్టార్ ఎవరు?

వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి? అని కళ్లకు గంతలు కట్టి అడుగుతారు. కానీ గంతలు కట్టకుండానే ఫొటోలు చూపించి, వీరి వీరి గుమ్మడిపండు ఈ స్టార్ ఎవరు? అని అడిగితే... పేరు చెప్పడానికి తడబడాల్సిందే. అలా పోల్చుకోలేనంతగా మారిపోయారు కొందరు స్టార్స్. గుర్తుపట్టలేని వెరైటీ గెటప్స్‌లో ఆ స్టార్స్ కనిపించనున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.



• కథ డిమాండ్ చేస్తే అందులోని గెటప్‌లోకి అవలీలగా మారిపోతారు కమల్‌హాసన్. 'భామనే సత్యభామనే'లో బామ్మగా, పది అవతారాల్లో 'దశావతారం' వంటి చిత్రాలు అందుకు మంచి ఉదాహరణలు. 'దశావతారం' (2008) తర్వాత కమల్ ఒకే సినిమాలో ఎక్కువ గెటప్స్‌లో కనిపించలేదు. ఇప్పుడు 'ఇండియన్ 2' ('భారతీయుడు 2')లో ఐదారు గెటప్స్‌లో కనిపించనున్నారు. వీటిలో ఒకట్రెండు గెటప్స్ ఇప్పటికే బయటకు రాగా మిగిలినవి థియేటర్స్‌లో సర్‌ప్రైజ్‌గా ఉండబోతున్నాయని తెలిసింది. 'భారతీయుడు 2' కథ రీత్యా కమల్ వందేళ్ల వయసుపైబడిన సేనాపతి పాత్రలో నటించారు. మొత్తంగా ఆయన ఎన్ని పాత్రల్లో కనిపిస్తారో థియేటర్స్‌లోనే చూడాలి. ఇక శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్ 2' తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ నెల 12న విడుదల కానుంది.







• మేకోవర్, కొత్త గెటప్ అనగానే వెంటనే గుర్తొచ్చే హీరోల్లో విక్రమ్ ఒకరు. 'పితామగన్' ('శివ పుత్రుడు'), సేతు, అపరిచితుడు, ఐ, కోబ్రా'... ఇలా చెప్పుకుంటూ పోతే విక్రమ్ చేసిన ప్రయోగాత్మక చిత్రాల్లోని పాత్రల జాబితా ఎక్కువగానే ఉంటుంది. తాజాగా 'తంగలాన్'లోనూ విక్రమ్ వినూత్నంగా కనిపించనున్నారు. పద్దెనిమిదో శతాబ్దంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) నేపథ్యంలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'తంగలాన్' తీశామని ఈ చిత్రదర్శకుడు పా. రంజిత్ పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రంలో హీరోయిన్లు మాళవికా మోహనన్, పార్వతీ తిరువోత్తుల గెటప్స్ కూడా పూర్తి డీ-గ్లామరస్‌గా, ఆడియన్స్ గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి.



• డిఫరెంట్ సినిమాలతో ఆడియన్స్‌ను మెప్పించడంలో ధనుష్ ముందు ఉంటారు. ఈ విలక్షణ హీరో ప్రస్తుతం దర్శకుడు శేఖర్ కమ్ములతో 'కుబేర' సినిమా చేస్తున్నారు. ఇందులో నాగార్జున మరో హీరో. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా, సామాజిక అసమానతల మేళవింపుతో రానున్న ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో ధనుష్ బిచ్చగాడి గెటప్‌లో కనిపిస్తారట.






• తమిళ హిట్ ఫిల్మ్ 'సారపట్ట పరంపరై'లో డీ-గ్లామరస్ రోల్‌లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు హీరోయిన్ దుషారా విజయన్. ఇప్పుడైతే మరీ గుర్తుపట్టలేని గెటప్‌లో కనిపించనున్నారు. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'రాయన్' సినిమాలోనే ఆమె గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఈ సినిమాలో దుషారతో పాటు వరలక్ష్మీ శరత్‌కుమార్, అపర్ణా బాలమురళి కూడా డీగ్లామరస్ రోల్స్‌లోనే కనిపిస్తారు. సందీప్ కిషన్, కాళిదాసు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు అన్నదమ్ముల కథగా సాగే ఈ మూవీ ఈ నెల 26న రిలీజ్ కానుంది.



• మాస్ హీరో అనిపించుకున్న విశ్వక్ సేన్ లేడీ గెటప్ వేశారు. అది 'లైలా' సినిమా కోసం అన్నమాట. ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఫస్టాఫ్ అబ్బాయిగా, సెకండాఫ్ లైలా అనే అమ్మాయిగా కనిపిస్తారు. ఆకాంక్షా శర్మను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ రామ్‌నారాయణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా విడుదల కానుంది.



• అటు కన్నడకు వెళితే ఇప్పుడు శివ రాజ్‌కుమార్ గెటప్ హాట్ టాపిక్‌గా నిలిచింది. 'భైరవనకోనెపాత' అనే చిత్రంలో శివ రాజ్‌కుమార్ గుర్తుపట్టలేని గెటప్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి హేమంత్ రావు దర్శకుడు. ఈ సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది.

ఇలా గుర్తు పట్టలేని గెటప్‌కి సై అని, సవాల్‌గా తీసుకుని నటిస్తున్న స్టార్స్ మరికొందరు ఉన్నారు.

అది మన నేల గొప్పదనం

– మంచు లక్ష్మి



''ఆదిపర్వం' వంటి సోషియో ఫ్యాంటసీ కథల్ని ప్రేక్షకులకు చూపిస్తున్నామంటే అది మన నేల గొప్పదనం. ఈ శక్తివంతమైన గడ్డ మీద ఉన్నాం కాబట్టే ఇలాంటి నేపథ్యాలతో సినిమాలు చేయగలుగుతున్నాం'' అని నటి మంచు లక్ష్మి అన్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తేర్ నోరోనా, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాశ్, సుహాసిని ఇతర పాత్రల్లో నటించారు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్విక్షా ఆర్ట్స్, ఏఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం తెలుగుతో పాటు కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం పాట ఆవిష్కరణ కార్యక్రమంలో మంచు లక్ష్మి మాట్లాడుతూ– ''ఇటీవల 'యక్షిణి' వెబ్ సిరీస్ చేశాను... చాలా మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు 'ఆదిపర్వం' చేశాను. దేవత అయినా దెయ్యం పాత్ర అయినా నన్నే సంప్రదిస్తున్నారు'' అన్నారు. ''ఆదిపర్వం'లో నాగులాపురం నాగమ్మ పాత్ర చేశారు లక్ష్మి. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు హైలైట్ అవుతాయి'' అన్నారు సంజీవ్ మేగోటి. ''ఈ చిత్రంలో నేను క్షేత్రపాలకుడి పాత్ర చేశాను'' అన్నారు శివ కంఠంనేని.



• త్రిష

బృంద వస్తోంది

హీరోయిన్ త్రిష టైటిల్ రోల్‌లో నటించిన థ్రిల్లింగ్ క్రైమ్ మిస్టరీ వెబ్ సిరీస్ 'బృంద'. సూర్య మనోజ్ వంగాల దర్శకత్వం వహించిన ఈ సిరీస్ టీజర్ విడుదలైంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లో ఆగస్టు 2 నుంచి ఈ సిరీస్ సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రాకేందు మౌళి కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్‌లో పోలీసాఫీసర్ బృందగా త్రిష నటించారు. ఆమె నటించిన తొలి వెబ్ సిరీస్ ఇదే కావడం విశేషం.

సస్పెన్స్... థ్రిల్



• అజయ్

అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను నటించిన చిత్రం 'కేస్ నం. 15'. తడకల వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో బీజీ వెంచర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ– ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కేస్ నం.15'. అజయ్ మంచి పాత్ర చేశారు. ఆయనకు మంచి పేరు వస్తుంది. రవిప్రకాశ్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి'' అన్నారు.

డల్లాస్‌లో...



• వీఎస్ ఆదిత్య

''మనసంతా నువ్వే, శ్రీరామ్, నేనున్నాను' వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు వీఎస్ ఆదిత్య దర్శకత్వంలో కొత్త సినిమా రానుంది. ఓఎంజీ ప్రొడక్షన్ హౌస్‌లో మీనాక్షి అనిపిండి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని మంగళవారం ప్రకటించారు మేకర్స్. కాగా ఈ చిత్ర నిర్మాణం డల్లాస్‌లో జరగనుందట. అందుకే అక్కడ ఆడిషన్స్ నిర్వహించింది చిత్రబృందం. ''ఈ సినిమా వీఎస్ ఆదిత్యగారి శైలిలో ఉంటుంది. గత చిత్రాల్లోలానే ఈ చిత్రంలోనూ ఆయన సున్నితమైన భావోద్వేగాలకు పెద్దపీట వేస్తారు. డల్లాస్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌కి ప్రవాస భారతీయులతో పాటు అమెరికన్స్, స్పానిష్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్ రావడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా తెలుగు, తమిళ, కన్నడకు చెందిన వారు భారీ సంఖ్యలో ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుంది'' అన్నారు మేకర్స్.

సరికొత్త కథాంశంతో...



• ప్రగ్యా, ధ్రువ

ధ్రువ వాయు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కళింగ'. ప్రగ్యా నయన్ కథానాయిక. నరేన్ కీలక పాత్రధారి. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మాతలు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేసి, సినిమా హిట్ అవ్వాలన్నారు. ''ఇప్పుడు కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చూసేందుకు ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. సరికొత్త కథతో రూపొందిన మా 'కళింగ' ఆ తరహా చిత్రమే'' అన్నారు మేకర్స్. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

వినోదం... భావోద్వేగం



• రాకేష్ వర్రే, అనూష, వినోద్

వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేక మేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్‌పై రాకేష్ వర్రే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ– ''ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే ఘటనలకి దగ్గరగా ఈ సినిమా తీశాను. కుటుంబంలోని భావోద్వేగాలు, వినోదంతో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''ఇది కేవలం కామెడీ సినిమానే కాదు. పురుషులకి మహిళలు ఇస్తున్న సపోర్ట్ ఏంటన్నది ఈ మూవీలో చూపించాం'' అన్నారు రాకేష్ వర్రే. ''తెలుగులో హీరోగా నా మొదటి సినిమా 'పేక మేడలు'. ఈ చిత్రాన్ని ఆదరించి మా యూనిట్‌ని సపోర్ట్ చేయాలి'' అన్నారు వినోద్ కిషన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
391	113
80,352	24,433

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,402	▲	7
డోజోన్స్	39,423	▲	79
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,140	▼	54
డాక్స్	18,236	▼	236
షాంఘై	2,959	▲	37
నికాయ్	40,580	▲	800

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
72,346	▲	690
బంగారం (99.5 స్వచ్ఛత)		
72,056	▲	399
వెండి (కిలో)		
91,847	▲	114


ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.08	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బీఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

ఆగని బుల్ పరుగు

మార్కెట్ల సరికొత్త రికార్డులు

ఆటో, ఎఫ్‌ఎంసీజీ, అధిక వెయిటేజీ షేర్ల దన్ను | ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు | జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద



ముంబై: ఆటో, ఎఫ్‌ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మరో రికార్డు స్థాయిలకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్ బలపరిచాయి. అధిక వెయిటేజీ మారుతీ సుజుకీ(7%), ఎంఅండ్‌ఎం(3%), ఐటీసీ(2%), ఐసీఐసీఐ బ్యాంక్(1%) రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 391 పాయింట్లు పెరిగి 80,352 వద్ద ముగిసింది. నిఫ్టీ 113 పాయింట్ల లాభంతో 24,433 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు సరికొత్త రికార్డు. ఉదయం లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఆటో, ఎఫ్‌ఎంసీజీతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, వినిమయ, ఫార్మా, యుటిలిటీ, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 437 పాయింట్లు బలపడి 80,397 వద్ద, నిఫ్టీ 123 పాయింట్లు ఎగసి 24,444 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. రికార్డు ర్యాలీలోనూ టెలికం క్యాపిటల్ గూడ్స్, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా చట్ట సభల్లో ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మారుతీ పరుగు



➤ పర్యావరణహిత వాహనాలను ప్రోత్సహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైబ్రిడ్ కార్ల రిజిస్ట్రేషన్ పన్ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. యూపీ సర్కారు నిర్ణయంలో దేశంలో ఈ తరహా కార్లను ఉత్పత్తి చేసే మారుతీ సుజుకీ కంపెనీ షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో 6.60% పెరిగి రూ.12,820 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 8% దూసుకెళ్లి రూ.12,955 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.

➤ నైరుతి రుతుపవనాలు రాకతో దేశవ్యాప్తంగా ఖరీఫ్ సందడి మొదలైంది. దీంతో వినియోగ ఆధారిత రంగ ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

బీఎస్‌ఈ @ రూ. 451.27 లక్షల కోట్లు



➤ స్టాక్ సూచీలు రికార్డు స్థాయికి చేరడంతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. మంగళవారం ఒక్క రోజే రూ.1.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ. 451.27 లక్షల కోట్లకు చేరింది.

కిమ్స్ చేతికి క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్





హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) వైజాగ్‌లోని క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌ను కైవసం చేసుకుంది. 380 పడకల సామర్థ్యం కలిగిన ఈ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని చలసాని హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. క్వీన్స్ ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్‌ను డాక్టర్ రంగారావు చలసాని, డాక్టర్ విజయ లక్ష్మి చలసాని 1994లో స్థాపించారు. ఇప్పటికే వైజాగ్‌లో తమ సంస్థకు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు గ్యాస్ట్రో యూనిట్ ఉందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బి.భాస్కర రావు ఈ సందర్భంగా తెలిపారు.

కిమ్స్... 12 ఆస్పత్రులు– 3,975 పడకలు

కిమ్స్ ఖాతాలో వివిధ నగరాల్లో మొత్తం 12 ఆసుపత్రులకుగాను 3,975 పడకలు ఉన్నాయి. విస్తరణలో భాగంగా వచ్చే 18 నెలల్లో 1,500–2,000 పడకలు జత కానున్నాయని కంపెనీ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ లాభం 15 శాతం వృద్ధి చెందుతుందని సంస్థ భావిస్తోంది. కొన్ని చికిత్సల చార్జీలను 2–3 శాతం పెంచే అంశాన్ని కిమ్స్ పరిశీలిస్తోంది. బెంగళూరులోని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వద్ద 350 పడకల ఆసుపత్రి ఏర్పాటుకై కిమ్స్ హాస్పిటల్స్ మే నెలలో లీజ్ అగ్రిమెంట్ చేసుకుంది. అలాగే బెంగళూరులోని మహదేవపుర వద్ద నెలకొల్పుతున్న హాస్పిటల్ ఈ ఏడాదే కార్యరూపంలోకి రానుంది. రూ.515 కోట్లతో మహారాష్ట్రలోని థానే వద్ద ఆసుపత్రి స్థాపనకై 99 ఏళ్ల లీజు ఒప్పందాన్ని కిమ్స్ ఇప్పటికే కుదుర్చుకుంది. ఈ ఆసుపత్రి 2025 జనవరి–ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. కార్యకలాపాలు ప్రారంభం అయిన రెండేళ్లలో 400 పడకల పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకోనుంది. కాగా, కిమ్స్ షేరు ధర బీఎస్‌ఈలో మంగళవారం 0.17శాతం లాభపడి రూ.2,103.85 వద్ద స్థిరపడింది.

సైయంట్‌కు ప్రీమియర్ అవార్డు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయంట్ వరుసగా మూడో ఏడాది తమ కస్టమర్ 'ఆర్‌టీఎక్స్' నుంచి ప్రీమియర్ అవార్డును పొందినట్లు వెల్లడించింది. 2023 సంవత్సరానికి గాను కస్టమర్ సర్వీసు, సహకారం, ఆదా అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనపర్చిన సరఫరాదారుగా తాము ఎంపికైనట్లు వివరించింది. కస్టమర్ల సమస్యలకు తగిన పరిష్కారాలను అందించేందుకు తాము చేసే కృషికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం నిదర్శనమని సైయంట్ ఈడీ కార్తికేయన్ నటరాజన్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఆదాయపు పన్ను తగ్గించాలి | ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ మద్దతు

సిలికాంచ్ ఎల్‌అండ్‌టీ సొంతం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్‌అండ్‌టీ తాజాగా బెంగళూరు సంస్థ సిలికాంచ్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేసింది. సొంత అనుబంధ సంస్థ ఎల్‌అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ద్వారా సిలికాంచ్‌లో 100 శాతం వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ)పై సంతకాలు చేసినట్లు ఎల్‌అండ్‌టీ పేర్కొంది. ఇందుకు రూ. 183 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలుతో ఫ్యాబ్‌లెస్ సెమీకండక్టర్ బిజినెస్‌ను మరింత పటిష్టపరచనున్నట్లు తెలియజేసింది. సెప్టెంబర్‌కల్లా డీల్ పూర్తికావచ్చని అంచనా వేసింది.

విజయా డయాగ్నోస్టిక్‌లో వాటా విక్రయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విజయా డయాగ్నోస్టిక్స్‌లో 2.2 శాతం వాటాను అల్ మెహ్వార్ కమర్షియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్‌ఎల్‌సీ విక్రయించింది. ఎన్‌ఎస్‌ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 783 సగటు ధరలో 22.5 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 176 కోట్లుకాగా.. ఇదే ధరలో కొటక్ మహీంద్రా ఎంఎఫ్ 18 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. 2024 మార్చికల్లా విజయా డయాగ్నోస్టిక్‌లో అల్ మెహ్వార్ కమర్షియల్ 2.99 శాతం వాటాను కలిగి ఉంది.

ఫండ్స్‌లోకి పెట్టుబడుల ప్రవాహం

● జూన్‌లో ఈక్విటీల్లోకి రూ.40,608 కోట్లు

ముంబై: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ జూన్‌లో రూ.40,608 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అంతకుముందు నెలలో వచ్చిన పెట్టుబడుల కంటే 17 శాతం అధికం. మే నెలలోనూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ 83 శాతం అధికంగా రూ.34,670 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.1,07,357 కోట్లు బయటకు వెళ్లాయి. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ జూన్ చివరికి రూ.61.15 లక్షల కోట్లకు చేరింది. మే నెలతో పోలిస్తే 4% అధికం. ఇందులో ఈక్విటీ పెట్టుబడుల విలువ రూ.27.67 లక్షల కోట్లుగా ఉంది.

కొత్త గరిష్టానికి సిప్ పెట్టుబడులు

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.21,262 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది నెలవారీ సరికొత్త గరిష్ట స్థాయి. మే నెల సిప్ పెట్టుబడులు రూ.20,904 కోట్లు. జూన్‌లో కొత్తగా 55.13 లక్షల సిప్ రిజిస్ట్రేషన్లు పెరిగాయి. దీంతో మొత్తం సిప్ ఖాతాల సంఖ్య మే చివరికి ఉన్న 8.76 కోట్ల నుంచి జూన్ చివరికి 8.99 కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం సిప్ పెట్టుబడులు రూ.12.44 లక్షల కోట్లకు దూసుకుపోయాయి. మే చివరికి ఇవి రూ.11.53 లక్షల కోట్లుగా ఉన్నాయి. ''మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ చెప్పుకోతగ్గ వృద్ధిని చూసింది. ఆర్థిక స్థిరత్వానికి, కోట్లాది మంది ఇన్వెస్టర్ల సంపద సృష్టికి కీలకంగా మారింది.''అని ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) సీఈవో వెంకట్ చలసాని తెలిపారు.

జూన్‌లో పెట్టుబడులు	రూ.21,262 కోట్లు
మేలో పెట్టుబడులు	రూ.20,904 కోట్లు
పెట్టుబడుల మొత్తం	రూ.12.44 లక్షల కోట్లు

(యాంఫి నివేదిక)



థీమ్యాటిక్ అదుర్స్

రంగాలవారీ/థీమ్యాటిక్ ఫండ్స్ జూన్ నెలలో రూ.22,351 కోట్లు ఆకర్షించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో 9 కొత్త పథకాలు (ఎన్‌ఎఫ్‌వోలు) ప్రారంభమయ్యాయి. ఇవి ఇన్వెస్టర్ల నుంచి రూ.12,974 కోట్లు సమీకరించాయి. మల్టీక్యాప్ ఫండ్స్‌లోకి 78% అధికంగా రూ.4,708 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్‌క్యాప్ పథకాల్లోకి పెట్టుబడులు 46% పెరిగి రూ.970 కోట్లుగా ఉన్నాయి. స్మాల్‌క్యాప్ పథకాల్లోకి 17% తగ్గి రూ.2,263 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి 3% తక్కువగా రూ.2,527 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. హైబ్రిడ్ ఫండ్స్ రూ.8,854 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ప్యాసివ్స్‌లోకి రూ.14,601 కోట్లు వచ్చాయి.

ప్రాపర్టీ విలువ చెప్పే 'మ్యాజిక్ బ్రిక్స్' టూల్



హైదరాబాద్: ప్రముఖ రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫామ్ 'మ్యాజిక్ బ్రిక్స్' ప్రాపర్టీ విలువను అప్పటికప్పుడు తెలుసుకునే టూల్ 'ప్రాప్ వర్త్'ను ఆవిష్కరించింది. అత్యాధునిక మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్‌ల సాయంతో పనిచేసే ఈ టూల్ సాయంతో.. ప్రాపర్టీ అంచనా విలువను కొనుగోలుదారులు, విక్రయదారులు తెలుసుకోవచ్చని మ్యాజిక్ బ్రిక్స్ తెలిపింది. 15 ఏళ్ల డేటా, 30 మిలియన్‌కు పైగా లిస్టింగ్‌ల సాయంతో దీన్ని రూపొందించామని.. 30 పట్టణాల్లోని 5,500 ప్రాంతాల పరిధిలో 50,000 ప్రాజెక్టులు ఈ టూల్ పరిధిలోకి తీసుకొచ్చామని వెల్లడించింది. అపార్ట్‌మెంట్‌లు, విడి ఇళ్లు, విల్లాల విలువలు ఇందులో లభిస్తాయి.

భారత్‌లో వీఎల్‌ఎఫ్ ఎంట్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీలో ఉన్న ఇటలీ కంపెనీ వీఎల్‌ఎఫ్ భారత మార్కెట్లో ప్రవేశించింది. వాహనాల తయారీ, పంపిణీ కోసం కేఏడబ్ల్యూ వెలోస్ మోటార్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాది పండుగల సీజన్‌కల్లా టెన్నిస్ ఈ–స్కూటర్‌ను మూడు వేరియంట్లలో పరిచయం చేస్తోంది. ధర రూ.1.5–2 లక్షల మధ్య ఉండొచ్చని సమాచారం. వేరియంట్‌నుబట్టి 1.44–2.88 కిలోవాట్ అవర్ బ్యాటరీ, మోటార్ పవర్ 1,500–4,000 వాట్స్ ఉంది. 60–100 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 45–100 కిలోమీటర్లు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-7-2024	
విశాఖ	530–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 52 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 52.
- » పోస్టుల వివరాలు: గ్రూప్ ఏ పోస్టులు-09, గ్రూప్ బి పోస్టులు-10, గ్రూప్ సి పోస్టులు-33.
- » గ్రూప్-ఎ పోస్టులు: డిప్యూటీ రిజిస్ట్రార్-02, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్-01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-01, సీనియర్ సిస్టమ్ అనలిస్ట్-01, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-01,అసిస్టెంట్ రిజిస్ట్రార్-02, నెట్‌వర్కింగ్ ఇంజనీర్-01.
- » గ్రూప్-బి పోస్టులు: సెక్షన్ ఆఫీసర్- 3, అసిస్టెంట్ ఇంజనీర్-1, సీనియర్ అసిస్టెంట్-3, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్-1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్-1, పర్సనల్ అసిస్టెంట్-1.
- » గ్రూప్-సి పోస్టులు: టెక్నికల్ అసిస్టెంట్-01, జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ -01, ఆఫీస్ అసిస్టెంట్-04, స్టెనోగ్రాఫర్-05, ల్యాబొరేటరీ అసిస్టెంట్-04, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-14, ల్యాబొరేటరీ అటెండెంట్-04.
- » అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: గ్రూప్-ఏ పోస్టులకు 62 ఏళ్లు, గ్రూప్-బి పోస్టులకు 35 ఏళ్లు, గ్రూప్-సి పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.07.2024.
- » వెబ్‌సైట్: https://uohyd.ac.in

ఏఐఏఎస్‌ఎల్‌లో 1,049 పోస్టులు

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాల పరిమితికి ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 1,049.
- » పోస్టుల వివరాలు: సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్-343, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్-706.
- » అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 33 ఏళ్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
- » వేతనం: నెలకు సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.28,605. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.27,450.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 14.07.2024
- » వెబ్‌సైట్: www.aiasl.in

యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్‌లో 544 అప్రెంటిస్‌లు

దేశవ్యాప్తంగా యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ శాఖల్లో.. 544 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 544 (ఏపీ-07, తెలంగాణ-08).
- » అర్హత:ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » వయసు: 16.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » స్టైపెండ్: నెలకు రూ.15,000. శిక్షణ వ్యవధి: ఏడాది.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది: 16.07.2024.
- » వెబ్‌సైట్: https://ucobank.com/en

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్-నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్‌ఈఆర్ పరిధిలోని అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం ఖాళీల సంఖ్య: 1104
- » వర్క్‌షాప్/యూనిట్: మెకానికల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్ (ఇజ్జత్ నగర్), డీజిల్ షెడ్ (ఇజ్జత్ నగర్),క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్ నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (లక్నో జంక్షన్), డీజిల్ షెడ (గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
- » ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.
- » అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- » వయసు: 12.06.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » శిక్షణ వ్యవధి: ఒక ఏడాది.
- » ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 11.07.2024.
- » వెబ్‌సైట్: https://ner.indianrailways.gov.in

నేవీలో.. 'అగ్నివీర్' కొలువు

పదో తరగతి ఉత్తీర్ణులకు నావికా దళం స్వాగతం పలుకుతోంది! ఎంపికైతే నాలుగేళ్ల పాటు నేవీలో ఉద్యోగానికి అవకాశం కల్పిస్తుంది. ఇందుకోసం ఇండియన్ నేవీ తాజాగా అగ్నివీర్-ఎంఆర్ (మ్యుజిషియన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ నేవీ అగ్నివీర్ (ఎంఆర్)-మ్యుజిషియన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» అగ్నివీర్-ఎంఆర్ (మ్యుజిషియన్) నోటిఫికేషన్
» పదో తరగతి అర్హతతో పోటీ పడే అవకాశం
» ఎంపికైతే నావికా దళంలో నాలుగేళ్ల కొలువు



అగ్నివీర్ ఎంఆర్ అంటే

త్రివిధ దళాల్లో ఉద్యోగాల భర్తీకి కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా అగ్నివీర్ (ఎంఆర్), అగ్నివీర్ (ఎస్ఎస్ఆర్) పేరుతో నియామకాలు జరుపుతున్నారు. అదేవిధంగా మెట్రిక్ రిక్రూట్ (ఎంఆర్) పేరుతో నేవీ నియామకాలు చేపడుతోంది. వీటికి పదో తరగతి ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు. తాజాగా ఎంఆర్ మ్యుజిషియన్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

రెండు వేల పోస్టులు

నేవీ అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషిన్ నోటిఫికేషన్ 2/2024 ద్వారా దాదాపు రెండు వేల పోస్టులను భర్తీ చేసే అవకాశమున్నట్లు సమాచారం. వీటిలో మహిళలకు కూడా నిర్దేశిత సంఖ్యలో పోస్టులను కేటాయిస్తారు. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పదో తరగతి అర్హత

- నేవీ అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు మ్యూజికల్ ఎబిలిటీ కూడా ఉండాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాడటం, ఆయా మ్యూజిక్ పరికరాలపై వాయిద్య నైపుణ్యాలను పరిశీలిస్తారు. కీ బోర్డ్, స్ట్రింగ్/విండ్ ఇన్‌స్ట్రుమెంట్స్/డ్రమ్ కిట్లపై ఉన్న పట్టును పరిశీలిస్తారు.
- వయసు: నవంబర్ 1, 2002–ఏప్రిల్ 30, 2007 మధ్యలో జన్మించి ఉండాలి.
- కనీస ఎత్తు:పురుషులు 158సెంటీ మీటర్లు, మహిళలు 152సెంటీ మీటర్లు ఉండాలి.

అనుభవం సర్టిఫికెట్

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు.. మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి. హిందుస్తానీ, సంప్రదాయ సంగీతం లేదా విండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కళాకారులు గుర్తింపు పొందిన మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ పొంది ఉండాలి. ఇతర వాయిద్యాలకు సంబంధించిన అభ్యర్థులు ఆయా ఈవెంట్లలో పాల్గొన్నట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్లు లేదా అవార్డుల సర్టిఫికెట్లను చూపించాల్సి ఉంటుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

అగ్నివీర్ (ఎంఆర్) పోస్టుల భర్తీలో భాగంగా రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలిదశలో.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. వీటిలో విజయం సాధించిన వారికి రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

- ఎంపిక ప్రక్రియలో కీలకంగా నిలిచే ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో భాగంగా పలు ఈవెంట్లలో పోటీ నిర్వహిస్తారు.
- **1.6 కిలో మీటర్ల పరుగు:** పురుష అభ్యర్థులు 6 నిమిషాల 30 సెకన్లలో, మహిళా అభ్యర్థులు ఎనిమిది నిమిషాల్లో పూర్తి చేయాలి.
- స్క్వాట్స్: పురుష అభ్యర్థులు 20, మహిళా అభ్యర్థులు 15 స్క్వాట్స్ చేయాల్సి ఉంటుంది. పురుష అభ్యర్థులు 12 పుషప్స్ చేయాలి. మహిళా అభ్యర్థులు 10బెంట్‌నీ సిటప్స్ పూర్తి చేయాలి.

ఐఎన్‌ఎస్ చిల్కాలో శిక్షణ

రాత పరీక్ష, పీఈటీలలో ప్రతిభ చూపిన వారికి చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే.. ఐఎన్ఎస్ చిల్కాలో ఆరు నెలలపాటు శిక్షణనిస్తారు. తాజా బ్యాచ్‌కు సంబంధించిన శిక్షణ నవంబర్‌లో ప్రారంభం కానుంది. ఈ శిక్షణ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. ఆయా విభాగాల్లో విధులు కేటాయిస్తారు. అన్ని ప్రక్రియల్లో విజయం సాధించి.. కొలువులు సొంతం చేసుకున్న వారికి నేవీ మ్యూజిక్ విభాగంలో నాలుగేళ్లపాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఈ సమయంలో వారికి అగ్నిపథ్ స్కీమ్‌ను అనుసరించి వేతనం అందిస్తారు.

25 శాతం మందికి

నాలుగేళ్ల వ్యవధిలో అగ్నివీర్ సర్వీస్ పూర్తి చేసుకున్న వారిలో 25 శాతం మందిని నేవీలో శాశ్వత హోదాలో సెయిలర్‌గా నియమిస్తారు. అందుకోసం ప్రత్యేక నోటిఫికేషన్ వెలువరిస్తారు. అందులో పేర్కొన్న ఎంపిక ప్రక్రియలో విజయం సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా అగ్నివీర్‌లుగా సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సీఏపీఎఫ్, అస్సాం రైఫిల్స్ నియామకాల్లోనూ పది శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.

వేతనం ఇలా

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యూజిషియన్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఏడాది ప్రాతిపదికగా నాలుగేళ్ల పాటు ఒక్కో ఏడాది ఒక్కో మొత్తంలో నెల వేతనం అందిస్తారు. మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున నెల వేతనం లభిస్తుంది. ఈ వేతనంలోంచి ప్రతి నెల 30 శాతం చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తుంది. ఇలా నాలుగేళ్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి.

వేతనంతోపాటు రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా అందిస్తారు. దీంతోపాటు నాన్ -కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి జీవిత బీమా కల్పిస్తారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే మరో రూ.44 లక్షల పరిహారం అందిస్తారు.

పట్టు సాధించేలా

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు.. తమకు ప్రావీణ్యం ఉన్న సంగీత విభాగాల్లో పట్టు సాధించేలా కృషి చేయాలి. పాటకు తగిన రీతిలో సంగీతం అందించేలా ఆయా వాయిద్య పరికరాలతో ప్రాక్టీస్ చేయాలి. రాత పరీక్ష లేకుండా.. కేవలం మ్యూజికల్ ఎబిలిటీని పరిశీలించే నేపథ్యంలో ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, జూలై 11.
- స్టేజ్–1 పరీక్ష తేదీ: ఆగస్ట్‌లో నిర్వహించే అవకాశం.
- స్టేజ్–2 పరీక్ష తేదీ: సెప్టెంబర్‌లో జరిగే అవకాశం.
- తుది జాబితా/ఫలితాల విడుదల: 2024, అక్టోబర్.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

రైతు కోటాలో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ఎంపీసీ విభాగం రైతుకోటాలో అసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తులు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. పూర్తి వివరాలను angrau.ac.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

బీమా పేరుతో భారం వేయవద్దు

పంటల బీమా మొత్తాలను రైతు ఖాతాల్లో జమచేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలకపార్టీ ఉచిత పంటల బీమాను మార్చే సాకుతో బీమా భారాన్ని రైతులపై వేసే యోచన విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలురైతుల సంఘాల సంయుక్త సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విజయవాడలో నిర్వహించిన సంయుక్త సమావేశం వివరాలను ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మంగళవారం మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమాను మార్చేందుకు టీడీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రైతుల భాగస్వామ్యం పేరుతో బీమా ప్రీమియం భారాన్ని రైతులపై వేసేందుకు ఈ ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. కరువు, వరదలు, తుపాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయే రైతులను ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ విషయాన్ని మరిచి రైతులపై భారం వేసే ప్రయత్నాలు చేస్తే రైతు ఉద్యమం తప్పదని చెప్పారు. ఈ విషయమై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఉద్యమం చేపడతామని, రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు రైతులు, కౌలురైతులు కదులుతారని తెలిపారు. రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సమన్వయంతో ఈ నెల 18, 19 తేదీల్లో గ్రామ సచివాలయాల్లో 'సామూహిక రాయబారాల' పేరుతో వినతిపత్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. 2023లో కరువు, తుపాన్లతో దెబ్బతిన్న పంటలకు పంటల బీమా పరిహారం రైతుల ఖాతాల్లో వేయాలని, కౌలు రైతులకు కూడా పంటల బీమా పరిహారం ఇవ్వాలని, రైతు సేవా (రైతు భరోసా) కేంద్రాలను బలపర్చాలని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతుసేవా కేంద్రాల ద్వారా అందించాలని, పెండింగులో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో వినతిపత్రాలు ఇస్తామని వారు వివరించారు.

11 నుంచి పాలిసెట్ తుది కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు తుది దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.నవ్య మంగళవారం తెలిపారు. ఏపీ పాలిసెట్- 2024లో అర్హత పొంది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 11–14 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన, ఆప్షన్ల నమోదు ప్రక్రియకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 16న సీట్ల కేటాయిస్తామని తెలిపారు. వివరాలను https://appolycet.nic.inలో పొందుపరిచామన్నారు. 18 నుంచి 20లోగా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అధ్యాపకుడి హత్యతో చలించిన ఒంగోలు

- అస్సాంలో హత్యకు గురైన అధ్యాపకుడు రాజేష్‌బాబు అంత్యక్రియలు పూర్తి
- విషాదంలో కుటుంబ సభ్యులు
- నాన్నకు ఏమైందని అడుగుతున్న చిన్నారులకు సమాధానం చెప్పలేక తల్లి సతమతం


హత్యకు గురైన అధ్యాపకుడు రాజేష్‌బాబు

ఒంగోలు టౌన్: అస్సాంలో విద్యార్థి చేతిలో హత్యకు గురైన ఒంగోలుకు చెందిన అధ్యాపకుడు బెజవాడ రాజేష్‌బాబు కుటుంబం ఇంకా ఆ విషాదం నుంచి కోలుకోలేకపోతుంది. రెండు రోజుల్లో ఇంటికి వస్తాడని ఎదురుచూసిన ఆయన తల్లి తల్లడిల్లిపోతుంది. మాటిమాటికీ నాన్న ఎప్పుడొస్తాడు మమ్మీ అంటూ అడిగిన ఆ చిన్నారులు గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిని చూసి బిక్కమోహం వేసుకుని బిత్తరచూపులు చూడడం అక్కడి వారందరినీ కన్నీళ్లు పెట్టిస్తున్నది. రసాయన శాస్త్రంలో ఉన్నత చదువునభ్యసించిన రాజేష్ 20 ఏళ్ల క్రితమే విశాఖపట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. ఆ తరువాత ఓ స్నేహితుడి ప్రోత్సాహంతో అస్సాంలోని గౌహతిలో సొంతంగా కళాశాల ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ కళాశాలకు మంచిపేరు వచ్చింది. దాంతో ఆయన అస్సాంలోనే శివసాగర్‌లో మరో బ్రాంచి ఏర్పాటు చేశారు. ఆయనకు చేదోడువాదోడుగా నిలిచిన భార్య అపర్ణ కళాశాల నిర్వహణలో తోడుగా ఉండేవారు. కళాశాల డైరెక్టర్‌గా వ్యవహరించేవారు. ఆ దంపతులకు ఇద్దరు సంతానం. ఏటా జూలైలో కళాశాలకు సెలవులు కావడంతో స్వగ్రామమైన ఒంగోలు వచ్చి తల్లి, బంధువులతో సరదాగా గడపడం ఆయనకు అలవాటు. ఈ ఏడాది కూడా అలాగే ప్లాన్ చేసుకున్నారు. కాకపోతే ముందుగా భార్యా పిల్లలను ఒంగోలుకు పంపించారు. ఈలోపు విధి వక్రీకరించింది. ఈసారి మాత్రం ఆయన మృతదేహం వచ్చింది.

హత్య తరువాత ఫేస్ బుక్‌లో మాట్లాడిన విద్యార్థి..

రాజేష్‌బాబు మీద కత్తితో దాడిచేసి చంపిన విద్యార్థిలో ఏమాత్రం పశ్చాత్తాపం కానీ, ఎలాంటి భయం కానీ కనిపించకపోగా విపరీతంగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ దాడిలో నెత్తుటి మడుగులో అధ్యాపకుడు రాజేష్‌బాబు పడి ఉంటే తాను మాత్రం ఆయన కుర్చీలో దర్జాగా కూర్చున్నాడు. అంతటిలో ఊరుకోకుండా ఫేస్ బుక్ ఆన్‌చేసి ఆన్‌లైన్‌లో ఏదో ఘనకార్యం చేసినట్లు మాట్లాడినట్లు తెలుస్తుంది. హత్యకు పాల్పడిన విద్యార్థి కుటుంబానికి నేరచరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది.

అసలేం జరిగిందంటే..

కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థికి గణితంలో మార్కులు తక్కువగా రావడంతో పాటుగా అతడి ప్రవర్తన బాగాలేకపోవడంతో శనివారం ఉదయం గణితం అధ్యాపకుడు మందలించారు. మీ పెద్దలను పిలుచుకుని రమ్మని ఆదేశించారు. ఇది జరుగుతున్నపుడు రాజేష్‌బాబు కూడా అక్కడే ఉన్నారు. దీంతో సదరు బాలుడు ఈ ఘటనను అవమానంగా భావించి శనివారం సాయంత్రం కత్తితో వచ్చి.. క్లాస్ చెబుతున్న రాజేష్‌బాబుపై ఒక్కసారిగా దాడి చేసి.. దొరికిన చోటల్లా కత్తితో పొడిచాడు. తల, ఛాతిపై పొడవడంతో ఆయన అక్కడికక్కడే కూలిపోయారు. హడలిపోయిన తరగతిలోని విద్యార్థులంతా కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశారు. కళాశాల సిబ్బంది వచ్చి ఆయనను వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

టీడీపీ 'బాధితులకు' వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం

యడ్లపాడు/నాదెండ్ల/ఫిరంగిపురం/తాడికొండ: ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేయగా గాయపడిన వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. గుంటూరు జిల్లా యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక సాయాన్ని అందజేసింది. బాధితులకు గుంటూరు మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. యడ్లపాడు మండలంలోని కారుచోలకి చెందిన పార్టీ కార్యకర్తలు మద్దూరి పోలు, తలతోటి దావీదు, నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన పార్టీ నేతలు చావా నరసింహారావు, గారా భాస్కరరావు కుటుంబాలను కావటి పరామర్శించి ఒక్కొక్కరికీ రూ.50,000 చెక్కును అందజేశారు. టీడీపీ దాడిలో ఫిరంగిపురంలోని శాంతిపేటకు చెందిన యువకులు సాయి, సాగర్ బాబు గాయపడగా వారిని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పరామర్శించి బాధితులకు రూ.50,000 చొప్పున సాయం అందజేశారు. తుళ్ళూరు మండలం వడ్డమానులో టీడీపీ కార్యకర్తలు గాయపరిచిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కార్యంశెట్టి వెంకటరావుకు రూ.50,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు.


నరసింహరావు, భాస్కరరావులకు చెక్కులను అందజేస్తున్న దృశ్యం

పోలవరం నిర్వాసితులకు తక్షణమే ప్యాకేజీ అమలు చేయాలి

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు, ఆ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తక్షణం అమలు చేయాలని ఏపీ రైతు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. విజయవాడలో మంగళవారం మూడు సంఘాల సంయుక్త సమావేశం వివరాలను నాయకులు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పోలవరం నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసితులను ఆదుకోవాలన్నారు. గిరిజనులు తరతరాలుగా అక్కడే స్థిర నివాసం ఉంటున్నారని, ఇప్పుడు ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తక్షణం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేసి ఆదుకోవాలనే 15 డిమాండ్లను ప్రస్తావించారు. విలేకరుల సమావేశంలో ఏపీ రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఏజీగా సాంబశివ ప్రతాప్

పవన్‌కళ్యాణ్ ఒత్తిడితో ప్రతాప్ పేరు ఖరారు



సాక్షి, అమరావతి: అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ)గా ఇవన సాంబశివ ప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ ఇన్‌చార్జ్ కార్యదర్శి సునీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాంబశివ ప్రతాప్‌ది పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం తిల్లపూడి. 1984లో ఆయన న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 40 ఏళ్లుగా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 1996–2002 మధ్య ఆంధ్రా ప్రాంత మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. 2016–19 మధ్య కాలంలో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. పలు ప్రభుత్వ రంగ సంస్థలకు, బ్యాంకులకు, బీమా కంపెనీలకు న్యాయవాదిగా సేవలు అందించారు. సౌమ్యుడు, వివాదరహితుడిగా పేరున్న సాంబశివ ప్రతాప్ జనసేన పార్టీ అవిర్భావం నుంచీ ఆ పార్టీకి న్యాయ సేవలు అందిస్తున్నారు. జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. తన నియామకంపై పవన్‌కళ్యాణ్‌కు సాంబశివ ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు.

గట్టిగా పట్టుబట్టిన పవన్

గతంలో మాదిరిగా ఈసారి కూడా అదనపు ఏజీ పోస్టును భర్తీ చేయకూడదన్న ఉద్దేశంతో టీడీపీకి చెందిన పలువురు తెరవెనుక గట్టిగా ప్రయత్నించారు. అయితే, అదనపు ఏజీ పోస్టును జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ గట్టిగా పట్టుబట్టారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు కరాఖండిగా చెప్పారు. రెండుసార్లు చంద్రబాబుతో ఈ విషయాన్ని ప్రస్తావించారు. పొత్తు ధర్మాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. దీంతో చంద్రబాబు కూడా అదనపు ఏజీ పోస్టును జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో సాంబశివ ప్రతాప్ నియామకానికి లైన్ క్లియర్ అయింది. ఈ పోస్టుకు టీడీపీకి చెందిన ఓ సీనియర్ న్యాయవాది లోకేశ్ ద్వారా చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చారు. ఓ దశలో ఏఏజీగా ఆ సీనియర్ న్యాయవాది పేరు దాదాపుగా ఖరారైంది. అయితే.. పవన్‌కళ్యాణ్ జోక్యంతో పరిస్థితి మారిపోయింది.

ఎన్టీటీపీఎస్ బాయిలర్‌లో ప్రమాదం

ఇద్దరికి తీవ్రంగా.. ముగ్గురికి స్వల్పంగా గాయాలు

ప్రమాదంపై కార్మిక సంఘాల ఆగ్రహం

ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎన్టీటీపీఎస్ 5వ స్టేజ్ బాయిలర్‌లో సోమవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాయిలర్‌లో తలెత్తిన సమస్యకు కార్మికులు, ఉద్యోగులు అడుగు భాగంలో చిన్నడోర్ వద్ద మరమ్మతులు చేపడుతున్న సమయంలో పైభాగంలోని పెద్ద డోర్ తెరుచుకుంది. దీంతో బాయిలర్‌లో ఉన్న వేడి బూడిద (యాష్) కార్మికులపై పడింది. ప్రమాదంలో వేముల అప్పారావు అనే కాంట్రాక్ కార్మికుడు, చక్రవర్తి అనే జేపీఏ (జూనియర్ ప్లాంట్ అటెండెంట్) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని గొల్లపూడిలో ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వేముల అప్పారావు 40% కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నాడు. చక్రవర్తి ముఖంపై వేడి బూడిద పడటంతో వైద్యం అందిస్తున్నారు. రవి, నవీన్, రామ్మూర్తిలకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స చేసి ఇంటికి పంపించారు. ఎన్టీటీపీఎస్‌లో యాజమాన్యం భద్రతా వైఫల్యంతో అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ నేతలు ఆరోపించారు. క్షతగాత్రులను సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఎం.మహేష్ పరామర్శించారు. వారు మాట్లాడుతూ..కార్మికులకు కనీస శిక్షణ ఇవ్వకపోవడం, పర్మినెంట్ ఉద్యోగుల పనులు కాంట్రాక్ట్ కార్మికులతో చేయించడం, రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943